నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 12-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 117 | పేజీలు: 8 | వెల: రూ.1/-

ఆర్‌పిఎల్‌ను ప్రారంభించిన మల్లారెడ్డి

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): స్కిల్ ఇండియాలో భాగంగా రికగ్నైజేషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్(ఆర్.పి.ఎల్) కార్యాచరణను క్యాంపు కార్యాలయంలో మంత్రి చామకూర మల్లారెడ్డి బుధవారం ప్రారంభించారు. స్కిల్ ఇండియా కార్యాచరణలో భాగంగా మీడియా అండ్ ఎంటర్‌టైన్మెంట్ స్కిల్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్.పి.ఎల్ ను ప్రారంభించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఎం.ఈ.ఎస్.సి. దక్షిణ ప్రాంతీయ సలహాదారు ప్రతిభ పులిజాల ఆధ్వర్యంలో డిసెంబర్ 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆర్.పి.ఎల్ కార్యక్రమం ద్వారా వ్యక్తుల నేర్చుకునే నైపుణ్యాలను గుర్తిస్తారన్నారు. 65 ఉద్యోగాలకు సంబంధించిన అంశాల్లో ఎం.ఈ.యస్.సి. వర్క్‌షాప్ కొనసాగనున్నట్లు చెప్పారు. ఈ సర్టిఫికెట్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో ప్రాధాన్యంగా తీసుకుంటారని పేర్కొన్నారు.

పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం ముందు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసిన టిఆర్ఎస్ ఎంపిలు

కేంద్ర నిధులపై టీఆర్ఎస్ ఎంపిల ఆందోళన

ఉభయసభల్లో గట్టిగా నినదించిన ఎంపిలు తక్షణం నిధుల విడుదల చేయాలని కెకె డిమాండ్

పార్లమెంట్ ముందు ప్లకార్డులతో నిరసన

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): పార్లమెంట్ ఆవరణలో టిఆర్ఎస్ ఎంపిలు ఆందోళన చేపట్టారు. బుధవారం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో టిఆర్ఎస్ ఎంపిలు నిరసనకు దిగారు. రాష్ట్రానికి కేంద్రంనుంచి రావాల్సిన నిధులు, జీఎస్టీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉభయ సభల్లో టిఆర్ఎస్ ఎంపిలు వాయిదా తీర్మానం ఇచ్చారు. వెనుకబడిన జిల్లాలకు రావాల్సిన నిధులు, ఆర్థిక సంఘం బకాయిలు, గ్రామీణాభివృద్ధి నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంత కుముందు రాజ్యసభలో జిఎస్టీ బకాయిలను విడుదల చేయాలని, దీనిపై చర్చించాలని పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు గట్టిగావాదించారు. అయితే దీనికి రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు అభ్యంతరం చెప్పారు. ఇప్పటికిప్పుడు చర్చించడం కుదరదని అన్నారు. నిధుల విడుదలకు ఆదేశించాలని కెకె ఛైర్మన్‌ను కోరారు.

అత్యాధునికంగా ఉద్యాన విశ్వవిద్యాలయం

అన్ని హంగులతో ఆధునిక కూరగాయల మార్కెట్
లాంఛనంగా ప్రాంభించిన సిఎం కెసిఆర్
అధికారులతో వివరాలపై ఆరా
గజ్వేల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
వెంటనడిచిన మంత్రులు, అధికారులు
భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

గజ్వేల్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ములుగులో నూతనంగా నిర్మించిన అటవీ కళాశాల, పరిశోధన కేంద్రాన్ని కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం కళాశాల ఆవరణలో సీఎం కేసీఆర్ మొక్క నాటారు. ఈ సందర్భంగా కళాశాలలోని సిబ్బంది, విద్యార్థులతో సీఎం ముచ్చటించారు. ప్రాంగణమంతా కలియతిరిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు కూడా నిర్మాణంతో పాట, వివిధ రకాల సౌకర్యాల ఏర్పాటుకు సంబంధించి వివరించారు. ఉద్యాన కళాశాలను 47కోట్ల వ్యయంతో నిర్మించారు. అత్యాధునిక హంగులతో ఇది రూపుదిద్దుకుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీష్ రావు, ఈటెల రాజేందర్, ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి. చీఫ్ కన్జర్వేటర్ రాధ, వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తమిళనాడులోని గట్టుపాలయం ఫారెస్ట్ కాలేజీ దేశంలోనే అత్యధిక సంఖ్యలో 120 మంది ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారులను అందించింది. అంతకంటే ఎక్కువమంది ఐఎఫ్ఎస్‌లను తెలంగాణ నుంచి తయారుచేసేందుకు వీలుగా దేశం గర్వించే రీతిలో ఫారెస్ట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భావించిన సీఎం కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా ములుగులో ఫారెస్ట్ కాలేజీ రూపుదిద్దుకున్నది. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఫారెస్ట్ కాలేజీని పూర్తిస్థాయి లేదా డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచడానికి ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో తాత్కాలికంగా కొనసాగుతున్న బీఎస్సీ ఫారెస్ట్రీ కోర్సులు నూతన క్యాంపస్‌లోకి మారనున్నాయి. 2020 నుంచి ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ తోపాటు ఏకకాలంలో ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఫారెస్ట్ కాలేజీ పరిపాలనా భవనాన్ని దాదాపు 12 ఎకరాల పరిధిలో, రెండు లక్షల చదరపు అడుగుల వైశాల్యంలో నిర్మించారు. దీని నిర్మాణానికి ప్రభుత్వం రూ.75 కోట్లు మంజూరు చేసింది. గజ్వేల్ నియోజవకవర్గం నర్సంపల్లి రిజర్వ్‌ఫారెస్ట్ బ్లాక్‌లో సువిశాల ప్రాంతంలో పరిపాలనా విభాగం, తరగతి గదులు, సెమినార్ హాల్స్, ల్యాబ్‌లు, హాస్టళ్లు, క్యాంటీన్‌లు, ఆడిటోరియం, రైతు హాస్టళ్లు, గెస్ట్‌హౌస్‌లు, పరిశోధనా విభాగాలను ఏర్పాటుచేశారు. అటవీవనరులు, అటవీ ఉత్పత్తుల యాజమాన్యం, వాటి వాడకం, అటవీ సాంఘిక శాస్త్రం, సామాజికశాస్త్రంతోపాటు వన్యప్రాణి శాస్త్రం, పట్టణాల్లో అడవుల పెంపకం, సుందరీకరణ, సిల్వికల్చర్ విధానాలపై వివిధ విభాగాలుంటాయి. ఇకపోతే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూడా సిఎం కెసిఆర్ ప్రారంభించారు. ఇందులో కూరగాయలతో పాటు మాంసం ఉత్పత్తులు కూడా లభించనున్నాయి. మార్కెట్ మొత్తాన్ని అధునాతనంగా తీర్చిదిద్దారు. ఇక్కడే కూరగాయలు ఖరీదుచేసిన సిఎం 2వేల రూపాయలు ఇచ్చి వారిని అభినందించారు. మార్కెట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గజ్వేల్ పరిధిలోని ములుగులో ఉద్యాన విశ్వవిద్యాలయావరణలో పైలాన్ ఆవిష్కరించిన సిఎం కేసీఆర్.

పౌరసత్వ బిల్లుపై రాజ్యసభలో వాడీవేడీ చర్చ

ఇది భారతీయ స్ఫూర్తికి విఘాతమన్న ఆనంద్‌శర్మ
సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్
తక్షణం బిల్లును ఉపసంహరించుకోవాలన్న కేశవరావు

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ బిల్లుపై ఇవాళ రాజ్యసభలో వాడీవేడీ చర్చ జరిగింది. చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపి ఆనంద్‌శర్మ ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఇది భారత సమాఖ్య స్ఫూర్తికి విఘాతమన్నారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్, అంబేద్కర్,మౌలానా అబ్దుల్ కాలాం ఆజాద్, నెహ్రూవంటి ఎందరో మహారుభావులు ముందుచూపుతో ఈ దేశానికి రాజ్యాంగాన్ని అందించారని అన్నారు. వారందరిని అవమానించేలా ప్రస్తు బిల్లు ఉందన్నారు. భారతీయ విలువలకు పౌరసత్వ బిల్లు విరుద్ధమని కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ వ్యాఖ్యానించారు. ఈ బిల్లు వివక్షతో కూడుకున్నదని అన్నారు. దేశ విభజనకు కాంగ్రెస్ కారణమంటూ ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని ఆనంద్ శర్మ కేంద్రంపై మండిపడ్డారు. దేశ విభజనకు కాంగ్రెస్ ఎప్పుడూ మద్దతు పలకలేదన్నారు. అమిత్ షా రాజకీయాలు పార్లమెంటు బయటే చేయాలన్నారు. రెండు దేశాల సిద్ధాంతం అనేది వీర్ సావర్కర్ ఆలోచనేనని శర్మ అన్నారు. ముస్లీం లీగ్‌ను బ్రిటీష్ వారే ప్రోత్సహించారని, కాంగ్రెస్ పార్టీపై నిషేధం విధించిందన్నారు. రెండు దేశాలు ఏర్పడటానికి ముస్లింలీగ్, హిందూ మహాసభలే కారణమని ఆనంద్ శర్మ ఆరోపించారు. బ్రిటీష్ వారి జోక్యాన్ని ఎందుకు ప్రస్తావించడం లేదని ఆయన అమిత్ షాను ప్రశ్నించారు. జిన్నా కూడా రెండు దేశాల సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేదని ఆయన వ్యాఖ్యానించారు. పౌరసత్వ బిల్లులతో రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తున్నారని ఆనంద్ శర్మ వ్యాఖ్యానించారు. ఇంత అత్యవసరంగా ఈ బిల్లును ఎందుకు ప్రవేశపెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంటు ప్యానెల్ పరిశీలనకు పంపాలని ఆయన అన్నారు. ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తామని చెప్పారు. ఈ బిల్లుతో భారత ఆత్మ క్షోభిస్తోందని అన్నారు. కేంద్రమంత్రి జితేందర్ సింగ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఈశాన్య రాష్ట్రాలు అభివృద్ధికి నోచుకోలేదని, గత ఐదేళ్ల నుంచే అక్కడ అభివృద్ధి జరుగుతోందని అన్నారు. గత 65ఏళ్ల జరగని అభివృద్ధి ఈ ఐదేళ్లలో ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిందని ఆయన తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. టీఆర్ఎస్ ఎంపీ కేశవ రావు బిల్లుపై మాట్లాడుతూ తక్షణం బిల్లును ఉపసంహరించాలన్నారు. అస్సాం ప్రజలు ఎందుకు భయపడుతున్నారో అర్థం చేసుకోగలరా అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. తాము ఈ దేశంలో పౌరులం కామేమో అన్న భయంతో కొందరు ఉన్నారని ఎంపీ కేశవరావు అభిప్రాయపడ్డారు. మతపరంగా మైనార్టీలుగా ఉన్నవారిని రక్షించుకోవాలన్నారు. కానీ ఏ ఒక్క వర్గాన్ని కూడా వెలివేయకూడదన్నారు. బిల్లుపై రెండవ అభిప్రాయం వద్దు అని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎంపీ కేశవరావు తెలిపారు. మతం ఆధారంగా దేశ విభజన జరిగిందన్న ఐడియాను తాను నమ్మడం లేదన్నారు. పౌరసత్వ సవరణ బిల్లు .. భారతీయ భావాన్ని సవాల్ చేస్తుందని టీఆర్ఎస్ ఎంపీ తెలిపారు.

దుండగుల కాల్పుల్లో భోజ్‌పురి నటుడు మిథిలేశ్ దుర్మరణం

పాట్నా,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): గుర్తు తెలియని దుండగులు ప్రముఖ భోజ్‌పురి నటుడు మిథిలేష్ పాశ్వాన్‌పై కాల్పులు జరిపారు. దీంతో ఆయన రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతూ కనిపించారు. వెంటనే స్థానికులు మిథిలేష్‌ని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కన్నుమూశారు. వివరాలలోకి వెళితే మిథిలేష్ పాశ్వాన్ తన వాహనంపై ఆధార్ పూర్ గ్రామానికి వెళుతున్నాడు. ఖాదీ బండార్ వద్దకి రాగానే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆయన వాహానానికి అడ్డంగా తమ బైక్‌ని పెట్టి మిథిలేష్‌పై కాల్పులు జరిపారు. కొన ఊపిరితో ఉన్న ఆయనని ఆసుపత్రికి తరలించగా, అక్కడ మిథిలేష్ మృతి చెందారు. ఆయన మృతికి సంబంధించి కేస్గు ÷ల్ చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్ వచ్చిన తరవాతనే తెలంగాణ అభివృద్ధి

24 గంటల కరెంట్,రైతుబంధుతో ఆదుకున్న ఘనత
డబుల్ ఇళ్లప్రవేశ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): సిఎం కెసిఆర్ వచ్చిన తరవాతనే తెలంగాణలో అభివృద్ధి కళ్లకు కడుతోందని, దీనిని ఎవరూ కాదనలేరని మంత్రిఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. 24 గంటల కరెంట్ఇచ్చిన ఘనత సిఎం కెసిఆర్‌దా కాదా అని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్,రైతుబంధు వంటి కార్యక్రమాలు గతంలో ఉన్నాయా అని ప్రశ్నించారు. అలాగని సమస్యలే లేవని తాను అనని, చేయాల్సిన పనులు ఇంకా చాలా ఉన్నాయని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మొదటిసారి రామచంద్రా పురంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తి కావటం సంతోషంగా ఉందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సంగెం మండలం రామచంద్రా పురం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు బుధవారం సామూహిక గృహ ప్రవేశం చేశారు. ఈ గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఈ ప్రాంతానికి వరం అని పేర్కొన్నారు. దీని వల్ల రాబోయే రోజుల్లో స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని ప్రశంసలు కురిపించారు. పెన్షన్ల మొత్తాన్ని రూ.2016 నుంచి 3016కు పెంచి పేదల ఆత్మగౌరవా న్ని పెంచారని అన్నారు. కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శం అని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ఆటంకా లు సృష్టించినా కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన మహా నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీ లేదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. పెన్షన్‌లో కేంద్రం వాటా 5శాతం లోపే ఉందన్నారు. ఇదే సమయంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై మంత్రి దయాకర్ రావు తీవ్రంగా స్పందించారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే సహించేది లేద ని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పరకా ల ఎమ్మెల్యే ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపికొండలను తలపిస్తున్న సిరిసిల్ల శివారు

గోదావరి బ్యాక్ వాటర్‌తో జలకళ
ట్వీట్ చేసి ఆనందం పంచుకున్న మంత్రి కెటిఆర్

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): గోదావరి బ్యాక్ వాటర్‌తో సిరిసిల్ల శివారు పాపికొండలను తలపిస్తున్నది. సిరిసిల్ల జలకళను సంతరించుకున్న తరుణంలో.. గోదారమ్మ పరవళ్లతో రైతుల కళ్ళలో చేరగనీ సంతోషం నిండుకున్నది అని కేటీఆర్ ట్వీట్ చేశారు. తెలంగాణను కోటి ఎకరాలను మాగాణంగా.. మార్చేందుకు వేసిన జల బాటలు.. అని ట్వీట్ చేసిన కేటీఆర్.. శ్రీరాజరాజేశ్వర ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కు సంబంధించిన ఫోటోలను షేర్ చేశారు. గోదావరి బ్యాక్ వాటర్ సిరిసిల్ల శివారుకు చేరుకోవడం సంతోషంగా ఉందని, సిరిసిల్ల ఎమ్మెల్యేగా గర్వపడుతు న్నానని కేటీఆర్ పేర్కొన్నారు. అపరభగీ రథుడు సీఎం కేసీఆర్ సంకల్పబలంతో గోదావరి మేడిగడ్డ నుంచి బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు దాటుకుంటూ శ్రీరాజరా జేశ్వర (మధ్యమానేరు) జలాశయాన్ని నిండుకుండలా మార్చి, మానేరు వాగు మీదుగా ఎదురెక్కింది. మేడిగడ్డ నుంచి 172 కిలోమీటర్ల దూరంలో మెట్ట ప్రాంత మైన రాజన్న సిరిసిల్ల జిల్లాను ముద్దాడింది. సముద్రమట్టానికి దాదాపుగా 1,250 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతానికి గోదావరి జలాలు రావడం చరిత్రను తిరగరాసి నట్లయింది. మరోవైపు కాళేశ్వరం జలాల రాకతో శ్రీరాజరాజేశ్వర జలాశయం జలకళను సంతరించుకొన్నది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మీదుగా గోదావరి తరలి వస్తుండడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా, మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకు 23.109 టీఎంసీలకు చేరిందని తెలిపారు. సిరిసిల్ల జలకళను సంతరించుకున్న తరుణంలో.. గోదారమ్మ పరవళ్లతో రైతుల కళ్ళలో చేరగనీ సంతోషం నిండుకున్నది అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

జనవరి నెలాఖరుకు గజ్వేల్‌కు కాళేశ్వరం పరుగులు

పర్యాటక కేంద్రంగా మల్లన్న సాగర్ అభివృద్ధి
గజ్వేల్ అడవులను అభివృద్ధి చేసి చూపాం
అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ ఇళ్లు నిర్మించి ఇస్తాం
ఎవరు ఎవరికి ఓటేసినా ఎన్నికల తరవాత అంతా మనవారే
ప్రతి ఇంటికి పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం
గజ్వేల్ నుంచే ప్రజల హెల్త్ ప్రొఫైల్ ప్రారంభం
గ్రామసర్పంచులంతా కథానాయకులు కావాలి
తెలంగాణ సాహితీ సౌరభాలు ప్రతిబింబించేలా ఆడిటోరియం
-మహతి ఆడిటోరియం నుంచి కేసీఆర్ ప్రసంగం

గజ్వేల్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): గజ్వేల్ నియోజకవర్గానికి వచ్చే ఏడాది జనవరి నెలఖారు నాటికి కాళేశ్వరం నీళ్లు వస్తాయని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. మల్లన్నసాగర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రతీ చెరువు, కుంట నిండి పంటలు పండినప్పుడే నిజమైన సంతోషం వస్తుందని సీఎం తెలిపారు. దేశమే ఆశ్చర్యపోయే విధంగా గజ్వేల్‌లో అడవులను పునరుద్ధరిస్తున్నామన్నారు. గజ్వేల్‌ను పచ్చగా చేయాలనుకున్నామని, అందుకు తగ్గట్టుగా చేసి చూపించామని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో అడవి విస్తరించిందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మహతి ఆడిటోరియాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ ఆడిటోరియంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామన్నారు. ఇల్లు లేనివారు ఉండకూడదన్నదే తన ప్రయత్నమని అన్నారు. ఎన్నికలప్పుడు ఎవరు ఏ పార్టీకి ఓటేసినా.. ఇప్పుడు అందరూ మనవాళ్లే. నియోజకవర్గాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలనే సంకల్పం ఉంది. ఆదర్శం ఉంటే అధికారులు పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని సీఎం స్పష్టం చేశారు. గజ్వేల్‌లో ప్రతీ మనిషికి చేతినిండా పని ఉండాలి. ప్రతీ ఇల్లు పాడి పరిశ్రమలో కళకళలాడాలి. నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తాం. దేశాన్ని, రాష్ట్రాన్ని ఆర్థికమాంద్యం పట్టిపీడిస్తోంది. ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తి ఎప్పుడూ విశ్రమించకూడదు. ఏ గ్రామంలో ఏముంది.. ఏం కావాలి అనే విషయంపై అవగాహన రావాలి. ఏ ఊరి సర్పంచ్ ఆ ఊరికి కథానాయకుడు కావాలి. ప్రజల మధ్య ఉండే ఏ రాజకీయ నాయకుడూ రిలాక్స్ కావొద్దు. ఇతరులు గజ్వేల్‌ను చూసి నేర్చుకోవాలి. ఏ గ్రామంలో ఏ పని లేకుండా ఉన్నవాళ్ళెవరు.. వాళ్లకేం పనివ్వాలో ఆలోచించాలి అని సీఎం కేసీఆర్ చెప్పారు. ప్రతి ఇంటికి పాడి పశువులు ఇచ్చి ప్రతి ఇళ్లు కళకళలాడాలని సీఎం అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఉండే వాళ్లందరికీ ఇళ్లు ఉండాలని అన్నారు. ప్రజలు అధికారులు, కలెక్టర్ల సేవలు వినియోగించుకోవాలని అన్నారు. గజ్వేల్ ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని సీఎం అన్నారు. ప్రతి కుటుంబానికీ ఏదో ఒక పని ఉండాలని పని లేకుండా ఉన్నవాళ్లకు పని పుట్టించాలని కేసీఆర్ అన్నారు. పైరవీలు లేకుండా, పార్టీలు లేకుండా ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని సమస్యలపై చర్చిద్దామని కేసీఆర్ అన్నారు.

గజ్వేల్ నుంచే హెల్త్ ప్రొఫైల్

ప్రతి మనిషికి హెల్త్ కార్డ్ ఉండేలా గజ్వేల్ నియోజకవర్గం నుండే హెల్త్ కార్డ్ లను ప్రారంభించేలా చర్యలు తీసుకోబోతున్నామని సీఎం కెసిఆర్ అన్నారు. త్వరలో ఒకరోజంతా మీతోనే ఉంటానని సీఎం కేసీఆర్ అన్నారు. కరెంట్ బాధలు ఇక లేవని అన్నారు. 7,500 ఎకరాల అటవీ భూమిని వనమూలికల పార్క్ గా అభివృద్ధి చేస్తామని కేసీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈరోజు ప్రారంభించారు. సిద్ధిపేట జిల్లా ములుగులో అటవీ కళాశాల, పరిశోధన కేంద్రాన్ని కేసీఆర్ ప్రారంభించారు. సీఎం కేసీఆర్ విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల భవనాలను 175 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించారు. కంటి వెలుగు పథకం మాదిరే రాష్ట్ర ఆరోగ్య సూచిక తయారు చేయాలనేది తన కోరిక అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు.అభివృద్ధి చెందిన దేశాల్లో హెల్త్ ప్రొఫైల్ ఉంటుంది. హెల్త్ ప్రొఫైల్ పక్రియను గజ్వేల్ నియోజకవర్గం నుంచే ప్రారంభించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కోరుతున్నాను అని సీఎం తెలిపారు. ఇది ప్రజలందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. ప్రజల వైద్య పరీక్షలకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలి. గజ్వేల్ నియోజకవర్గ ఆరోగ్య సూచిక వెంటనే రూపొందించాలి. ప్రతి కుటుంబ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళికలు తయారు చేయాలి. దేశానికి ఆదర్శంగా గజ్వేల్‌ను తీర్చిదిద్దాలి. త్వంలోనే గజ్వేల్ నియోజకవర్గం ప్రజాప్రతినిధులతో సమావేశం ఉంటుంది. గజ్వేల్ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకుందాం అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

మహతి అనే పేరు నేనే పెట్టాను

తెలంగాణ సాహితీ సౌరభం ఈ మహతి ఆడిటోరియం. మహతి ఆడిటోరియం నుంచి నలు దిశలా వెలుగులు ప్రసారించాలని తన కోరిక. ఈ హాల్‌కు మహతి అనే పేరు తానే పెట్టాను అని సీఎం కేసీఆర్ తెలిపారు. సంగీతంలో ఆరితేరిన వారు నారదుడు, తుంబురుడు. నారద మహర్షి వాయించే వీణ పేరు మహతి. జిల్లా కేంద్రాల్లో ఇలాంటి హాళ్లు నిర్మించేందుకు కృషి చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు హరీష్ రావు, ఈటెల రాజేందర్, ఇంద్రకరణ్ రెడ్డి,నిరంజన్ రెడ్డి, శ్రీనివాస గౌడ్, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామలింగా రెడ్డి,రసమయి బాలకిషన్ పాల్గొన్నారు.

దిశ నిందితుల ఇన్‌కౌంటర్‌పై విచారణ

రిటైర్డ్ జడ్జితో విచారణకు సుప్రీం ఆదేశాలు
ఎన్‌కౌంటర్‌పై పూర్తి వివరాలు ఉన్నాయని వ్యాఖ్య

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జీ చేత విచారణ జరిపించాలని నిర్ణయం తీసుకుంది. తర్వాత పిటిషన్ విచారణను గురువారానికి వాయిదా వేసింది. పీఎస్ మణి, ప్రసాద్ అనే అడ్వకేట్లు ఎన్‌కౌంటర్‌పై అనుమానం లేవనెత్తుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సాధారణంగా కింది కోర్టులు విచారణ చేపట్టే సమయంలో సుప్రీంకోర్టు కలుగజేసుకోదు. కానీ పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని భావించి.. రిటైర్డ్ జడ్జీ చేత విచారణకు ఆదేశించింది. దీనిని బట్టి ఎన్‌కౌంటర్‌ను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించిందని అర్థం చేసుకోవచ్చు. ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పూర్తి సమాచారం తమ వద్ద ఉందని సర్వోన్నత ధర్మాసనం పేర్కొన్నది. 11 మంది పోలీసులు సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేస్తే జాగ్రత్తలు తీసుకోలేదా అని భావించి ఈ మేరకు రిటైర్డ్ జడ్జీ చేత విచారణకు నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యం(పిల్) బుధవారం సుప్రీంకోర్టులో విచారణకు చేపట్టింది. ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తునకై సలహాలు, సూచనలతో రావాలని తెలంగాణ ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. అదే విధంగా ఈ కేసు విచారణకై విశ్రాంత న్యాయమూర్తులను సూచించాలని ప్రతివాదులకు సూచించింది. దిశ అత్యాచారం, హత్య కేసులో నిందితులను కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా చెబుతున్నారని, అది బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఈ ఘటనపై విచారణ జరిపించాలని ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయవాదులు పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శరద్ అరవింద్ బాబ్డే స్పందిస్తూ.. ఎన్‌కౌంటర్‌పై త

రాజ్యసభలో పౌరసత్వ బిల్లు ప్రవేశ పెట్టిన అమిత్ షా

ఇది ఎవరికీ వ్యతిరేకం కాదన్న హోంమంత్రి

వివిధ దేశాల నుంచి వచ్చిన శరణార్థుల కోసమే అని వివరణ

భారతీయ ముస్లింలకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య హోంమంత్రి అమిత్ షా బుధవారం రాజ్యసభలో వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును విపక్షాలు రాజకీయం చేయజూస్తున్నాయని, అయితే ఈ విధమైన బిల్లును తెస్తామని ఎన్నికల సందర్భంలో తమ పార్టీ మేనిఫెస్టో లో హామీ ఇచ్చామని ఆయన అన్నారు. ఈ దేశ ప్రజలు మాకు, ఈ మేనిఫెస్టోకు అనుకూలంగా ఓటు చేశారన్న విషయం తెలిసిందేనన్నారు. ఈ బిల్లు వల్ల ఇక్కడి మైనారిటీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పిన ఆయన.. పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌లలో మైనారిటీలుగా ఉన్న హిందువులు, బౌద్ధులు, జైనులు, క్రైస్తవులు, సిక్కుల వంటి వారికి భద్రత లేదని, వారు ఆయా దేశాల్లో వేధింపులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వారికి అక్కడ సమానత్వ హక్కులు లేవని, వారిని ఆ దేశాల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని అమిత్ షా చెప్పారు. అక్కడి లక్షలాది ముస్లిమేతరులకు ఈ బిల్లు ఆశాకిరణం అని ఆయన అభివర్ణించారు. భారతదేశ పౌరులైన ముస్లిములు అలాగే కొనసాగు తారని, వారి పట్ల వివక్ష ఉండబోదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఇతర దేశాల నుంచి వచ్చి భారతదేశంలో నివసిస్తున్న ముస్లిములకు భారత పౌరసత్వం ఇచ్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. భారతదేశంలోని ముస్లిం పౌరులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన హామీ ఇచ్చారు. తాము ప్రవేశపెట్టిన ఈ బిల్లు భారతదేశంలోని ముస్లిములకు వ్యతిరేకమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగం ప్రకారమే నరేంద్ర మోడీ ప్రభుత్వం నడుచుకుంటోందని, దేశంలోని మైనారిటీలకు సంపూర్ణ రక్షణ ఉంటుందని ఆయన చెప్పారు. భారతదేశంలో నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లోని మతపరంగా అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన ప్రజలకు భారత పౌరసత్వం ఇస్తామని ఆయన చెప్పారు. బిజెపి ఎన్నికల ప్రణాళికలో పౌరసత్వ సవరణ బిల్లును తీసుకొస్తామని వాగ్దానం చేశామని, ఆ ప్రకారమే దానికి చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని అమిత్ షా అన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలలో మతపరమైన మైనారిటీల జనాభా దాదాపు 20 శాతం చొప్పున తగ్గిపోయిందని, అక్కడి మైనారిటీలలో చాలా మంది హత్యకు గురికావడమో లేదా ఆశ్రయం కోసం భారత్‌కు పారిపోవడమో జరిగిందని ఆయన అన్నారు. లోక్‌సభలో ఈ బిల్లును ఆమోదించిన సంగతి విదితమే.. దిగువ సభలో పాలక బీజేపీ, దాని మిత్ర పక్షాలకు మెజారిటీ ఉన్న కారణంగా బిల్లుకు అనుకూలంగా 311 ఓట్లు, ప్రతికూలంగా 80 ఓట్లు వచ్చాయి. కానీ రాజ్యసభలో పరిస్థితి వేరు.. 240 మంది సభ్యులున్న ఈ సభలో మెజారిటీ మార్క్ 121. అన్నా డీఎంకె, జేడీ-యు, అకాలీదళ్ వంటి మిత్ర పక్షాలతో కూడిన ఎన్డీయేకి 116 మంది సభ్యులున్నారు. బిల్లు నెగ్గాలంటే మరో అయిదుగురి మద్దతు అవసరమవుతుంది. ఈ బిల్లును నిరసిస్తూ ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి.

పసల్ బీమా యోజనపై చైతన్యం

రైతులకు వివరిస్తున్న అధికారులు

జనగామ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ప్రధాని ఫసల్ బీమా యోజన పథకం గురించి పెద్ద ఎత్తున రైతుల్లో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ అధికారులు అవగాహన సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో రైతులు పంట రుణాలను తీసుకోనప్పటికీ బ్యాంకుల్లో నేరుగా ప్రీమియం చెల్లించే అవకాశం ఉంది. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వారు బీమా ప్రీమియంను స్వీకరిస్తున్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి పంటల బీమా యోజన పథకాన్ని రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టింది. అయితే ఇప్పుడిప్పుడే రైతుల ముంగిటికి బీమా పథకం చేరుతోంది. మొన్నటి వానాకాలం సీజన్‌లో రైతుల్లో కొంత మేరకు చైతన్యం రాగా, ఆశించిన మేరకు రైతులు పంటల బీమా చేయించుకున్నారు. యాసంగిలో రైతులు సాగు చేస్తున్న పంటల బీమా ఖరారైంది. ఈసారి జిల్లాలో సాగునీటి సౌకర్యం మెరుగుపడడంతో పంటల సాగువిస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రతీ వర్షాకాలం సీజన్‌లో రైతులు పంట రుణాలను బ్యాంకుల ద్వారా తీసుకోనుండగా బ్యాంకర్లు ముందే ప్రీమియంను చెల్లింపులు చేస్తారు. ప్రధానంగా జిల్లా పరిధిలో వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలను యాసంగి పంటల్లో రైతులు అధికంగా వేస్తుంటారు. వడగళ్ల వర్షంతో పాటు, ప్రకృతి వైఫరీత్యంతో జరిగిన నష్టం నుంచి బయటపడేందుకు బీమా పథకం వినియోగపడుతుందని ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లా పరిధిలో ఈ యాసంగిలో గతం కన్నా ఎక్కువ మొత్తంలో సాగునీటి నిల్వలు ఉండగా రైతుల్లో ఉత్సాహం నెలకొంది. దీంతో ఎక్కువ స్థాయిలో వరి, మొక్కజొన్న వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌కు సంబంధించి ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటల పైనే రైతులు దృష్టి సారిస్తున్నట్లు అధికారులు చెపుతున్నారు. పంట రుణాలు పొందే రైతులతో పాటు రుణం పొందని రైతులు కూడా ఈ బీమా పథకాన్ని వినియోగించుకునే అవకాశం ఉంది. వర్షాకాలం సీజన్‌లో బ్యాంకర్లు పంట రుణాలను అందిస్తున్న క్రమంలో బీమా చెల్లింపులను కూడా తీసుకునే అవకాశం ఉంది.

గోద్రా అనంతర అల్లర్లలో మోడీకి క్లీన్ చిట్

-నివేదిక సమర్పించిన నానావతి కమిషన్

గాంధీనగర్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): గోద్రా రైలు దహనం తర్వాత 2002లో జరిగిన అల్లర్ల కేసులో నరేంద్ర మోదీ నేతృత్వంలోని నాటి గుజరాత్ సర్కార్‌కు క్లీన్ చిట్ లభించింది. అల్లర్లకు.. అప్పటి మోదీ సర్కార్‌కు ఎలాంటి సంబంధం లేదని నానావతి - మెహతా కమిషన్ తెలిపింది. గుజరాత్ అసెంబ్లీకి తమ నివేదికను బుధవారం సమర్పించిన ఈ కమిషన్.. ఆ అల్లర్లు ఒకరి ఆధ్వర్యంలో జరిగినవి కావని తేల్చిచెప్పింది.

2002 ఫిబ్రవరి 27న అల్లరి మూకలు సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలుకు నిప్పు పెట్టాయి. దీంతో ఎస్-6 కోచ్‌లో ప్రయాణిస్తున్న మొత్తం 59 మంది సజీవదహనం అయ్యారు. మృతుల్లో అయోధ్య నుంచి తిరిగి వస్తున్న కరసేవకులే అత్యధికంగా ఉన్నారు. ఈ ఘటన కారణంగా గుజరాత్‌లో పెద్ద ఎత్తున మత ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మారణహోమం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. దీనిపై స్పందించిన ఆనాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి .. రాజధర్మం పాటించలేదంటూ గుజరాత్ సీఎంగా ఉన్న మోదీకి చురకలంటించారు. గోద్రా రైలు దుర్ఘటన అనంతరం చెలరేగిన ఘర్షణలు వ్యవస్థీకృతంగా చేసినవి కాదని, వీటిని నియంత్రించడంలో పోలీసులు విఫలం అయ్యారని నానావతి కమిషన్ తన నివేదికలో పేర్కొన్నట్లు పీటీఐ వార్తా సంస్థ తెలిపింది. వెయ్యికి పైగా మైనార్టీలు చనిపోయిన ఈ అల్లర్ల కేసులో అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, ఆయన క్యాబినెట్‌లోని మంత్రులకు నానావతి కమిషన్ క్లీన్ చిట్ ఇచ్చిందని ది హిందూ దినపత్రిక పేర్కొంది.

టెక్స్‌టైల్స్ పార్కును సందర్శించిన కొరియా బృందం

వరంగల్ రూరల్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): గీసుకొండ మండలంలోని శాయంపేట వద్ద నిర్మిస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కును కొరియాకు చెందిన యంగ్‌వన్ కార్పొరేషన్ ఛైర్మన్ కిహక్‌సంగ్ బుధవారం ఉదయం సందర్శించారు. కంపెనీ ప్రతినిధులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గండ్ర జ్యోతి స్వాగతం పలికారు. పార్కులో కొరియా బృందానికి 300 ఎకరాలు కేటాయించడంతో పార్కు పనులను కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉండటంతో ఆయన ఇక్కడికి వచ్చారు. అనంతరం హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శితో కంపెనీ ఏర్పాటుపై చర్చించనున్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు

యాదాద్రి భువనగిరి, డిసెంబర్11 (ఆర్ఎన్ఎ): అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో పూర్తిస్థాయి ప్రవేశాలు కల్పించడంతోపాటు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు సరిపడ మంచాల కోసం వసతిగృహాల వారీగా ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును సమీక్షిస్తూ గ్రామాల వారీగా గర్భిణుల సంఖ్య, తదితర వివరాలను సేకరించి వారికి కావాల్సిన పౌష్టికాహారం అందించాలన్నారు. జిల్లాలో భూసార పరీక్షలు నిర్వహించి అనువైన పంటల సాగుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. నేల స్వభావం మేరకు పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. విత్తనాలను ఉత్పత్తిచేసే గ్రామాలను గుర్తించి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. పంటల బీమా పథకాన్ని ప్రతి రైతు వినియోగించుకునేలా ప్రచారం నిర్వహించి వారిని చైతన్యపరచాలన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం

ఖమ్మం,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్ పార్టీ ఏకైక లక్ష్యంగా పెట్టుకుందని జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. కాంగ్రెస్ పార్టీని తరిమికొడితేనే రాష్ట్రం బాగుపడుతుందని ఆయన ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. తెలంగాణలో మరో 20 ఏండ్ల పాటు కేసీఆరే ముఖ్యమంత్రిగా ఉంటారని చెప్పారు. కేసీఆర్ చేపట్టే పథకాలే ఆయనకు శ్రీరామ రక్ష అని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ వ్యవసాయం పండుగలా మార్చారని అన్నారు. అన్నదాత ఆనంద పడేలా పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసే ఆరోపణలన్నీ ఉత్తరకుమార ప్రగల్భాలేనని విమర్శించారు. రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో కరువు జిల్లా రైతుల ముఖంలో నవ్వులు పూస్తాయన్నారు. పక్కనే కృష్ణానది పారుతున్నా గత పాలకులు కనీసం ప్రజల గొంతు తడపలేకపోయారని విమర్శించారు. మిషన్ భగీరథ పథకంతో ప్రజలకు ఫ్లోరైడ్ భూతం నుంచి బయటపడుతారన్నారు. కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రిని ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూసుకోవాన్నారు. గ్రామాల్లో గతులకు రోడ్లకు కాలం చెల్లిందని చెప్పారు. గ్రామాల్లోని రోడ్లు అద్దంలా తయారయ్యాయని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

కొత్తగూడెం,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): కడుపులో బిడ్డపడ్డప్పటి నుంచి తల్లీ బిడ్డల సంక్షేమం అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరుగుతుందని జడ్పీ ఛైర్మన్ కోరం కనకయ్య అన్నారు. కేసీఆర్ కిట్, అమ్మ ఒడి పథకాలతో ప్రభుత్వ దవాఖానల్లో కాన్పుల సంఖ్య పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాతాశిశు మరణాల రేటును తగ్గాయని తెలిపారు. రాష్ట్రంలో మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. దేశంలోని 9 రాష్ట్రాలలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ యోజన పథకం ఏ విధంగా అమలవుతుందనే దానిపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సాథి ప్రతినిధులు పరిశీలన చేస్తున్నారు. గర్భిణులకు కాన్పు సమయంలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వ దవాఖానలలో గర్భిణులకు వైద్యసేవలందించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయన్నారు.

జిల్లా అభివృద్ధికి నిధులు సాధించేందుకు కృషి

మహబూబాబాద్,డిసెంబర్11 (ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి జిల్లాకు రావాల్సిన అన్ని రకాల నిధులు, పథకాలను, మంజూరు కావాల్సిన కేంద్రాలను సాధించడం ద్వారా జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేద్దామని ఇందుకు అధికారులు సహకరించాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. నవోదయ స్కూల్, కృషి విజ్ఞాన కేంద్రానికి సంబంధించిన విత్తన పరిశోధనా కేంద్రాలు, ఫ్రూట్ ప్రాసెసింగ్ సెంటర్‌తో పాటు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు రూపొందించి పంపిస్తే తాము కేంద్రం నుంచి మంజూరు చేయిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి జిల్లాకు రావాల్సిన అన్ని నిధులను, పథకాలను, మంజూరు కావాల్సిన కేంద్రాలను సాధించడం ద్వారా జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేద్దామని అన్నారు. ఇందుకు అధికారులంతా సహకరించాలని నీతారాంనాయక్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాకు వివిధ పథకాల ద్వారా మంజూరు కావాల్సిన నిధులను, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రతి అంశాన్నీ అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేసి అమలుచేయాలన్నారు. అమలులో ఎలాంటి జాప్యం చేయరాదన్నారు.

లక్ష్యాన్ని పూర్తిచేస్తున్నాం

జనగామ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): లింగాలఘనపురం మండలంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కావస్తోందని అధికారులు తెలిపారు.

నిర్దేశించిన లక్ష్యానికి చేరువలో ఉన్నామని ఎంపీడీవో తెలిపారు. మండలంలో 17గ్రామ పంచాయతీలు ఉండగా పటేలుగూడెం, బండ్లగూడెం గ్రామాల్లో పూర్తి అయ్యాయన్నారు. ఈ రెండు గ్రామాల్లో 140పూర్తి చేశామన్నారు. ఈ నెల 15వరకు మరో ఏడు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

ఈ నెలాఖరువరకు అన్ని గ్రామాల్లో పూర్తిచేసి లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. మండలంలోని పటేలుగూడెం, వడిచర్ల, నవాబుపేట గ్రామాల్లో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణాల ప్రగతిని ఆయన పరిశీలించారు.

తెలంగాణ సాహితి 4వ లిటరరీ ఫెస్ట్

ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న అనందాచారి, వెంకటేశ్వర్లు, నరహరి తదితరులు

తెలంగాణ సాహితీ 4వ లిటరరీ ఫెస్ట్' సందర్భంగా హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 2019 డిసెంబర్ 14 నుంచి 16 వరకు మూడు రోజులు సాహిత్య సదస్సు జరుగుతుంది. 14న ప్రారంభ సమావేశం ఉదయం 11 గంటలకు ఉంటుంది. కె. అనందాచారి అధ్యక్షతన జరుగు సభలో సదస్సు ప్రారంభకులుగా నందిని సిధారెడ్డి, ముఖ్య అతిథిగా మంగలేష్ దబ్రాల్ హాజరయ్యారు.

'తెలుగెత్తి జెకొట్టు' గ్రంథాన్ని కె.శివారెడ్డి ఆవిష్కరిస్తారు. గౌరవ అతిథులుగా సీ. మృణాళిని, ఎండ్లూరి సుధాకర్, ఖాదర్ మొహియుద్దీన్, యాకూబ్, జూలూరు గౌరీశంకర్, తెలకపల్లి రవి, చంద్రబోస్, మువ్వా శ్రీనివాసరావు, సూర్య ధనుంజయ్ హాజరవుతారు. మూడు రోజుల్లో వివిధ సెషన్లకు అధ్యక్షులుగా తంగిరాల చక్రవర్తి, ఖాజామైనొద్దీన్, మండవ సుబ్బారావు, భూపతి వెంకటేశ్వర్లు, స్పూఇర్త, పి. రాములు, వెన్నెల సత్యం, సలీమ, వహీద్‌ఖాన్, కటుకోఝ్వుల రమేష్, పురిమళ్ల సునంద, జి. నరేష్ వ్యవహరిస్తారు.

ముఖ్య అతిథులుగా ఆర్. సీతారాం, పిల్లలమర్రి రాములు, ఎస్.రఘు, ప్రసేన్, గుడిపాటి, పంతంగి వెంకటేశ్వర్లు, ఎస్. త్రివేణి, తిరునగరి చక్రధర స్వామి, బెల్లి యాదయ్య పాల్గొంటారు. విశిష్ట అతిథులుగా పొల్కంపల్లి శాంతాదేవి, కూరెళ్ల విఠలాచార్య, ముదిగంటి సుజాతారెడ్డి, తాటికొండల నరసింహారావు, కాలువ మల్లయ్య, తెలిదేవర భానుమూర్తి, అంపశయ్య నవీన్, చక్రవర్తుల లక్ష్మీనరసయ్య, మోతుకూరి నరహరి, మాల్యశ్రీ, జిలానీ బాను, సుధామ, వేణు సంకోజు, తిరునగరి దేవకీదేవి, మన్నెం శారద తదితరులు హాజరవుతారు. వల్లభాపురం జనార్దన్ అధ్యక్షతన జరుగు ముగింపు సమావేశంలో జె. చెన్నయ్య, ఆచార్య టీ. గౌరీశంకర్, కె. అనందాచారి పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే.

కథకుడికి పరిశీలన శక్తి ఉండాలి..

'అక్కన్నపేట రైల్వే స్టేషన్' కథా సంపుటి ఆవిష్కరణలో కవి శివారెడ్డి



ఆవిష్కరణలో కవులు కె.శివారెడ్డి, డా॥నందిని సిధారెడ్డి, రచయిత డా॥ఎం. అయోధ్యారెడ్డి, డా॥ఏనుగు నరసింహారెడ్డి, కందుకూరి శ్రీరాములు, కె.పి.అశోక్‌కుమార్ తదితరులు.

కథకుడికి పరిశీలన శక్తి ఉండాలని ప్రముఖ కవి కె.శివారెడ్డి అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సోమవారం రాత్రి భాషా సాంస్కృతిక శాఖ, మంజీరా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డా॥ఎం. అయోధ్యారెడ్డి రచించిన 'అక్కన్నపేట రైల్వేస్టేషన్' కథా సంపుటి ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డా॥నందిని సిదారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ నేటి సమాజానికి దిశా నిర్దేశం చేసే కథలు డా॥ అయోధ్యారెడ్డి రచించారని కొనియాడారు. కథలోని శిల్పం, భాష, శైలిలను సమన్వయంగా నడిపించే శైలి ప్రత్యేకమైనదన్నారు. ఆయన చుట్టూ ఉండే మనుషుల గురించి రచనలు చేశాడని అంటూ నేటి తరం ఈ కథలను చదవాలని సూచించారు. ప్రసిద్ధ కథారచయిత, విమర్శకులు ఆడెపు లక్ష్మీపతి, కస్తూరి మురళీకృష్ణ పుస్తకాన్ని విశ్లేషించారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ సాహిత్య విమర్శకులు కె.పి. అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నిజాలు

ఎండిన జీవితంలో.. తెంపుడుతున్న ఒంటరితనం
గతమంతా వసంతంలా
నాటి లేసుబంధాలతో పరిమళించి
కాలచక్రమనుబంధంలో.. శిశిరమై మోడుగా మిగిలింది
నీడలేని బతుకులో కూడుకు దిక్కేది..?
కనిపోతున్న పాడ్డులో అందమైన రంగులేవీ..?
చిరిమసిజీవితో.. బంధాలన్నీ భ్రమలేనా..?

- కెరె జగదీష్



నా లీవ్ లెటర్



అనుభవాలు పాఠాలు-6

ప్రతి వ్యక్తీ, ఈ అనంత జన ప్రవాహంలో 'సమూహంలో ఒకడు'గా జీవిస్తున్నవాడే!

ప్రతివ్యక్తీ, రోజూ ఏవేవో కొత్త అనుభవాల్ని ప్రోపు చేసుకుంటున్నవాడే!

ప్రతివ్యక్తీ, బ్రతుకుబడిలో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థే!

ఆ వ్యక్తిని ఆవరించుకుని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, సహాధ్యాయిలు, ఉపాధ్యాయులు, ఉద్యోగంలో చేరాక పై అధికారి, సహ ఉద్యోగి, సబార్డినేటులు, ఆ సంస్థతో లావాదేవీలు నడిపే వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు, ఇంటిచుట్టూ ఉన్న ఇరుగు పొరుగూ, రోజూ 'వాకింగ్'లో కనబడే పరిచయస్తులు ఇలా వీళ్ళందరితోనూ అనుభవాల్ని ప్రోపుకుంటున్నాడు.

ప్రతీ అనుభవం- తనది కావచ్చు లేదా ప్రక్కవారిది కావొచ్చు- లోంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగటంలోనే విజ్ఞత ఉంది. ఏడున్నర దశకాల కూర చిదబంరం జీవితంలో ఎదురైన అనుభవాలు, వాటిలోంచి నేర్చుకోగలిగే పాఠాలే ఈ "అనుభవాలు-పాఠాలు"-!

- సంపాదకులు

నా ఛార్టెర్డ్ ఎక్కౌంటెన్సీ చదువు అప్పుడప్పుడే పూర్తి అయింది. సి.ఏ. పట్టా ఇంకా చేతికి రాలేదు. ముందు నేను చేస్తున్న ఉద్యోగం నా బీకాం క్వాలిఫికేషన్‌తో దొరికింది. క్రొత్త ఉద్యోగాన్వేషణలో పడ్డాను. ఎందుకంటే నేను ఉద్యోగం చేస్తున్న యజమానికి సి.ఏ. క్వాలిఫికేషన్ కేండిడేటు అవసరంలేదు.

'ఫరవాలేదు' అనిపించిన ఓ కార్పొరేట్ సంస్థలో జాయిన్ అయ్యాను. క్రొత్తగా స్థాపించబడిన సంస్థ అది. ఎక్కౌంటెంట్, పర్చేజ్ ఆఫీసరు ఫౌండ్రీ మేనేజరు. కంపెనీ సెక్రటరీ మరియు మా ఎం.డి. అయిదుగురం మాత్రమే పనిచేసేవారం. అయినా రూల్స్ రెగ్యులేషన్స్ అంతా ఓ పద్ధతి ప్రకారం నడిచేవి.

క్రొత్తగా స్థాపించబడుతోన్న కంపెనీ కనుక మేం రోజూ పది పన్నెండు గంటలు పనిచేయవలసి వచ్చేది. అయినా, ఆఫీసులోని సుహృద్భావ వాతావరణంవల్ల మాకు చేస్తున్న పనిలో విసుగూ అలసట అనిపించేవి కావు.

మా కంపెనీలో లీవు రూల్స్ అంటూ ఉండేవి. ఆకస్మిక అత్యవసరాలకు "కేజువల్ లీవు" అని ఏడాదికోసారి వాడుకునేందుకు వీలుగా 'ఎర్న్‌డ్‌లీవు' అని ఉండేది.

నాకున్న కొద్దిమంది స్నేహితులలో ఓ ముఖ్యమైన స్నేహితుడి పెళ్ళి. నిజానికి నేను కనీసం రెండురోజుల ముందైనా వెళ్ళి పెళ్ళిపనులు చూసుకోవాల్సినంత ఆప్తుడాయన. ఆ స్నేహితుడితోనే కాకుండా స్నేహితుడి కుటుంబసభ్యులందరూ నన్ను వాళ్ళ కుటుంబంలోని వ్యక్తిగా గౌరవం ఇచ్చేవారు.

పెళ్ళికి కుటుంబంతోసహా అంటే నేను మా ఆవిడా ఏడాది అబ్బాయితో సహా తప్పకుండా రెండు రోజులముందే వస్తానని ప్రామిస్ చేసాను.

అందుకు నా స్నేహితుడు నవ్వి "పెళ్ళికి తప్పకుండా రావాలి" అంటూ మరీ మరీ చెప్పి వెళ్ళాడు.

రోజూ తలమునకలయ్యేంత పని. ఎందుకైనా మంచిదని వారంరోజుల ముందే నా లీవు లెటర్ మా యం.డి. ముందుంచాను.

"చూద్దాం" అన్నాడు. నా లీవ్ లెటర్‌ను జాగ్రత్తగా నాలుగు మడతలు పెట్టి వెనక్కి ఇచ్చాడు.

ముందే చెప్పి పెట్టాను కనుక నా లీవు తప్పకుండా "సాంక్షన్" అవుతుందన్న ధీమా ఉండింది.

రెండురోజుల ముందునే మా ఆవిడ్ని బట్టలూ అవీ సర్దుకోమన్నాను. ట్రయిన్ టిక్కెట్లు కూడా తీసి ఉంచాను. రోజూ నేను ఇంటికి చేరే పనిగంటలు గమనిస్తున్న మా ఆవిడ "చూద్దాంలెండి" అంది యథాలాపంగా.

మా ఆవిడ "క్యాజువల్‌నెస్"కి నాకు కోపం వచ్చింది.

"చూస్తూ వుండు మనం తప్పక రేపు సాయంత్రం మద్రాసు (చెన్నై) వెళ్తున్నాం." అంటూ మా ఆవిడకు భరోసా ఇచ్చాను.

మర్నాడు ఆఫీసు చేరగానే గుండెల్లో రాయిపడినంత వార్త ఒకటి నా టేబిల్ పైన నన్ను చూసి నవ్వుతున్నట్లు కనిపించింది.

మా కంపెనీకి ఆర్థికసాయం అందించిన సంస్థ వారినుండి వచ్చింది. ఆ సంస్థ హెడ్ ఆఫీసువారి సిబ్బంది మా కంపెనీకి 'తనిఖీ'కి వస్తున్నారు.

అది సరిగ్గా మా స్నేహితుడి పెళ్ళిరోజునాడే! ఎక్కౌంట్స్ వ్యవహారాన్ని చూసుకుంటున్నది నేనొక్కడినే...? నా ఉత్సాహమంతా నీరుకారి పోయింది.

ముందే చెప్పి ఉంచాను కదా. అందుకని బాసు లీవు లెటరు తప్పకుండా ఒప్పుకుంటాడని. ఎక్కడో మిణుకుమిణుకు మనే ఆశ!

ఆనాటి సాయంకాలం నా లీవులెటర్ "యం.డి." ముందర ఉంచాను. 'ప్రాణ స్నేహితుడి పెళ్ళి' అన్నాను. 'తప్పక వెళ్ళాలి' అన్నాను.

నా లీవులెటరును చూడకుండానే 'అవుట్ ట్రే'లో వేసాడు. నావేపు తిరిగి ఇలా అన్నాడు.

"చూడు. ప్రపంచంలో 'ముఖ్యమైన' పెళ్ళి అంటూ ఏదీలేదు. నీ పెళ్ళి తప్ప. ఎందుకంటే తాళి కట్టాల్సింది నువ్వు కనుక. అందుకని నువ్వు ఈ పెళ్ళికి వెళ్ళకపోతే పెళ్ళి ఆగిపోదు". కాని ఇక్కడ నువ్వు లేకపోతే ఇన్స్‌పెక్షన్ ఆగిపోతుంది. ప్రోగ్రెస్ దెబ్బతింటుంది.

"ఒకనాటి రాజులు, సర్వాధికారులు. వాళ్ళు తలుచుకుంటే జరగనిది ఏదీలేదు. అయినా, వాళ్ళ వాళ్ళ స్వంత పెళ్ళిళ్ళు కూడా రాజులు వెళ్ళకపోతే ఆగేవికావు. రాజుగారు తన బంధుమిత్రులతో తన కత్తిని అత్తవారింటికి పంపేవాడు. పెళ్ళిలో ఆ కత్తికే బాసిగం కట్టి పె

నేటినిజం
సాహితీ కిరణాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 12-12-2019 ఎడిటర్: భైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

నమ్మలేని నిజాలు

కడుపుకాలి
వీధి కుక్కల దాడి
కాటుకు వేటు
సూర్యచంద్రులు
జనుల వెంటేవారు
వీడని నీడ
వివాహ తంతు
పలురకాలు భువి
పవిత్ర కార్యం
అసత్య మార్గం
నడుస్తున్న చరిత్ర
వేయపుట్టాలి.
నేతల స్పీచు
నమ్మితే నట్టేట్లో
తెలివి రాలే

– రేడియమ్
9291527757

శ్రీనిజాయి

నిన్నమొన్నపడున్నాయి
మూల కన్ని కుళ్ళి
ధరలండోయ్
ధరలంటూ
ఉల్లి మీద లొల్లి
ఎన్నిఉంటె ఏమి, ఉల్లి
ఘాటు లేదంటె చిక్కే
ఉల్లి ధరలుచూస్తుంటే
ఎవరెస్టు శిఖరమెక్కే

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

నిన్నటి గతానికి నేటి నీవే పునాది

ఆకాశాన్ని తాకుతూ
కొమ్మలు కొమ్మలుగా విస్తరించి
ఆకుపచ్చగా నిగనిగలాడుతున్న చెట్టు
వర్తమానమీ దృశ్యం

పిట్టలబారిన పడని గింజ
నిండా మట్టిని కప్పుకుని
చీమలకు చిక్కని అంకురమై
భూమి లోలోపలి పొరల్లోకి
వేర్లను పాకించి, నిలదొక్కుకుని
ఇప్పుడు కనిపించే అనుభవాల చెట్టైంది

మనిషికీ గతం ఓ అనుభవం
మంచీ చెడుల సమ్మిళితం
అయితేనేమి
గతం పునాదిపై
నీ వర్తమానం నిర్మితమవుతుంది
నేటి నీవు నిన్నటి సారమే

ఆనంద కుసుమాల జీవన గుచ్చంలో
చేదు జ్ఞాపకాల ముళ్ళు మరవనీయవు
భవితలోని నిన్ను ఊహిస్తూ
తలచలేనివన్నీ మృతమేనంటూ
మెదడుతో యుద్ధమైనా చెయ్యి
విషపు గతాన్ని పునరావృతం చేయకు

నీవూ
నేడు కళకళలాడుతున్న
రేపటి చెట్టువు
గతం
రాలిపోయిన ఎండుటాకు
కాల గర్భంలో జీర్ణించుకుపోతుంది
అదిగో...
పచ్చటి ఆకులు చూడు
చిగురిస్తున్న
నీ భవిష్యత్ కనిపిస్తుంది కదూ!

–నస్రీన్ ఖాన్
మొబైల్: 9652432981

మరో గీతోపదేశం !!

పరమపవిత్రమైన ప్రకృతి ఆలయంలో
చేతనమై వికసించే పసిహృదయాలకు
సౌభాగ్యజీవన శాంతి పవనాలకు
అడుగంటుతున్న సభ్య సంస్కారాలతో
అదుపుతప్పుతున్న పెద్దల మమకారాలతో
మత్తుకు బానిసైన దుష్ట సాంగత్యాలతో
సవ్యదిశలో నడిచే కాలచక్రానికి
అపసవ్యపు వికృత చేష్టలతో
కళంకాన్నితెచ్చే మృగాలేవైనా ...

పాఠశాల పరిసరాలు పానశాలలుగా
కళాశాల ప్రాంగణాలు పర్ణశాలలుగా
ఉద్యానవనాలు అకృత్య నిలయాలై
నియంత్రణలేని కుటుంబ పొరపాట్లతో
ఉద్వేగమైన ఆటవిక వ్యసనాలతో
పర్యవసాన ఫలితాలు రాక్షస(క్రీడలుగా
మారడానికి కారకులెవరైనా ...

లోకంలో ఆదిత్యుని సాక్షిగా
పంచభూతాల కళ్ళెదుటే
మరణమే శరణమయ్యేలా
అవమానకర శిక్షననుభవించేలా
పవిత్రత చెరిపిన కౌరత్వాన్ని
పాశవికరీతిలోఆహుతిచేసి
శిథిలశకలాలు సైతం కనుమరుగయ్యేలా

మా మొరాలకించు దేవుడా !!
అందుకే ...కాలానికి, విధికి
అవనిలో ఎవరతీతులుకారనే
ప్రకృతి ప్రాథమిక ధర్మసూత్రమే
సమాజంలో సత్య వాక్పరిపాలకుల
సంశయంలేని సంవిధానమై వెలిసి
నిర్భయమైన నవభారత నిర్మాణానికి
మరో గీతోపదేశంతో నాంది పలకాలి !!

– రాజేశ్
9440 460 490

ముందడుగు

మౌనంగా కూర్చుంటే మారణహోమం ఆగదు
నిర్లిప్తతతో నిశ్శబ్దగానం చేస్తే నిప్పురవ్వ ఆరదు
ఇనుమును కాల్చి కొడితేనే కోరిన వంపు వస్తుంది
బండను ఉలితో చెక్కితేనే శిల్పం అపురూపమవుతుంది
నీరములా జాలువారకు నిప్పు కణికలా రగులు
పేదరైతువైనా పెత్తందారీతనం సాగనివ్వకు
నువ్వు దున్నే నేలపై ఎవ్వరికుంది పెత్తనం

చేను నీదే చేనులో చేవయూ నీదే
నాగళ్ళు, కొడవళ్ళూ ఏకమై నిలిచి
అవినీతి దళారీల భరతం పట్టాలి
నడపీనుగులకు జడిసి నేలతల్లిని వీడకు
కాటేసే కాలనాగును చలిచీమలు చంపినట్లు
గరికపోచలు ఒక్కటై మదగజాన్ని బంధించినట్లు
అవినీతి అణచివేతకు ప్రభంజనమై కదలాలి

ఏ ఆశయ సాధనకైనా తొలి వేసే అడుగు ఒక్కటే
అనుసరించే అడుగులు కోటానుకోట్లు
ఆ ముందడుగు నీదే కావాలని ఉద్యమించు
అపజయములో జయము దాగున్నదని విజృంభించు
అసాధ్యములోనే సాధ్యమున్నదని నిరూపించు
దేశానికే కాదు ఉద్యమాలకూ నీవు వెన్నెముకవని చాటు

–శింగరాజు శ్రీనివాసరావు
9052048706

సమాయత్తం

సంచలయం ఊపిరిగా
సాగుతోంది ప్రతికథనం అన్నారు!
రాణింపు లేని కథన శైలి
ఆకట్టు కోవట్లేదు ఎంతగా ఆరాటపడినా
అనుక్షణం చూపుల వలలు విసిరినా
చిక్కి చావదు అసలు విషయం
చిక్కటి కటిక చీకటిలాంటి బుర్రల్లో
కరువైనట్టుంది ఆలోచన తటిల్లతల్లా
మెరుపుల ధగధగలు

ఆరని నిప్పుల కుంపటిలో
ఎర్రగా వెచ్చగా పదునుబెడుతున్నట్టుంది
పొద్దు వాల్చని యువజనం
ఆశల ఆమ్ములిన్
చిగురిస్తోన్న కార్మికలోకం ఆశయాల్ని
ఇనుప గోళ్లతో తుంచేస్తున్న దౌష్ట్యంకన్నాను
రచనా సంవిధానంలో పాకం లేక
పాపం! పత్రికలు పడిగాపులు గాస్తున్నాయి
పాఠకుల లోగిళ్ళ ముందు
ఆగమాగం కాబడి చెట్టుకు పుట్ట కోకరైన యోధులు

మళ్లీ సమీకరణల సంగీతం వినిపిస్తున్నట్టుంది
వింటున్నాను సుదూర తీరాల్లోంచి
అడుగుల సవ్వడిని
నిద్రరానివ్వని కథనమేదో
నా కలంలో పురుడు పోసుకుంటుంది
మంత్రసాని కోసం వెతుకులాటలో
కాలం కరిగిపోక ముందే
అంతా సవ్యంగా సర్దుకొండి
సమాయత్తం కండి
సమయం లేదు మరి.

–డా॥ దామెర రాములు
సెల్:9866422494

పిల్లలే భూగోళ రక్షకులుగా డా॥వి.ఆర్. శర్మ అద్భుత 'ప్రయాణం'

బాల సాహిత్య రచయిత, డా॥వి.ఆర్ శర్మ అత్యాధునిక సాంకేతిక ప్రపంచం సాధిస్తున్న రోదసీ అన్వేషణల పరిశోధనలను బాల బాలికలను ఆకట్టుకొనే విధంగా అభూత అద్భుత కాల్పనిక కథనంతో 'ప్రయాణం' నవలగా సృష్టించారు. ఈ తరం టీనేజీ పిల్లల కోసం బాల సాహిత్య వేదిక 'పిల్లల లోకం' ప్రచురించిన ఈ కథనం, ఆద్యంతం పెద్దలను కూడా ఆసక్తికరంగా చదివింపచేస్తోంది. శర్మగారి తొలి పిల్లల నవల 'కానుక', విశేష ఆదరాభిమానాలు పొందటంతో, ఆ నేపథ్యంలోనే సైన్స్ ఫిక్షన్‌లా అనిపించే విధంగా, సామాజిక ప్రయోజనాంశాలను కొత్త ఊహలు, ఆలోచనలు జోడించి 'ప్రయాణం' రూపొందించారు. మానవాళి ఎదుర్కొన్న పర్యావరణ విధ్వంసం రానున్న బాల బాలికలకు ఎటువంటి బతుకును యిస్తుందో ఆలోచించుకోవలసినదిగా, దావోస్ అంతర్జాతీయ వేదికపై నుంచి పదహారేళ్ళ బాలిక 'గ్రేటా' ఆవేదనాయుత సందేశం ఈ కాల్పనిక నవలలో ప్రతిధ్వనించింది. గ్రహాంతర వాసులలో ఒక దుష్టవర్గం, మానవలోకాన్ని తమ బానిసలుగా చేసుకోవటానికి పన్నిన



పన్నాగం నుంచి మానవ జాతిని రక్షించటానికి వారిలో సన్మార్గ వర్గానికి చెందిన యిద్దరు పిల్లలు 'నక్షత్ర', 'గెలాక్స్' తెలుగు పిల్లలైన విహాన్, అనీష్, శరత్, అనిరుధ్, ప్రణవి, ముక్తలను ఎంపిక చేసుకొని వారిచే శత్రు విధ్వంసన సాహసయాత్ర కొనసాగించటంతో, ప్రయాణం సుఖాంతమవుతుంది. 'మదర్ ల్యాండ్' గ్రహదుష్ట శక్తి భూగోళంపై ఆధిపత్యం, మానవులు భూగోళాన్ని అణ్వాయుధ అన్ని జ్వాలల్లో భస్మం చేసుకొనే విధ్వంస ప్రస్తావన, ఆధునిక నాగరికతలో అన్ని విధ్వంసాలలో భూలోకంలోని పిల్లలు బలి అవుతుండటం వంటి విషయ కథాంశాలు నవలలో ప్రస్తావనగా వస్తాయి. శత్రు స్థావరాల ధ్వంసం చేసే సాహసిక కార్యాచరణలో లొలిబేబి అదృశ్య వాహనం, యంగ్ సిస్టర్, హిందూ సముద్ర, ప్రాణాలతో యంత్రజీవులు, గుహాంతరాళ విధ్వంసన, చంద్ర మండలంలో లూనార్ కాలనీపై దాడి చేసి బందీలను రక్షించటం హాలీవుడ్ చిత్ర అద్భుత సన్నివేశ చిత్రీకరణలను గుర్తు చేస్తాయి. మానవ జాతి అధునాతన ప్రస్థానం, సృష్టించుకొంటున్న విలయ విధ్వంసనం, స్టీఫెన్ హాకిన్స్ వంటి మేధావులైన దార్శనిక మహా శాస్త్రవేత్తల మనోభావనలు చదువరుల మదిలో కదలాడే కల్పనా కథా చమత్కృతి, ప్రతిభా సమన్వితంగా డా॥వి.ఆర్. శర్మ ఈ నవల రచించారు.

ప్రతులకు: డా॥వి.ఆర్.శర్మ
305 రోలిన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్
వీధి నెం.2, జక్ కాలనీ
సనత్‌నగర్, హైదరాబాద్-18.వెల: 60/-
సెల్: 09177887749

–జయసూర్య
సెల్: 9440664610

కుటుంబ బాంధవ్యాల మాధుర్యం డాక్టర్ ప్రభాకర్ జైని కథలకు ప్రాణం

పుస్తక సమీక్ష



ఉత్తమ కవి, కథా రచయిత, సినీ, దర్శకుడు,అ వార్డుల విజేత డాక్టర్ ప్రభాకర్ జైని, 'మీల్స్ టికెట్', కథా సంకలనంలో 18 కథలున్నాయి. యించుమించు అన్ని కథలతో కుటుంబ బాంధవ్యంలోని ఆత్మీయతా అనురాగాలు, ప్రేమాస్పదత తొణికిసలాడుతూ గతించి బాల్య మాధుర్యం కళ్ళముందు సాక్షాత్కరింపచేస్తారు. అమ్మమ్మ, తాతయ్యలు, చిన్నప్పుడు చూపించిన ప్రేమానుభవాలు, నాటి పల్లెలు కనుమరుగై పట్టణాలుగా మారటంతో హృదయాలను కలచివేసే ఆలోచనలు, జీవితాలు తలక్రిందులైన బంధువుల స్థితిగతుల దయనీయత, ప్రతి కథలో మానవీయతా విలువలను డా॥ ప్రభాకర్ జైనీ ప్రగాఢంగా స్పందింపచేస్తారు. తొలికథ 'మీల్స్ టికెట్'లో ఒకప్పుడు సుసంపన్నుడైన బంధువు ఆకలి తీర్చుకోవటానికి ముగ్గురు కొడుకులూ కలిసి నెలకు ముప్పై టికెట్లు ఏర్పాటు చేయటం ప్రస్తుత సమాజంలో పెద్దల పట్ల చూపిస్తున్న ధోరణి వ్యక్తం చేస్తోంది. కౌగిలింతల శరీరస్పర్శ, బాల్య జ్ఞాపకాల స్మృతులు ప్రసాదించే మానసిక రుగ్మతలు నిర్మూలించే వైద్య చికిత్స 'పరిష్వంగం 'లో ప్రతిబింబింప చేసారు. సోల్‌మేట్ కథలో వృద్ధులైన అత్తామామలు ఒకరు లేకుండా మరొకరు బతకలేని అనురాగ బాంధవ్యం స్పష్టం చేసారు. 'నగరపు నాగుబాము' కథలో ప్రియమైన తన చిన్నప్పటి గ్రామం ఆధునిక పట్టణంగా పరిణామ క్రమాన్ని, బంగారు బాల్యంతో సంబంధాన్ని అమ్మమ్మ తాతయ్యల జ్ఞాపకాలు గుర్తు చేసుకొంటారు. 'కొత్తగా రెక్కలొచ్చిన వేళ' కథలో బంగారు భవిష్యత్తును కష్టాలకు భయపడకుండా సాధించాలంటారు. బంగారు నగ వేలంలో కాపురం నిలబెట్టిన మానవతా వెలుగుల కథనం నాయినా! రావే కథలో తండ్రి అడుగు జాడలలో అడవి తల్లికి అన్న అయిన కథనం, ఫ్రీడం ఫైటరు కథలో రైల్వే అవినీతి శాంతి పావురంలో సమాజంలో చెలరేగుతున్న హింసా దౌష్ట్యాలు, చెక్‌పోస్ట్-బదిలీలో ఆక్రమణలు తొలగింపు అంశంలో అధికారి నిజాయితీ, కాళరాత్రి కథలో డాక్టర్ ఎదుర్కొన్న అనారోగ్యం, పాల ఐస్‌క్రీం కథలో మారుతున్న కాలంలో బాల్యస్మృతి కథనం, మతాంతరం వివాహం చేసుకొన్న కూతురిని సర్దుబాటు చేసుకొని ఇంటికి ఆహ్వానించిన 'సర్దుకున్నారా?' కథ ఈ కథా సంపుటిలోని కథలన్నింటిలో కుటుంబ బాంధవ్యాలు దూరం కావటంతో మనసున్న హృదయాల ఆవేదన, తరాల మారిపోతున్న కథా చిత్రాలుగా ప్రతీ ఒక్కరి బాల్యం, డాక్టర్ ప్రభాకర్ జైనీ స్వీయనుభవాల నేపథ్యంలో ప్రతిభావంతంగా కథా రూపాలుగా రచించారు. ప్రతికూల పరిస్థితులలో ప్రేమ, ఆత్మీయతానుబంధాలు వ్యక్తపరచటానికి పాత్రలు భోరున విలపించటం కొంచెం అతిగా అనిపించినా కథలు ఆసక్తిగా చదివింప చేస్తున్నాయి. డాక్టర్ జైని అభినందనీయులు.

ప్రతులకు: ప్రభాకర్ జైనీ
ఫ్లాట్ నెం. 111, 'సి' బ్లాక్
విష్ణు రెసిడెన్సీ గాంధీనగర్
హైదరాబాద్- 500 080
సెల్: 79898 25420
వెల: 200/-

–జయసూర్య
సెల్: 9440664610

'ప్చ్'

ప్రొద్దున్నే
కుర్రాడు విసిరేసిన వార్తలు
బాల్కనీ గచ్చు మీద బిరుసుకుంటున్నాయి
రక్త మోడుతు
ఆవేశంతో ఊగిపోతు
కోపంతో రగిలిపోతూ...

ఒక్కో వార్తను పామాడుతు
నా కంట్లోకి ఒంపుకుంటున్నాను
పుటలు తిరగేస్తున్న కొద్దీ
పెదాలమధ్య కాఫీ
చేదెక్కుతోంది.
వేధిస్తున్న కట్నాలు
బాధిస్తున్న అప్పులు
చెట్టుకు వేలాడుతు శవాలు
మంటల్లో కాలుతున్న అభాగ్యులు
పెట్రేగి పోతున్న దోమలు
ఆసుపత్రుల్లో
నేలమీద పొర్లుతున్న రోగులు
శిక్షణ లేని బోదకులు
ప్రాణాలను హరిస్తున్న బస్సులు...
అంతా బాగానే వుంది అంటున్న నేతలు...
ట్యాంకరు వచ్చినట్టుంది
సందులో బిందెలు గుద్దుకుంటున్నాయి
కంపును రోడ్డు వెంట దొరిలిస్తు
చెత్తలారి నత్తనడకన వెళ్తోంది
"ట్రాఫిక్ జామ్"
హారెత్తిస్తున్న హారన్ మోతలు.
పేపర్ మడిచి
టీవికి కళ్ళప్పగించాను.
దృశ్యాలు మరీ చేదుగా వున్నాయి.
రక్తసిక్త మవుతున్న రోడ్లు
కాలువల్లా పారుతున్న నీళ్ళు
యింతిత నోళ్ళతో మ్యానిహోళ్ళు
ఊసురోమంటున్న బళ్ళు
నినాదాలు మిన్నంటిన ధర్నాచౌక్‌లు
ఏడిపిస్తున్న సిరియళ్ళు
అదే పనిగా ఏడుస్తున్న మగాళ్ళు
విలనిజంతో ఊగిపోతున్న ఆడాళ్ళు
తక్షణ న్యాయం దిశగా
దూసుకుపోతున్న
పోలీసుల బుల్లెట్లు...
చేదెక్కిన మనస్సుకు
కాస్త తీపి కావాలి
కొంతయినా మంచి రుచి కావాలి.
ఆశగా రోజూ ఎదురు చూస్తున్నా
ఒక్క పువ్వయినా
కనపడక పోతుందా
ఒక్కనవ్వయినా
దొరకపోతుందా
ఒక్క చిరునవ్వయినా
చిక్కక పోతుందా అని...
'ప్చ్'

– రమణ వెలమకన్ని
సెల్: 9704158488

'ఆశల గాలిపటాలు' కవితా సంపుటి ఆవిష్కరణ

గ్రంథావిష్కరణ అనంతరం కవి సి. హెచ్. ఆంజనేయులును సత్కరిస్తున్న కె.శివారెడ్డి. వేదికపై కందుకూరి శ్రీరాములు, డా॥ ఏనుగు నర్సింహారెడ్డి, డా॥అమ్మంగి వేణుగోపాల్

జీవిత అనుభవాలు, జ్ఞాపకాలను వ్యక్తీకరించిన కవిత్వం ఆశల గాలిపటాలు అని వక్తలు పేర్కొన్నారు. పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీహెచ్ ఆంజనేయులు రచించిన కవితా సంపుటి 'ఆశల గాలిపటాలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది.

ఈ పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించగా ప్రముఖ కవి, విమర్శకులు కె.శివారెడ్డి, ఆచార్య లక్ష్మీ నారాయణ, అమ్మంగి వేణుగోపాల్, ఆనందాచారి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఈ రచన ద్వారా కవి ఆంజనేయులు పాఠకులలో మానవీయ చైతన్యం నింపారన్నారు. జీవితపు గాధత, సామాజిక బాధ్యత కలగలిసిన కవిత్వాన్ని ఈ కవి సమతూకంగా నడిపారన్నారు.

జీవితపు లోతులను అర్థం చేసుకున్న కవిగా వర్తమాన శిథిల స్థితిని ఆవిష్కరించారని వివరించారు. నగర జీవితంలోని ఘర్షణ, కాలుష్యం, బతుకు రమ్యతను అందంగా చెప్పిన తీరు ఆకట్టుకునేలా ఉందన్నారు. కార్యక్రమంలో కందుకూరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నాకు భయమే లేదనేవాడు
ధైర్యవంతుడా ?
పిరికివాడా ?

నేను పిరికివాణ్ని అనేవాడు
పిరికివాడా ?
ధైర్యవంతుడా ?

-మునిమడుగుల ఫిలాసఫీ

నిజాయి!

కొన్నిమౌనాలు-
ఎన్నో సమస్యలకు సమాధానాలు.
వినాశాయచ దుష్కృతాం-
మన చట్టం న్యాయం ధర్మం అభిమతం.
కూడళ్ళలో చిత్రపటాలు-
గతించిన సంగతి ప్రకటిస్తూ., నివాళిగా.
కొన్నా కొనకున్నా చదవండి-
బుక్కెలా ఎక్కుతుంది మెదట్లోకి,గూట్లో పెడ్తే.
గతం కర్తవ్యాన్ని బోధిస్తుంది-
భవిష్యత్తు సత్ఫలితాన్ని ఇవ్వడానికై.
ఇద్దరూ హృదయ నిపుణులే-
డాక్టర్ హార్ట్ వేర్, రైటర్ సాఫ్ట్ వేర్.
నాన్న ఎన్నడూ మరణించడు-
తప్పటడుగుల్లో ఎప్పటికీ చేయందిస్తూ.
ఆ కళ్ళలో ఏవేవో లోకాలు-
శోకాల దాటిన వేదాంత శ్లోకాలు.
ఏది వెచ్చించినా అల్పమే-
అనురాగముంటే, భూగోళమూ తృణప్రాయమే.

–డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

బాల వికాసం

నిజామాబాద్ జిల్లాలోని ఏర్గట్ల మండలంలో గల తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన కవిత్వాన్ని "పాదార్చన" పేరుతో కవితా సంకలనాన్ని ప్రచురించామని తెలుగు పండితులు ప్రవీణ్ శర్మగారు తెలిపారు. సాహిత్యంలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల సిబ్బందికి అభినందనలు. ఈ కవితా సంకలనంలోని కవితలు ఈ వారం నేటినిజం పాఠకుల కోసం..

అమ్మ

మన సృష్టికి జీవం అమ్మ
ఈ జగతికి మూలం అమ్మ
అనురాగాలను పంచి
ఆప్యాయతను పెంచి
అడుగులో అడుగేస్తూ
నడిపిస్తుంది
మన గెలుపుకు కారణం అమ్మ
మన సంతోషానికి కారణం అమ్మ
మనకోసం ఎంతో తపన పడుతూ
మన కష్టాలను పంచుకుని
ఇష్టంగా భావిస్తుంది
మనల్ని తొమ్మిది నెలలు మోసి
మనల్ని కనిపెంచి
ప్రపంచానికి
పరిచయం చేస్తుంది అమ్మ
మనవెనకుండి మనల్ని
గెలిపిస్తుంది అమ్మ

-ఎం. చందన
10వ తరగతి

అమ్మ అనురాగం

అనురాగానికి అర్థం అమ్మ
మమకారానికి మూలం అమ్మ
ఆత్మీయతలకు అనుబంధాలకు
ప్రతిరూపం అమ్మ
సహనానికి తీరం అమ్మ
నిండు వెన్నెలల చల్లదనం ఎలాగో
అమ్మ ఒడిలో వెచ్చదనం అలాగే
ప్రేమకు మారుపేరు మా అమ్మ
త్యాగానికి మరోపేరు మా అమ్మ
దేవుడు పంపిన నిలువెత్తు రూపం మా అమ్మ
అమ్మా నీకు నా కోటి వందనాలమ్మా

-ఎ. వినూత్న
10వ తరగతి

అరుదైన దైవం

మనలో జీవాన్ని నింపి
అల్లారుముద్దుగా పెంచి
మనలోని లోపాలను సరిచేస్తూ
మన భవిష్యత్తుకు పునాదులు వేస్తూ
మనకు గమ్యం చూపుతూ
మన ఆలోచనలకు
తన ఆలోచనలను
చూపెడుతూ
మనకోసం నిరంతరం కష్టపడుతున్న
అమ్మ అరుదైన దైవం

-బి. హరిత
10వ తరగతి

అమ్మ-నాన్న

అమ్మ మనల్ని నవమాసాలు మోస్తుంది
నాన్న మన జీవితానికి వెలుగునిస్తాడు
మనం తినే ప్రతి ముద్ద అమ్మ అయితే
మనం నడిచే ప్రతి అడుగు నాన్న అవుతాడు
కొవ్వొత్తి కరుగుతూ ఎలాగైతే
వెలుగునిస్తుందో
నాన్న శ్రమిస్తూ మనకు జీవితాన్నిస్తాడు
కష్టమైన మన పనులను
ఇష్టంగా భావించే మన తల్లిదండ్రులు
నిజంగా దైవ స్వరూపాలే

-ఎ. హారిక
10వ తరగతి

అమ్మ పేమ్ర

అమ్మ నవమాసాలు మోస్తుంది
నువ్వే తన ప్రాణమని బ్రతుకుతుంది
నువ్వులేకుండా ఉండలేనంటుంది
నువ్వులేని జీవితం
ఊహించుకోలేకపోతుంది
బ్రహ్మమనకు జీవంపోస్తే
ఆ జీవానికి ప్రాణం పోసేది అమ్మ
అందుకే అమ్మ ప్రేమ అంతులేనిది

-డి. శరణ్య
10వ తరగతి

అమ్మ అనుబంధం

ప్రపంచంలో ప్రతి నోట పలుకు
అదే మన జన్మకు మాతృప్రేమ పిలుపు
ప్రతి ఒక్కరి జీవితంలో
ఒక స్నేహం కావాలన్నా
అనుబంధ అనురాగ ఆప్యాయత నింపి
మనందరి జన్మసార్థకతకు
మన అందరి బ్రతుకు పునాదులకు
నిలువెత్తు దైవ సాక్ష్యాత్కారం అమ్మ
అమ్మ భాష నా బాల్యపు గోరుముద్ద
నా యవ్వనపు ప్రణయరాశి
నా వార్ధక్యపు వారణాశి
నా జన్మకు ఆనందరాశి అమ్మ

-ఎ. లహరి
10వ తరగతి

అమ్మనాన్న గొప్పతనం

అమ్మ ప్రేమ కళ్ళతో చూడగలం
కాని నాన్న ప్రేమ కన్నీళ్ళతోనే తెలుసుకోవడం
అమ్మ మనల్ని తొమ్మిది నెలలు
గర్భంలో దాచుకుంటే
నాన్న తన గుండెల్లో
జీవితాంతం దాచుకుంటాడు
మన సంతోషాలను తమ సంతోషాలుగా
మన బాధను తమ బాధగా
భావించే గొప్పదేవుళ్ళు అమ్మానాన్నలు

-ఎం. రఘు
10వ తరగతి

నాన్న త్యాగజీవి

నవమాసాలు మోయకపోయినా
పురిటి నొప్పులు తెలియకపోయినా
కడుపులో పెట్టుకుని మా ఆకలిని తీర్చావు
మా విజయానికి ప్రతిసారి నువ్వు
ఓటిమిని ఎత్తుకుని
బడుగుజీవిలా
బతుకు బండిని లాగుతున్నావు
అవసరాలకు ఆడంబరాలకు
మధ్యతరగతిని
అనుసంధానం చేస్తూ
అందర్ని ముందుకు తీస్కెల్లే
గొప్పత్యాగజీవి నాన్న

-ఎల్. రజిత
9వ తరగతి

అమ్మ లాలన

అందమైనది మా అమ్మ
అంతులేనిది మా అమ్మ
అనురాగానికి మారుపేరు మా అమ్మ
ఆప్యాయతకు ముద్దు పేరు మా అమ్మ
ప్రేమకు ప్రతిరూపం మా అమ్మ
అందుకే అమ్మ లాలన
అంతులేనిది అమృతం లాంటిది

-డి. స్నేహ
9వ తరగతి

పేగు బంధం

పేగుబంధం అమ్మ
మనల్ని లాలించేది అమ్మ
జోకొట్టి నవమాసాలు మోసేది అమ్మ
మనకు గోరుముద్దలు పెట్టి కొండంత చేసేది అమ్మే
మనకు దెబ్బ తగిలితే అరిచే మొదటి పదం అమ్మే
గొప్ప వాడిగా మనం ఎదిగితే
మొదట ఆనందపడేది అమ్మే
అమ్మ అనే పదం అమృత తుల్యం
అమ్మ ప్రేమ అమృతానందం

-ఎం. పౌనిక
9వ తరగతి

అమృతరూపం అమ్మ

నవమాసాలు మోసి
జన్మనిచ్చావు నీవు
ఈ కొత్త ప్రపంచానికి పరిచయం చేసావు నీవే
కన్నులు విప్పి చూడగానే రంగుల ప్రపంచం
అంతా నా ముందు ఉండేటట్లు చేసావు నీవే
అమ్మా అనే కమ్మనైన పదాన్ని
పలకడానికి ఈ జన్మకు
నాకు భాగ్యం కల్పించావు నీవే
బుడిబుడి అడుగులు వేసి వెయ్యగానే
జీవితంతో ముందడుగు వేయు
అని ధైర్యం ఇచ్చావు నీవే
గోరుముద్దలు తినిపించి
బుజ్జగించావు నీవే
అందుకే అమ్మా నీవు అమృతరూపానివి

-ఎం.డి. సాజిద
10వ తరగతి

అమ్మానాన్నకు పేమ్రతో

అమ్మ ప్రేమకన్నా నాన్నప్రేమ
ఎక్కువ గొప్పది
అమ్మప్రేమ బయటకు తెలుస్తుంది
నాన్న ప్రేమ తన మనసుకు తెలుసు
నాన్న చూపించే ప్రతి విషయంలో
ప్రేమ తప్పకుండా ఉంటుంది
నాన్న అంటే ప్రతి విషయంలో మనల్ని
ముందుండి నడిపించేవాడు
మనల్ని మొదటి అడుగు వేయించేది అమ్మ అయితే
భవిష్యత్ అడుగును మనతో వేయించే వారు నాన్న
అందుకే అమ్మానాన్నలను గౌరవిద్దాం
అమ్మా నాన్నలకు మన ప్రేమను పంచుదాం

-ఎ. నిఖిత
10వ తరగతి

అమ్మనాన్నలే దైవాలు

కనిపించే దేవత అమ్మ అయితే
నడిపించే దైవం నాన్న
ప్రేమించడం అమ్మ వంతయితే
దీవించడం నాన్నవంతు
అమ్మ అమృతమైతే
దాన్ని నింపే కలశం నాన్న
అమ్మ వెలిగే దీపమైతే
నాన్న వెలిగించే కొవ్వత్తి
అమ్మ ఒడి గుడి అయితే
నాన్న భుజం లోకాన్ని చూపించే బడి
కాలం బాటమీద
కనిపించని సాధకుడు నాన్న

-పి. రసజ్ఞ
10వ తరగతి

అమ్మ ప్రేమ

అమ్మంటే పేగుబంధం అమ్మంటే ప్రేమగుణం
అమ్మ మనసుకు సాటిలేదు అమ్మ ప్రేమకు లోటులేదు
అమ్మే నా జీవితానికి దేవత అమ్మ ధైర్యాభిమానాల కలబోత
అమ్మ నేర్పిన నడవడిక దానిలో చూపలేరు ఏ తప్పిక
అమ్మ ప్రేమ వర్ణణాతీతం అమ్మ గుణం స్వర్ణకపోతం
అమ్మతోనే ఆనంద క్షణం అమ్మ లేని జాడ ఉండగలమా మనం

-సి. హెచ్. శ్రవణ్
9వ తరగతి

నాన్న ప్రేమ

ఒడిదుడుకులను నేర్పి
ధైర్యాన్ని ఇచ్చి
ధర్మాన్ని జూపి
సత్ప్రవర్తనను అలవర్చి
నా భుజం తట్టి
నువ్వు గెలుస్తావురా బిడ్డా అని
మన జీవితానికి
మార్గదర్శనం ఇచ్చేవారు నాన్న
నీ శరీరమంతా నేనే అనుకుంటు
నాకోసం ఎంతో శ్రమించి
సిద్ధిబుద్ధులను నేర్పావు నాన్న
మంచి గుణాలను నేర్పి
మంచి దారిని జూపి
లక్ష్యాన్ని ఏర్పరచి
గుణవంతుడిని
విద్యావంతుడిగా చేసావు నాన్న
నాన్న ప్రేమ నవనీతమైనది

-ఇ. సౌమ్య
9వ తరగతి

తీయని పలుకు

నా దేవత అమ్మ నన్ను నడిపించేది అమ్మ
నారూపానికి ప్రతిరూపం అమ్మ
నా ప్రాణానికి శ్వాస అమ్మ
నా ఆశలకు ధైర్యం అమ్మ
అమ్మ లేనిదే జగత్తులేదు
కష్టం దాచుకుని ప్రేమను పంచుకునేది అమ్మే
కమ్మని పిలుపు తీయని పలుకు అమ్మే
అందుకే అమ్మే దైవం అమ్మే ధైర్యం
అమ్మే నా ఆరో ప్రాణం

-ఎం. తిరుమల
9వ తరగతి

స్ఫూర్తి

కాలమ్ కథ:

"...ఆ విధంగా ఒక చిన్న పోస్ట్‌కార్డుపై వేలసార్లు 'శ్రీరామా శ్రీరామా' అంటూ చిన్న చిన్న అక్షరాలు రాసి ఈరోజు గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డు ఎక్కి, మన తెలుగువాడి ఘనతని ప్రపంచానికి చాటిన ఈ కుర్రాడిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అన్నారు మంత్రిగారు.

వక్తలైన అతిథులందరూ ప్రసంగించిన తర్వాత ఆ కుర్రాడి వంతు వచ్చింది.

"నా పేరు గిన్నీస్‌బుక్ ఎక్కడానికి కారకులు ఈ వేదికపై ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ పత్రికా సంపాదకులే కారణం" అంటూ ఆయనవైపు చూసాడు కుర్రాడు.

"ఏమిటీ! ఈ కుర్రాడిని నేనెప్పుడూ చూడలేదే. దీనికి నేనే స్ఫూర్తి అంటాడేమిటీ" ఆశ్చర్యపోయాడు ఆ సంపాదకుడు.

"అవునండీ! ముమ్మాటికీ మీరే కారకులు. మీ పత్రికలో పోస్ట్‌కార్డు కథలు ప్రచురించడం చూసి నేనూ పోస్ట్‌కార్డుపై చిన్నచిన్న అక్షరాలతో కథలు రాసి మీకు పంపడం, అవి మీరు ప్రచురించడమూ చేశారు. అదే ఈరోజు గిన్నీస్‌బుక్‌లోకి ఎక్కడానికి స్ఫూర్తిని కలగచేసింది" చెప్పాడు ఆ కుర్రాడు వినయంగా.

ఔరా! పత్రికలో అతి తక్కువ నిడివిగల కథలు వేసి పాఠకుల్ని చదివించాలనుకున్నా గాని, అదే స్ఫూర్తి అయ్యి మన తెలుగుభాష ఘనత ప్రపంచ పటంపై నిలిపేంత స్ఫూర్తిని కలగజేస్తుందని ఏమాత్రం ఊహించనేలేదు" అని తెగ ఆశ్చర్యం, ఆనందంలో మునిగిపోయాడు ఆ పత్రికా సంపాదకుడు.

-చలపాక ప్రకాష్
సెల్: 9247475975

మన పండుగలు



వృత్తిరీత్యా ఉపాధ్యాయులుగా పని చేస్తున్న అయిత అనితగారు మన వారసత్వ సంపదలకు ప్రతీకలైన మన పండుగలను కొన్నింటిని ప్రస్తావిస్తూ ఓ చిన్ని పుస్తకాన్ని వెలువరించారు.

'మన పండుగలు' పేరుతో వెలువడిన ఈ పుస్తకంలో మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలను రేఖామాత్రంగా పరిచయం చేశారు. విద్యార్థులకు చిన్ననాటి నుండే చదువుతో పాటు.. మన సంస్కృతీ ఆచారాలపై శ్రద్ధాభక్తుల్ని కలుగజేసేందుకు ఇందలి వ్యాసాలు ఉపయోగపడతాయి. విద్యార్థులకు పండుగల పట్ల అవగాహన కలగడమే గాక.. వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విధంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దిన అనితగారు అభినందనీయులు. మానవీయ విలువలు, నాయకత్వ లక్షణాలను, నైతిక విలువలను, జీవన నైపుణ్యాలను, పిల్లల్లో నిర్మాణం చేసేందుకు ఇందలి వ్యాసాలు ఉపయోగపడతాయి.

అంతేగాక శాస్త్రీయ దృక్పథంతో పాటు... ఐకమత్యం.. క్రమశిక్షణ.. సోదర భావం.. సత్ప్రవర్తన వంటి సుగుణాలను విద్యార్థుల్లో అలవర్చటానికి ఈ చిన్ని పుస్తకం ఉపయుక్తంగా ఉండగలదు. భిన్నత్వంలో ఏకత్వం అన్న గొప్ప భావనను పిల్లల్లో కలిగింపజేయడానికి వీలుగా అన్ని మతాలకు సంబంధించిన పండుగల వ్యాసాలను పొందుపరిచారు.

ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, గుడ్‌ఫ్రైడే, అక్షయ తృతీయ, బోనాల పండుగ, తొలి ఏకాదశి, గురుపౌర్ణమి, రంజాన్, నాగపంచమి, వరలక్ష్మీ వ్రతం, రాఖీపౌర్ణమి, శ్రీ కృష్ణాష్టమి, పోలాల అమావాస్య, వినాయకచవితి, బక్రీద్, బతుకమ్మ, విజయదశమి, మొహర్రం, అట్లతదియ, దీపావళి, యమ ద్వితీయ, కార్తీక పౌర్ణమి, ముక్కోటి ఏకాదశి, క్రిస్మస్, సంక్రాంతి, వసంత పంచమి, రథ సప్తమి, మహా శివరాత్రి, హోళీ వంటి పండుగలు ఎలా జరుపుకుంటాము ఆయా పండుగల వైశిష్ట్యాన్ని సంక్షిప్తంగా ఇందులో నిక్షిప్తం చేశారు.

ప్రతి పండుగకు సంబంధించిన చిత్రాలను జోడించి వ్యాసాలకు మరింత శోభను కూర్చారు. పండుగలంటే.. కొత్త బట్టలు ధరించడం.. పిండివంటలు చేసుకుని ఆరగించడమే కాదు.. శాస్త్రీయంగా, వైజ్ఞానికంగా, సంస్కృతీ పరంగా ఆయా పండుగలకున్న ప్రత్యేకతను చక్కగా ఇందలి వ్యాసాల్లో విశ్లేషించారు.

అన్ని మతాల వారిని ఆకట్టుకునేలా వ్యాసాలు కొలువుదీరాయి!

భిన్నత్వంలో ఏకత్వ భావనను పిల్లల్లో అలవర్చేందుకు అనితగారు చేసిన కృషిని అభినందిద్దాం. ఈ గ్రంథానికి అందమైన ముఖచిత్రం మరింత శోభను పెంచింది. వ్యాసాలు కులమత భేదాలు లేని సమ సమాజం నిర్మాణం కోసం ఉపకరిస్తాయి.

వ్యాసాల మధ్యన కొన్ని కవితల్ని చేర్చి పుస్తకానికి నిండుదనం కూర్చారు.

పిల్లలు మొక్కలు నాటటం పట్ల.. మట్టి వినాయకుల తయారీపట్ల అవగాహనను పెంపొందించేలా అనితగారు చేసిన ప్రయత్నం ప్రశంసనీయం. ఆయా వేడుకలకు సంబంధించిన వివిధ వర్ణాల చిత్రాలను పొందుపరిచారు. ఈ చిన్ని పుస్తకం ప్రతి పాఠశాలలో ఉండదగింది. ప్రతి గ్రంథాలయంలో ఉంచదగింది.

పిల్లల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తమ వృత్తికి న్యాయం చేస్తూనే పిల్లల సర్వాంగీణ ఉన్నతికై అనితగారు పాటు పడటం అభినందనీయం. అనితగారు ఈ మధ్య మంచి కవిత్వాన్ని కూడా పండిస్తున్నారు. వివిధ అంతర్జాల సమూహాల్లో వాట్సప్ ఫేస్‌బుక్‌లో కవయిత్రిగా వెలుగొందుతున్నారు. కనుక వీలైనంత త్వరలో పూర్తి స్థాయి వచన కవితా సంపుటి రావాలని కోరుకుందాం.

ప్రతులకు: అయిత అనిత
ఇ.నెం. 1-5-203/4/డి/డి, గణేశ్‌నగర్, జగిత్యాల
సెల్: 89853 48424. వెల: అమూల్యం.

భరతపుత్ర శతకము



మన సంస్కృతి పట్ల శ్రద్ధాభక్తులు కలిగి అణువణువున దేశభక్తిని పుణికి పుచ్చుకున్న యువ కవి సామల కిరణ్‌గారు 'భరత పుత్ర శతకం' పేరుతో ఓ చిన్ని పద్య శతకాన్ని వెలువరించారు.

భారతమాత సదకమలాలకు, తమ సర్వస్వాన్నీ ధారవోసిన త్యాగ ధనులకు, కుల-జాతి- మత- పంథా భాషలకంటే మాతృదేశమే మిన్న అన్న దేశభక్తులకు ఈ శతకాన్ని అంకితమిచ్చి కిరణ్‌గారు తమ ఉత్తమ సంస్కారాన్ని చాటుకున్నారు.

స్వాతంత్ర్య సమరయోధులు.. ప్రాతఃస్మరణీయులైన మహనీయులు. భారతమాత.. శివాజీ తదితరుల ముఖచిత్రంతో వెలువడిన ఈ శతకంలో పెద్దలయెడ, దేశంపట్ల, గురువుల పట్ల, సంస్కృతిపట్ల.. గౌరవనీయ.. ఆరాధనీయ భావంతో మెలగాలని నీతిని ప్రబోధిస్తూ ఇందలి పద్యాలను తీర్చిదిద్దారు. సాధారణంగా భక్తిముక్తి, వైరాగ్యం, శృంగారం, నీతి తదితర భావాలతో రూపుదిద్దబడే శతకాలు సమాజిక చైతన్యానికి దోహద పడతాయి. మానవీయ విలువలను, నైతికతను పెంపొందించడానికి దోహదపడతాయి! ఇదే క్రమంలో, సామల కిరణ్‌గారి పద్యాల్లో.. జాతీయత, దేశభక్తి, సనాతన ధర్మం పట్ల శ్రద్ధాభక్తులు అడుగడుగున కానవస్తాయి. అన్ని వయసుల వారిని అలరించేలా.. ఆకట్టుకునే విధంగా పద్యాలను అల్లడం అభినందనీయం! శ్రమైక జీవన సౌందర్యంతో తనని తీర్చిదిద్దిన మాతృమూర్తికి మొదట వందనాలు సమర్పించి కవి కిరణ్‌గారు తమ ఉత్తమ వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు.

'భరతపుత్ర నీది భాగ్యసీమ" అన్న మకుటంతో రాయబడిన ఇందలి పద్యాలకు భావాన్ని కూడా చేర్చి.. మరింత శోభాయమానం చేశారు. సులభతరం చేశారు.

"కన్నతల్లి కంట కన్నీరు రానీకు
సృష్టిలోన గొప్ప సృజన అమ్మ
తల్లి సేవలో తరించవలెనురా" అంటూ హితవు పలికారు.

గురువులేని విద్య గుడ్డి దనియు, తెలుపుతూ మాతృభూమి సేవ మరువగ రాదిల, దేశసేవ కొరకు దేనికీ జంకకు, భరత దేశకీర్తిని జగతిలోన విశ్వజననిగా నిలబెట్టుమని హితవు పలికారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవనీ.. అందుకే విశ్వమంత విస్తరించిందని ఇంకో పద్యం ద్వారా విడమరిచి వివరించారు.

మరో పద్యంలో లోకం సంతోషపడే పుణ్యం చేయాలని.. తల్లిదండ్రులు మెచ్చుకునే కుమారుడివై.. వంశమునకే పేరు తేవాలని సూచించారు.

"అంటరానితనము అతిపెద్ద రోగము
జాతి ప్రగతి నదియె జాగుసేయు
అంతమవగుజేయు యనవతరముగాను
భరతపుత్ర నీది భాగ్యసీమ" అంటూ సమరసతా భావాన్ని ప్రబోధించారు.

జీవితమును జీవనదిగా భావించి.. నది ప్రవాహానికి ఎన్ని ఆటంకాలున్నప్పటికీ ఎలా ప్రవహిస్తుందో.. జీవితాన కూడా మనం అలానే పయనిస్తూ.. జనులందరి అవసరాలు తీర్చాలని సూచిస్తూ వేరొక పద్యాన్ని ఈ శతకంలో పొందుపరిచారు.

విద్యయొక్క ప్రాశస్త్యాన్ని తెలుపుతూ రాసిన పద్యాలు సందేశాత్మకంగా కొలువు దీరాయి!తెలుగు భాషపట్ల, సమాజంపట్ల, ఎలా వ్యవహరించాలో తమ పద్యాల ద్వారా విశ్లేషించారు. వివరించారు. బతుకమ్మ, అంబేద్కర్, రామ-హనుమ, మంత్రపురి, సాధారణల తదితర శీర్షికలతో రాసిన పద్యాలు సామాజిక చైతన్యానికి దోహద పడే విధంగా ఉన్నాయి. దేశభక్తి, దైవభక్తితో పాటు వ్యక్తిత్వాన్ని వికసింపజేసే ఈ శతకం అందరికీ ఉపయుక్తమైనది. కిరణ్‌గారు ఛందోబద్ధ పద్యాల రచనతోనే తొలిసారిగా కవిగా సాహితీ లోకంలోకి అడుగిడడం అభినందనీయం. మున్ముందు.. మరిన్ని సమాజహిత రచనలు ఆయన కలం నుండి జాలువారాలని ఆకాంక్షిద్దాం. అంతేగాక.. పూర్తిస్థాయి వచన కవిత్వంలో కూడా ఓ గ్రంథాన్ని వెలువరించాలని కోరుకుందాం.తొలి పుస్తకంతోనే అందరినీ ఆకట్టుకున్న ఆయనకు శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ప్రతులకు: కేశవ నిలయం
ఆర్టీసీ బస్‌స్టాండ్ వెనుక, కరీంనగర్-505 001. వెల: 21/-
సెల్: 9949394688.

కవిత్వ పరిమళాలను గుబాళింపజేసే "నానీల వసంతం"!



నాదోబాణి
నీదో బాణి
ఏదైనాగాని?

మెచ్చాలికదా జనవాహిని అంటూ.. యువకవి కుడికాల వంశీధర్ తొలి పుస్తకాన్ని నానీలోత బోణీ చేసి.. తన వాణిని బలంగా వినిపించారు.

కవిత్వమంటే
కాలక్షేపం కాదుసుమా
అది కాలాతీత
అఖండ దీపం" అని భావించే వంశీధర్

కవిత్వమంటే
పదాలు పేర్చడం కాదు
అర్థాలు కూర్చడం
భావాలను పేల్చడం అన్న అవగాహన ఉన్న కవి వంశీధర్ తన అంతరంగంలో కదలాడే భావాలకు అందంగా అక్షరాకృతినిచ్చి "నానీల వసంతం" పేరుతో ఓ పుసకాన్ని వెలువరించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలోకి నానీలు వచ్చి రెండు దశాబ్దాలు దాటినా.. కాలానికి ఎదు రొడ్డి ఇంకనూ ఓ ప్రక్రియగా నిలదొక్కుకోవడం విశేషం!

ఆచార్య ఎన్.గోపిగారు ఏ క్షణాన నానీలను సృష్టించారో గానీ వర్ధమానులే కాదు.. ప్రవర్ధమానులు నానీల ప్రక్రియను సుసంపన్నం చేశారు. నానీలు చూపుకు నాలుగు పాదాల్లో కొలువుదీరినప్పటికీ.. ఇరవై నుండి ఇరవై ఐదు అక్షరాల్లో కుదించాల్సి ఉన్నప్పటికీ.. నానీలు రాయడం అంత సులభమైంది కాదు. లోక పరిశీలన.. సామాజిక చింతన, సృజనాత్మక ప్రతిభ కాస్తంత భాషా సంపద, ఉంటే తప్ప, నానీల్లో కవిత్వాన్ని పండించలేము. ఎంతో సాంద్రతతో మథనంలోంచి వస్తే గానీ బలంగా నానీని రాయలేమన్నది నిజం! పైన పేర్కొన్న కొన్ని లక్షణాలనైనా పుణికిపుచ్చుకున్న యువకవి కుడికాల వంశీధర్ వృత్తిరీత్యా అభియంత అయినా.. రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలచుకుని తమ నాన్నగారైన కవి శ్రీ జనార్ధన్ కుడికాలగారి అడుగు జాడల్లో నడవడం ఆనందదాయకం!

ఇందలి నానీల్లో వంశీధర్ యొక్క ఉత్తమ వ్యక్తిత్వాన్ని చూడగలం.. సమాజాన్ని చైతన్య పరచాలన్న ఆరాటాన్ని గమనించగలం.

సొంతంగా ముఖచిత్రం వేసుకుని చక్కని భావుకతతో చిక్కని కవిత్వాన్ని రాసి.. నానీల ప్రక్రియకు సుగంధ పరిమళాలను అద్దుతూ 'నానీల వసంతం' పుస్తకాన్ని తీర్చిదిద్దారు.

"ఆధ్యాత్మికత అంటే
మతం కాదు
ప్రశాంతంగా జీవించే
మానవహితం" అని భావించే కవి వంశీధర్ మసక బారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు కూర్చే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం.

'మనసునూ నమ్మక
మమతలూ లేక
ఛీ!
ఏం జీవితమిది? అని ప్రశ్నించారు.

మానవత్వానికి
చెమర్చని కళ్ళు
ముఖానికి
అమర్చిన గాజు గుళ్ళు అని వ్యాఖ్యానించారు.

"అడుగులు
వీధులు
అరిగిపోయాయి
గేటెడ్ కమ్యూనిటీ పుణ్యం" అని చమత్కరించినా.. పై పంక్తుల పరదా మాటున తరిగిపోతున్న మానవ సంబంధాలను ఎత్తిచూపారు.

చెల్లెలు
ఇంటిదీపం
మనసును వెలిగించే
మమతల రూపం" అంటూ ఓ నానీలో చెల్లెమ్మను ఉన్నతంగా చిత్రించారు.

వంశీధర్ రాసిన నానీల్లో అమ్మకు పెద్దపీట వేసి అమ్మపట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

అమ్మ
చంద్రుణ్ణి పిలుస్తుంది
నిజానికి అమ్మే
ఓ చందమామ అని అనడం గొప్ప విషయం! ప్రేమను పంచడంలో ఉన్న విషయం కూడా!

మరో నానీలో...
అమ్మ ఒడియే
కదా దివ్య సాకేతం
అమ్మలాలి
తొలి సంగీతం" అని చెప్పం బాగుంది.

ఇంకో చోట
"అమ్మంటే
ప్రేమను కలిపికుట్టే సూత్రం
మీకు తెలియదా
ఆ మాత్రం" అని మనకు గుర్తు చేశారు.

"సహనంలో అవనిజ
శాంతిగుణ సహజ
మా అమ్మ
సరోజ" అంటూ తమ అమ్మను చక్కగా ఆవిష్కరించారు. అంతటితో ఆగక

"అదృష్టమంటే
మా అమ్మేసరి!
ఆదర్శాలకు నాన్న
వికసించే విరి" అంటూ అమ్మా నాన్నలను అందంగా నానీలో బంధించారు.

మరో నానీలో అమ్మానాన్నలను ఇలా ప్రస్తావించారు.

"పుస్తకానికి అటు ఇటు
అట్టల్లాగా
పిల్లలకోసం
అమ్మానాన్నలు" అని చెప్పడం బాగుంది.

"ఓర్పుకి ఓ పేరు
మార్పుకి మరో ఊరు
జనశ్రీ
మా నాన్నగారు" అంటూ నాన్నపట్ల తమ పితృభక్తిని చాటుకున్నారు.

వంశీధర్ కవిత్వంలో చక్కని భావుకత కానవస్తుంది.

"శిశిరం రాల్చేది
ఆకుల్నే
చిగురించాలనే
ఆశల్ని కాదు" అంటూ రాసి కవి తమ కలం బలాన్ని చూపించారు.

"శివాలెత్తి పోతుంది
శిశిరం
సవాలుగా వస్తుంది
వసంతం అంటూ ఇంకో నానీలో ప్రకటించిన భావాలు బాగున్నాయి.

"అంతా ఒకే చెట్టు
ఆకులు, పువ్వులు
పక్కన ఉంటారు
పలకరింపుల్లేవు" అంటూ బాంధవ్యాల మధ్య ఉన్న నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు.

ప్రజాప్రతినిధుల తీరు తెన్నులను ఎండగట్టే నానీలు కూడా ఇందులో మనకు దర్శనమిస్తాయి.

అంతా ఊకదంపుడు
ఉపన్యాసం
ఉత్తమాట
"రాజకీయ సన్యాసం" అంటూ రాసిన నానీ అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది.

రాజకీయాల్లో లేరు
శత్రువులు, మిత్రులు
అసలు
మనస్సాక్షి ఉంటేగా" అంటూ రాసిన నానీ వాస్తవాన్ని మోసుకొచ్చింది.

"నేనే గెలుస్తా"
అవినీతి నాయకుని ప్రకటన
జోస్యమా?
హాస్యమా? అని ప్రశ్నించారు.

అందమంటే
కొలతలు కాదు
ముదిమి అంటే
ముడతలూ కాదని వేరొక నానీలో తేల్చి చెప్పారు.

పదాల్లో క్షుప్తత
భావంలో గాఢత
నాకవితను
మెచ్చదా జనతా" అంటూ కవి సవినయంగా ప్రకటించుకున్నారు. ఆ విధంగానే తన భావాలకు అక్షర సొబగులు అద్దారు.

చుక్కలు
మెరుస్తున్నాయి
సూరీడు కప్పుకున్న
నల్ల దుప్పటి చిల్లుల్లా" అని ప్రతి భావంతంగా రాసి కవి వంశీధర్ తమ కవితా పటిమను చాటుకున్నారు.

ఈ మధ్య పుస్తకాలను ముందుమాటలు ఎక్కువై పోతున్నాయన్న సంగతిని దృష్టిలో పెట్టుకుని రాసిన నానీ బాగుంది.

ముందుమాట
ముప్పై రాపులు
అసలు కవిత్వం
ఆరు రాపులు అని చమత్కరించారు. నిజమే కదా! కాయకన్న తొడిమె పెద్దగా వుండకూడదన్న సంగతిని గుర్తు చేశారు.

దేశానికి ఎవరు
భరోసా?
పంట పండించే రైతు
పహారా కాసే జవాను అంటూ కవి తమ ఉత్తమ వ్యక్తిత్వాన్ని ప్రకటించుకున్నారు. ఇలా ఎన్నో నానీలు ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి.

సాహితీ లోకంలోకి పుస్తక రూపంలో నానీల స్వాగత తోరణం నుండి ప్రవేశించిన కవి వంశీధర్‌కు కవితా ఉజ్వలమైన భవిష్యత్తును ఆకాంక్షిద్దాం. కవిత్వ సృజనలో మరిన్ని మెలకువలు తెలుసుకుని తమ కలానికి పదును పెట్టుకోవాలని కోరుకుందాం. మున్ముందు పూర్తి స్థాయి వచన కవితా సంపుటితో రావాలని ఆశిద్దాం. ఆశీర్వదిద్దాం.

ప్రతులకు: కుడికాల వంశీధర్
ఇ.నెం. 2-108/7/38/1
ఫ్లాట్ నెం. 38, బి.ఎల్.నగర్,
4వ వీధి బోడుప్పల్,
హైదరాబాద్-98. వెల: 60/-
సెల్: 9885201600

పుస్తక సమీక్షలు

'అబాబీలు' అనే నూతన కవితా ప్రక్రియ ఆవిర్భావం!



తెలుగు సాహిత్యంలో తనదైన శైలిలో ఇస్లాంవాదాన్ని బలంగా వినిపిస్తున్న కవి షేక్ కరీముల్లాగారు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు.. తొలి ముస్లిం కవిగా.. ఇస్లాంవాద ఆవిష్కర్తగా భాసిల్లుతున్న ఆయన లోగడ 'సాయిబు' దీర్ఘ కవితను రాసి కవిగా తనకంటూ సాహితీ లోకంలో ఓ స్థానాన్ని పదిల పరుచుకున్నారు. ప్రజాస్వామిక వాదిగా, లౌకికత్వ కాంక్షిగా, ఆధునికవాదిగా వెలుగులోకి వచ్చాయి. 'సాయిబు' దీర్ఘ కవితకు జాతీయ పురస్కారంతో పాటు అనేక అవార్డులు వచ్చాయి. ఆయన రచనలు కొన్ని విశ్వ విద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా పెట్టబడటమే గాక.. ఆయన పుస్తకాలపై పరిశోధనలు జరగడం విశేషం. అంతేగాక ఇతర భాషల్లోకి ఆయన రచనలు అనువదింపబడ్డాయని చెప్పుకున్న ఆయన ఇంతవరకు తొమ్మిది పుస్తకాలను వివిధ ప్రక్రియల్లో వెలువరించారు. వీటిలో అనువాద గ్రంథాలు, కవిత్వంకు సంబంధించిన పుస్తకాలు.. ఇస్లాంవాద కథలు, నాటికలు, గేయాలు మొ॥ ఉన్నాయి. ఇప్పుడు 'బదర్ అబాబీలు' పేరుతో ఓ చిన్ని పుస్తకాన్ని మనకు అందిస్తున్నారు. 'అబాబీలు' అనే ఓ కొత్త ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

ముస్లిం కవులకు తమ సామాజిక సాంస్కృతిక అస్థిత్వాన్ని నిలబెట్టుకుంటూ చైతన్యం కలిగించాలన్న సంకల్పంతో.. 'అబాబీలు"పేరుతో ఓ నూతన వచన కవితా ప్రక్రియను సృష్టించానని కరీముల్లా ప్రకటించుకున్నారు. 'అబాబీలు' పేరు పెట్టడానికి గల చారిత్రక నైపుణ్యాన్ని కరీముల్లాగారు తన ముందు మాటలో రేఖామాత్రంగా ప్రస్తావించారు. 'అబాబిల్' అంటే పక్షుల గుంపు ఆ గుంపు. వాటి సాహస చర్యలను వివరించారు. అబాబిల్ పక్షుల చైతన్యం సాహసం, సామూహికతత్వం ఇప్పుడు తెలుగు ముస్లిం కవులకు అవసరమైందని భావించి ఈ కొత్త ప్రక్రియను సృష్టించానని కరీముల్లాగారు చెప్పుకున్నారు.

మతోన్మాద, ఫాసిస్టు, ఉగ్రవాద సామ్రాజ్య భావ జాలాలపై అక్షరయుద్ధం చేసే ప్రతి అక్షరం 'అబాబిల్' లాంటిదే అన్న కరీముల్లాగారి ఆలోచన! అయితే.. అందరు ఏకీభవించక పోయినప్పటికీ.. 'అబాబీలు' ముస్లింల కోసం మాత్రమేగాక.. సమస్త పీడిత ప్రజల పక్షాన నిలబడతాయని వివరణ యివ్వడం బాగుంది. 'అబాబీలు'ల ప్రక్రియ కోసం ఐదు పంక్తులను నిర్దేశించుకుని ఈ పుస్తకంలోని అబాబీలను రాశారు.

ఇందలి అబాబీలలో ఇస్లాం వాదంతో పాటు.. అన్ని మతాల వారిని ఆకట్టుకునే సామాజికాంశాలను స్పృశించారు.

ముజావర్ చేతిలో
నెమలి ఈకల విసనకత్తెర
చిల్లుపడ్డ గరీబు సంచి
కరీము!

వలీ ఆత్మ ఏడుస్తుంది చూడు అంటూ ముజావర్‌ను ఆర్ద్రంగా చిత్రించారు.

మరో అబాబిల్‌లో
కలలన్నీ పాతవే
పుట్టుకే కొత్తది కావాలి
హేతువునెపుడూ హీనపరచకు
కరీము!

సృజన సిరా వంటిది! అని చెప్పడం కవి యొక్క కలం బలాన్ని సూచిస్తోంది.

అక్షరాలన్నీ అక్కరకు వచ్చేవికావు
ఊరించేవి కొన్నుంటాయి
ఊడిగం చేసేవి కొన్నుంటాయి
కరీము! అక్షరమంటే అక్షరాల పోరాటమే కదూ" అని ముగించడం బాగుంది.

"సరిహద్దుల్లేని
సమతా మార్గాన్ని నిర్మించినవాడ్ని
మమతల దర్పణంలో నిత్య ప్రతిబింబాన్ని
కరీము!
రెపరెపలాడుతన్న మన త్రివర్ణ పతాక మదిగో" అంటూ రాసిన పంక్తులు బాగున్నాయి.

ఛాందసుడా!
నీతో నాకెప్పుడూ కుదరదు
రేపటిని కనలేని కబోదివి
కరీము!

గడియారం ముల్లు వెనక్కి తిప్పకు అని హితవు పలికారు.

నా కవిత్వంపై
వాళ్ళు కత్తి కట్టారు
నక్షత్రమేదో మిలమిలా మెరుస్తుంది
కరీము!

అక్కున చేర్చుకునే ఆకాశమేది? అని ప్రశ్నించారు.

నిఖారాత్రి
దుల్హాన్ తల ఎత్తనే లేదు
అబ్బాజాన్ అప్పలు గుర్తుకువచ్చి
కరీము!

మాంసం తప్ప మనుషులెక్కడ?" అంటూ వేదనను వ్యక్తపరిచారు.

ఆగ్రహాన్ని మించిన
విగ్రహం ఉందా?
నిగ్రహాన్ని మించిన సన్మార్గం ఉందా?
కరీము!

ప్రవక్త వచనం నీకేమి నేర్పింది" అంటూ ఓ అబాబిన్ ద్వారా సన్మార్గం యొక్క ప్రాశస్త్యాన్ని విడమరిచి చెప్పారు.

ప్రపంచీకరణ
పాత్రలు మారుతున్నాయి
మనసు మనసుకో పొలిమేర
కరీము!
పక్షుల కిచకిచలేవి అని ప్రశ్నించారు.

స్వర్గాన్వేషణలో
కొండలు, కోనలు తిరిగే మనసా
తండ్రిని మించిన ద్వారముందా?
కరీము!

అబ్బాజాన్ దుఆ అందుకో" అంటూ నాన్న పట్ల గౌరవం చాటుమని హితవు పలికారు.

ఆమెకు
మొలక వేయడం మాత్రమే తెలుసు
పంట అందించే చేనులా..
కరీము!

భార్యను మించిన అనురాగముందా!" అంటూ భార్య యొక్క గొప్పతనాన్ని చక్కగా ఈ అబాబీల్‌లో ఆవిష్కరించారు.

పై వాటితో పాటు ఇస్లాంవాద భావజాలాన్ని కూడా కొన్ని అబాబీల్లో పొందుపరిచారు. అక్కడక్కడ ముస్లింలలో వున్న అభద్రతా భావాన్ని సైతం సంయమనంతో ప్రస్తావించారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని నమ్మే మన దేశంలో మనం దరం కలిసి వుండాలన్న ఆకాంక్ష బలంగా ఉన్న కవి కరీంగారు తన అంతరంగంలో కదలాడే సమతాభావ ఆలోచనలకు అక్షరాకృతినివ్వడం బాగుంది.

కలాలన్నీ హలాలు కావు
హలాలన్నీ సుమధుర ఫలాలుకావు
అక్షరసేద్యం అట్టడుగు వెతలకే
కరీము!

చర్నాకోల అందుకో" అంటూ పిలుపునిచ్చారు.

నా కవిత్వం
హిచ్‌కాకి కుక్క పిల్లకాదు
అవార్డులకై తోకూపడానికి
కరీము!
సూరీడు తలవంచడని చెప్పు" అంటూ స్వాభిమానం చాటుకున్నారు.

మన భావాలను ప్రగతి శీలకంగా.. ప్రకటించడానికి.. 'అబాబీలు' ప్రక్రియ కేవలం ముస్లిం కవులకే కాదు.. మానవత్వం పరిమళించే ప్రతి ఒక్కరు సుసంపన్నం చేయడానికి ఉపయుక్తంగా ఉంది. సమతాభావాన్ని పెంపొందించడానికి.. అవినీతి, ఉగ్రవాదం, మతోన్మాదం అంతమొందించడానికి అబాబీలు సమస్త పీడిత ప్రజల పక్షాన నిలబడతాయన్న కవి కరీంగారి కల నెరవేరాలని కోరుకుందాం! ఏ విధమగు వివాదాలకు తావివ్వని.. ఎవ్వరినీ నొప్పించే అంశాలను కాకుండా.. సార్వజనీన అంశాల ప్రస్తావనకు.. సమైక్యత.. సౌభాతృత్వాలను చాటడానికి కవులు 'అబాబీలు' ప్రక్రియను వాహికగా, ఉపయోగించుకుంటారని ఆశిద్దాం.

'సర్వేజనా సుఖినోభవంతు' అన్న నానుడితో విరాజిల్లే మన దేశంలో ఈ దేశంపట్ల గౌరవభావం అన్ని మతాల ప్రకటిస్తూ తమ తమ మత విశ్వాసాలతో ఆనందంగా జీవనం గడపడానికి యోగ్యమైన రచనలను 'అబాబీల' ద్వారా అందించాలని కోరుకుందాం. 'అబాబీలు' కేవలం ఆక్రోశం.. ప్రకటించడానికే కాదు ఆవేదనను.. అనేక సామాజిక అంశాలను ఆనందంగా, ఆర్తిగా, ఆర్ద్రంగా, అందంగా ప్రకటించడానికే వీలుందని కరీంగారు ఇందలి రచనల ద్వారా తెలియజెప్పడం అభినందనీయం.

ప్రతులకు: శ్రీమతి షేక్ మషరున్
వై/ఆఫ్. కరీముల్లా
డో.నెం. 21-55 పెద్ద మసీదు బజారు,
వినుకొండ (పో)-522 647
గుంటూరుజిల్లా.ఆంధ్ర.
సెల్: 9441502990
వెల: 40/-

అజాత శత్రువు అటల్‌జీకి అక్షరహారతి పట్టిన కవులు



తమ బహుముఖీన ప్రజ్ఞలతో జీవితాన్ని ధన్యం చేసుకున్న భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్‌గారి పరమపద సందర్భంగా.. తెలుగు కవితా వైభవం వారు సహస్ర పుస్తక యజ్ఞంలో భాగంగా శ్రీ మేక రవీంద్రగారి సంపాదకత్వంలో **'అజాత శత్రువు అటల్‌జీ"** పేరుతో ఓ స్మృతి కావ్యాన్ని వెలువరించినారు. రాజ నీతిజ్ఞునిగా, కవిగా, పండితునిగా, విమర్శకునిగా, సమరసతావాదిగా, సమన్వయ సారధి గా, మానవతావాదిగా.. భారతీయ తను అణువణువునా పుణికి పుచ్చుకున్న మహోన్నత వ్యక్తిగా, మహావక్తగా.. జాతీయవాదిగా.. భారతీయ సంస్కృతి పరిరక్షకునిగా వెలుగొందిన అటల్‌జీకి కవులు అక్షరాంజలి ఘటించారు. ఈ కావ్యంలో ఉదారవాదిగా, సిద్ధాంత కర్తగా, మేరునగ ధీరుడిగా కవులు పేర్కొని నివాళులు అర్పించారు. శ్రీ మేక రవీంద్రగారి సంపాదకత్వంలో వెలువడిన ఈ గ్రంథంలో ఓ గొప్ప దార్శనికుడిగా, భావుకుడిగా, ఉన్నత వ్యక్తిత్వం ఉన్న మనిషిగా మంచి మనసున్న ప్రజాసేవకుడిగా ఆయా కవులు ఆవిష్కరించారు.

అటల్‌జీని మనసున్న మారాజుగా చంద్రశేఖర శర్మ తమ కవితలో పేర్కొన్నారు. భారతీరత్నహారంగా శేషకుమార్ భాష్పాంజలి ఘటించారు. సాధుజీవిగా భాసిల్లారంటూ రాచిరాజు మురళీకృష్ణ అంటే దేశసేవయే పరమావధిగా భావించారంటే ఆకుండిశైలజ వందనాలు సమర్పించారు. డా॥ బల్లూ ఉమాదేవి ఆట వెలది పద్యాల్లో వాజపేయికి అక్షరహారతి పట్టారు. సమయస్ఫూర్తిలో మీకు మీరే సాటి అంటూ పి.మురళీకృష్ణ కొనియాడారు. నవ్య సంస్కరణలకు నాంది పలికిన ఓ గొప్ప సంస్కర్తగా కదంబరి శ్రీనివాస్ అంటే.. అటల్‌జీని ఓ యోగిగా రామరాజు రాధా కృష్ణారావు వర్ణించారు. శత్రువులసలే లేని మిత్రశాలిగా త్రిపురాన వెంకట జగన్నా థరావు పేర్కొంటే.. గొప్ప రాజనీతిజ్ఞునిగా రాజేశ్ యాళ్ళ, సహృదయతకు మారు పేరుగా బి. రామమూర్తి, తమతమ కవితల్లో అక్షర నివాళి ఘటించారు.

పరిపాలనలో నూతనోత్తేజాన్ని నింపిన తేజస్విగా నాగేశ్వర్‌రావు కమలేకర్ వర్ణిస్తే కడిగిన ముత్యంగా అంజయ్యగౌడ్ తమ పద్యంలో చక్కగా ఆవిష్కరించారు. రాజకీయాల్లో అగ్రగణ్యునిగా పేర్కొంటే శ్రీశైలం బోనాల తమ కవితను రాస్తే.. స్వార్థరహిత నేత

గత సంచిక తరువాయి

మృణాళిని : మీరు ఇన్ని కవితలు రాశారు. మీకు కవితలకు రావాల్సిన పేరు ప్రశంసలు అన్నీ వచ్చినయ్. కాని జలగీతం అనేది మీ Magnum opus లాగ అయిపోయింది. మీ రచనలో జలం మీద పరిశోధన ఉంది అందులో ఇందాక అన్నారు కదా వేమన పరిశోధన అని పరిశోధన దృష్టి జలగీతంలో కూడా బాగా తెలుస్తుంది. ఆ స్ఫురణ ఎందుకు కలిగింది. జలగీతం రాయాలని?

గోపి : నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిన్ వాటర్ సమస్య ఉండడం వల్ల కొన్ని వందల గ్రామాల్లో అవిటివాళ్లయ్యారు. చాలా దారుణమైన పరిస్థితి. అందులో నాగార్జున సాగర్ ఈ గడ్డమీదనే ఉన్నది దీనికి నీళ్ళు లేకుండా పోవడం, నీళ్లకోసం ఉద్యమాలు ఇవన్ని ఉండేవి. మాకు ఊళ్ళో బావి దూరంగా ఉండేది. మా అమ్మ నీళ్ళు తోడితే నేను మోసుకొచ్చేవాడిని, నేను తోడితే ఆమె మోసుకొచ్చేది. నాకిప్పటికి నీళ్ళను కింది నుంచి పైకి తెస్తే పెద్ద అచ్చివ్ మెంట్ లాగా అనిపిస్తుంది చేతులకి. అది నామీద చాలా ప్రభావం చూపింది. మనం నీళ్ళను వృధా చేయకూడదు. నీళ్ళు ఎంతో విలువైనవి అనే సృహ మొదటి నుండి ఉంది నాలో. తర్వాత కొన్నాళ్ళకి జలయుద్ధాలే ప్రపంచంలో అనిపించింది. నారాయణ రెడ్డి గారు అనేవారు ఒక్క దీర్ఘ కవిత రాయలేదు నువ్వు అని. అంటే దీర్ఘ కవిత రాస్తే పస బయట పడుతుందని. తెలుగు యూనివర్సిటి వి.సి పదవి అయిపోయాక వంద రోజుల్లో రాశాను. లౌకిక ధూళిని కడుక్కోవడానికి నారాయణ రెడ్డిగారు నాకు తొలి శ్రోత. ఆయన అన్నారు నాకు వినిపిస్తావా నేనే మీ ఇంటికి రావాలా' అని. నేనేవెళ్లి ఆయనకు వినిపిస్తే ఆయనేమన్నాడంటే ఇందులో మూడు నాలుగు వేల లైన్లు ఉన్నాయి మొట్టమొదటి పంక్తిలో మొదలైన నీ ఉద్వేగ స్థాయి చివరి పంక్తి వరకు కొనసాగింది. this tells upon the energy of a poet అన్నారు. నేను ఎంత పులకించి పోయానో ఆయనకు నేనొకప్పుడు స్టూడెంట్ ని, ఆయన ఎంత సహృద శేఖరుడంటే నన్ను మెచ్చుకోవడానికి ఆయనకు అది అడ్డు రాలేదు.

మృణాళిని : ఎంత చిన్నవాళ్ళలో అయినా మంచి ఉంటే ఇలా పట్టుకుంటారు.

జవాబు : జలగీతం కావ్యాన్ని Water man రాజేంద్రసింగ్ కు అంకితం చేశాక ఫోన్ చేశాను. **"రాజేంద్రసింగ్‌జీ మై చోటా మోటా పోయెట్ హూ తెలుగు మే. ఆప్ కో యహ జలగీత్ సమర్పిత్ కర్‌నా చాహతాహూ"** అన్నాను. అంటే ఆయనన్నాడు **'ధన్య్ హెూ గయే హమ్. ముజే ఐసా లగరహెూహై మహసూస్ వోరహాహైకీ రక్త సంబంధ్ సే భీ జలసంబంధ్ గహరాహై"** అని మీరే కవిలాగున్నారే అన్నాను. అతనితో అనుభవాలు కూడా గొప్పగా ఉన్నాయి. రాజస్థాన్ లోని అతని ఫీల్డ్ కు వెళ్ళి తిరిగాను. నిజమైన భగీరథుడు రాజేంద్రసింగ్.

మృణాళిని : హింది వాళ్ళ గురించి చెప్పేటప్పుడు ఒక మంచి మాట అన్నారు మీరు. తెలుగు వాళ్ళు మహాకవి, గొప్ప కవి అని అంటారు. హింది వాళ్లు సంవేదనశీల్ కవి అంటారు. సంవేదనా శీల్‌కవి అనడం గొప్పకదా!

గోపి : సంవేదన అనే మాట హిందీలో చాలా పెద్దది. చాలా గొప్ప మాట.

జలగీతం చదివి రాజేందర్ సింగ్ నా గురించి అలా అన్నాడు.

మృణాళిని : మీరు ఎన్నో భాషల కవులను దగ్గరగా చూశారు భారతీయ సాహిత్యంలో తెలుగు సాహిత్యం ఏస్థాయిలో ఉందనుకుంటున్నారు?

గోపి : తెలుగుసాహిత్య కవిత్వం ఎవ్వరికీ తీసి పోదు. హిందీ వాళ్ళకంటే మన తెలుగు వాళ్ళే బాగా రాస్తున్నారు. మలయాళంలో మంచి కవిత్వం వస్తుంది. కన్నడంలో మనకన్నా మంచి కవిత్వం వస్తుంది. కాకపోతే వాళ్ళకున్న సహృదయత మనకుండదు. వాళ్ళు వాళ్ళ కవిని పరోక్షంగా కూడా చాలా మెచ్చుకుంటారు. మన వాళ్ళు పరోక్షంగా తెలుగు కవి మెచ్చుకోవడం చాలా తక్కువ సందర్భాల్లో చూస్తాం. ఇలాంటప్పుడు నారాయణ రెడ్డిగారే గుర్తుకు వస్తారు. అది మనం నేర్చుకోవాలి. ఆయన దగ్గరి నుండి కవిత్వాన్ని మాత్రమే కాదు సహృదయతను నేర్చుకోవాలి.

మృణాళిని : మీరు విమర్శకుల గురించి కూడా ఈ మాట అన్నారు. మన విమర్శకుల మీద కొంత అంసతృప్తి ఉన్నట్లు అనిపించింది. అంటే అంతగా అధ్యయనం చేసి రాయరు అని. మనం ఒక ఉద్దేశ్యంతో నేను రాస్తే ఆ ఉద్దేశ్యాన్ని పట్టుకోని విమర్శకులే ఎక్కువగా ఉంటారని

గోపి : అంటే మమకారం ఉండవచ్చు. సబ్జెక్టివిటి ఉండవచ్చు. ఒక పదిశాతం ఉండొచ్చు. కాని తొంబై శాతం నిర్మమమంగానే ఉండాలి. విమర్శకులు 100 శాతం నిర్మమమంగా ఉంటే అది పరిశోధన అవుతుంది. విమర్శ కూడా ఒక సృజనాత్మక ప్రక్రియలాంటిదే.

మృణాళిని : విమర్శకోసం మనకు ఇష్టమైన కవులను ఎంచుకుంటాము కదా!

గోపి: అవును, కొంత వరకు.

మృణాళిని : అంటే విమర్శకులకు అధ్యయనం ఉండాలి కదా ?

గోపి : బాగాఉండాలి. కవి కంటే ఎక్కువుండాలి. పాపం విమర్శకులు కూడా చాలా అసంతృప్తి పడతారు. నేను ఒకటి రాసే సరికి తిడుతున్నారు అంటారు. కవికి వచ్చిన పేరు విమర్శకులకు రాదు. అయితే సాహిత్య చరిత్రలో వాళ్ళకుండే స్థానం వాళ్ళకుంటుంది.

మృణాళిని : ఎక్కువ భాషల్లోకి అనువాదం కావడం మీ సాహిత్య జీవితంలో చాలా ముఖ్యమైన అంశం. మీరు ఈ విషయంలో ఒక రికార్డు స్థాపించారు అటే 'కాలాన్ని నిద్రపోనివ్వను' సాహిత్య అకాడమి పురస్కారం పొంది అనువాదంలోకి వెళ్లింది జలగీతం కూడా...

గోపి : అట్లాకాదు అవార్డు వచ్చిన పుస్తకాల్ని అకాడమి వెయ్యొచ్చు అనే ఒక ప్రావిజన్ మాత్రమే ఉంది. అంటే అది Mandetory కాదు.

'వందేమాతరం నుంచి జనగణమన వరకు' గ్రంథాన్ని ఆవిష్కరించిన భారత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు. తెలుగు విశ్వవిద్యాలయ మెమెంటోను అందిస్తున్న ఉప కులపతి డా॥ఎన్. గోపి. చిత్రంలో ఆచార్య జయధీర్ తిరుమలరావు తదితరులు (2001).



(ఐ డ్రీమ్ తెలుగు, యూట్యూబ్ చానెల్ కోసం ప్రముఖ కవి ఎన్. గోపి గారితో ఆచార్య సి. మృణాళిని జరిపిన ముఖాముఖి)

'మృత్యువు ఊసుతెచ్చి భయపెట్టకండి నన్ను, కాలం రహస్యం తెలిసినవాణ్ణి కాలానికి భయపడతానా?' అని నిర్భయగీతిని ఆలపించిన కవి, మానవీయ కవి కాలం కంటే మనిషి గొప్పవాడు అని తీర్మాణించిన కవి ఆచార్య ఎన్. గోపి గారు.

'అమ్మ రుణం తీర్చుకోవాలంటే అమ్మకు అమ్మాయి పుట్టాలి' అనే సూక్తుల లాంటి అనేక కవితా పంక్తులు ఆచార్య గోపిగారి కవిత్వంలో మనకు దర్శనమిస్తాయి. 1967 నుండి ఈనాటి వరకు అవిశ్రాంతగా కవిత్వం రాస్తూ 24 కవితా సంపుటాలను ఆయన ప్రచురించారు. అంతేకాదు కవిత్వానికే తన సాహిత్యం అంకితం చేయకుండా చాలా అద్భుతమైన యాత్రా చరిత్రలు, గొప్ప పరిశోధన, విమర్శ అన్నీ ప్రకటించారు. అంతే కాకుండా 'నానీలు' అనే సరికొత్త ప్రక్రియను కూడా సృష్టించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆచార్య ఎన్. గోపి గారే ఈనాటి అక్షర యాత్ర అతిథి.

మృణాళిని : చేయించడం వాళ్ళ విధి కాదు.

గోపి : అవును. వాళ్ళకేంటంటే ఒక అనువాదకుడు ముందుకు వచ్చి అడ్వైజర్ బోర్డు కు అప్లై చేసుకోవాలి. నేను ఫలానా పుస్తకాన్ని అనువాదం చేస్తాను అని. చేసుకున్నాక అడ్వైజరి బోర్డులో ఒక స్పెసిమన్ అనువాదాన్ని పంపమంటారు. పంపిన తర్వాత వాళ్ళు అప్రూవ్ చేసిన తర్వాత సాహిత్య అకాడమి వాళ్ళకు అసైన్ మెంట్ పంపిస్తుంది. అనువాదం చేయడానికి మళ్లీ ఆరు నేల్లో, సంవత్సరమో పడుతుంది. వాళ్ళు సమర్పించిన తర్వాత అచ్చుకి మరో సంవత్సరం పడుతుంది. ఒక పుస్తకం వ్యవధానం లేకుండా అన్ని దశలు దాటితే నాలుగైదేండ్లు పడుతుంది. నా విషయంలో ఏమైందంటే ఇరవయ్యేళ్లుగా అకాడమీ నిర్వచించిన కావ్యపరనాల్లో నా కవిత్వం విని ఆయా భాషల్లోని ప్రసిద్ధ కవులు అనువాదానికి ముందుకొచ్చారు. మీరు వాటికి అప్లై చేసుకోండి అనేవాణ్ని. ఉదాహరణకు ప్రసిద్ధ తమిళ కవి శిలిపి బాలసుబ్రహ్మణ్యం గోవాలో ఓ కార్యక్రమంలో నా 'రొట్టె', 'బొంత' కవితలు విని దగ్గరకొచ్చి ఆయన 'Gobi you are a wonderful poet, i want to translate your award winning book' అన్నారు. అప్పుడు ఆయన కన్వీనర్. ఆయన చేయడం వల్ల రేండేండ్లలో వచ్చింది. ఇట్లా సాహిత్య అకాడమిలో నా అనువాదాలు కవితా పఠనాల్లో నా కవిత్వం వాళ్ళను ఆకర్షించడమే గాని సాహిత్య అకాడమి వాళ్ల రూల్ ఉండడం వల్ల కాదు. ఇంత వరకు ఏవీ కానివారు నా కంటే పెద్ద పెద్ద వాళ్ళ ఉన్నారు. డోగ్రీ కవయిత్రి పద్మాసచ్చిదేవ్ కంటె మనకు Influence ఉందా. నా అనువాదాలన్నింటికి దాదాపు 20 యేళ్ళ పట్టింది. 'నేను నా అనువాదకులు' అని ఒక పుస్తకం రాద్దామనుకున్నాను. నా అనువాదకులతో దాదాపు ఒక వెయ్యి గంటలు కూర్చొని ఉంటాను. నేను ఫర్ ఫెక్షనిస్టును కదా! ఒక్కోసారి విమానంలో వాళ్ళ దగ్గరకు పోయి రెండు మూడు గంటలు కూర్చున్న. ఉదాహరణలు కూడా ఉన్నాయి. అంటే ఇప్పుడు తెలుగులో ఎంత గట్టిగా ఉందో మిగిలిన భాషల్లో కూడా అంత గట్టిగా కుదిరాయి అనువాదాలు.



మృణాళిని : జలగీతం ఏరకంగా అనువాదం అయింది?

గోపి : జలగీతం పత్రికల్లో వస్తున్నప్పుడు అందరిని ఆకర్షించింది. ఇట్లాగే జలగీతం పఠనం వల్ల కూడా ఆచార్య మాణిక్యాంబ ఆమె నేను ఉమెన్స్ కాలేజిలో పని చేస్తున్నప్పుడు మ్యానుస్క్రిప్ట్ రాసేటప్పుడు వచ్చింది. 'ఆమె వచ్చి సార్ ఇది చాలా గొప్పగుంది. నేను అనువాదం చేస్తా' అంది నేను మౌనంగా ఉండేవాన్ని. 'చూద్దాం అమ్మా చూద్దాం' అన్నాను. ఆమె ఒకసారి నిలదీసింది. నా మీద నమ్మకం లేదా నేను బాగా చేస్తానని. ఆమె ఇంత పెద్ద మాట అన్నదే అని. మ్యాను స్క్రిప్ట్ దశలో ఉన్నప్పుడు జిరాక్స్ తీసి ఇచ్చాను. 'నేనన్నాను నాతోటి వేగాలి మీరు' అని. 'నేను వేగుతా' అంది. అక్షరం అక్షరం ఆమె చాలా బాగా చేసింది. ఆమెకు హింది అనువాద పరిషత్ ఢిల్లి వారి లక్షరూపాయల అనువాద పురస్కారం లభించింది. జలగీతం అనువాదానికి. ఇంగ్లీష్ లో అల్లాడి ఉమ. ఎమ్. శ్రీధర్ మంచి అనువాదం చేశారు. ఆణిముత్యాలు వాళ్ళు. చాలా బాగా చేశారు.

మృణాళిని : మీ కవిత్వం గురించి ఒక్కమాట ఉంది. చాలా సరళంగా రాస్తారని సరళంగా సుభోదకంగా ఉండే కవిత్వం మీది. వెంటనే అర్థమవుతుంది. మీరది కాన్షెస్‌గా చేసుకున్న ప్రయత్నమా లేకపోతే సహజంగా వచ్చిందా ?

గోపి : కాన్షెస్ గానే కాకుండా అది నా తత్వం గూడా. ఏంటంటే పెద్ద పెద్ద మాటలు వాడామనుకోఅవి మనం అనుభవించినవి కాదు. గదా! సహజంగా ఆభరణాల్లాగా, కుదరాలి పదాలు. ఎక్కడో అవసరమైతే తప్ప గొట్టుపదాలు వాడను. ప్రాచీన కవిత్వం అధ్యయనం నాకు తక్కువేం లేదు. కదిలితే ఆ మాటలే వస్తాయి. అందుకని కొత్త సమాసాలు, అంటే సంస్కృత సమాసాలు అని కాదు. కొత్త మాటల కూర్పు, భద్రిరాజు కృష్ణమూర్తి గారు అనేవాడు మహకవి ఎవరయ్యా అంటే uninvolved construction రాసేవాడు అని. తిక్కనను అందుకే కవిబ్రహ్మ అంటానన్నాడు. అందరూ చైతన్యం అంటారు. నేను **'చైతన్య క్షణాలు'** అనే మాటవాడాను. కొత్త కొత్త సమాసాలు కొత్త కొత్త మాటలు ఆ వాడటం నాకిష్టం. కష్టమైనమాటల్తో ఎదుటివాళ్ళను ఎందుకు కష్టపెట్టడం. అంతేకాదు మన శైలి మనది, అది మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. కవికి శైలి ముకురం లాంటిది. కాబట్టి నా పద్ధతి, నేను మాట్లాడుతున్నది. పఠితకు దగ్గరగా ఉండటం నా దేశీయత, నా ప్రాంతీయత. అంటే మిగతావాళ్ళను దూరంగాని ప్రాంతీయత. మన ప్రత్యేకత ఉండాలి తప్ప గిరి గీసుకుని ఉండేది కాదు.

మృణాళిని : ఉద్యమాల స్ఫూర్తి ఉన్నప్పటికి కూడా మీరు వాటిలో ఇమిడి పోలేదు. మీ కవిత్వం చదివినప్పుడు నేను గమనించిందేంటంటే మీరు యాత్రలు బాగా ఇష్టపడుతారు. మామూలుగా రాసిన కవిత్వంలో కూడా ఒక ప్రయాణం అనేది కూడా జరుగుతున్న స్ఫురణ. ఒక్కొక్క సన్నివేశాన్ని చూసినట్లుగా ఉంటుంది మీ కవిత్వం.

గోపి : నన్ను ప్రయాణ కవి అని నా స్నేహితులు కూడా అంటారు. నేను బస్సులో ప్రయాణించేటప్పుడు కూడా ఒక కవిత రాయకుండా ఉండలేకపోయేవాణ్ణి. చలనం. చలనం మనిషిని లోపల నిద్రాణంగా ఉన్న జ్ఞాపకాలను మేల్కొపుతుందని నా నమ్మకం. నా విషయంలో నాకు అనుభవం. నేను మొట్టమొదటి సారిగా విమానం ఎక్కినప్పుడు ఆ త్రిల్లు నేను బాగా అనుభవించాను. కిందికి చూసి ఏం రాసానంటే **'మా ఊళ్ళో చేతులు కనిపిస్తున్నాయి. మా ఊళ్ళోని అందరూ తమ చేతులతో ఎగిరేస్తే నేను విమానంలో ఉన్నాను'.** అని అట్లా నేనిప్పటికీ కొన్ని వందల సార్లు విమానం ఎక్కిఉంటాను కదా. మీరు నమ్మాలి నేను ఇప్పటికీ మళ్ళీ ప్రెష్ గా కొత్తగా విమానం ఎక్కినట్టే ఫీలవుతాను. ఇప్పటికీ పాత బడలేదు.



మృణాళిని : అనుభూతులు ఎప్పటికప్పుడు తాజా చేసుకుంటారు.

గోపి : తాజా చేసుకుంటా. 'ఇవాళ విమానం ఇది కొత్తగా ఉంది. చక్రం కొత్తగా ఉందే ఇంతకు ముందు లేదే అనుకుంటా. విమానం మీద కూడా కవితలు రాశాను. కాబట్టి నాకేది పాత బడదు. విమానం ఎప్పుడూ బడాయి కాదు నాకు. ఒక అనుభవం. అవకాశం వచ్చింది అనుకుంటా. కిటికి రాలేదనుకోండి నాకు ఆ విండో సీటు దొరక్కపోతే దాని మీద బాధతో ఒక కవిత రాశాను. కిటికీ శాకుంతలంలోని చతుర్థాంకం లాంటిది.

మృణాళిని : ఇక మీ యాత్రా చరిత్రలు. అమెరికా గానీ, సైప్రస్ గానీ, మారిషస్ గానీ యాత్రాచరిత్రలుగా రాశారు. కాని ఇంగ్లండ్ గురించి రాసినప్పుడు అలాగే గోవా, 'మరో ఆకాశం' గాని ఇట్లాంటి వాటిని మీద కవిత్వంగా రాశారు. కవిత్వంలో యాత్రాచరిత్ర రాయడం అనేది.

గోపి : యాత్రచరిత్రల్లో రాసిన కవితలు కూడా వేరు పుస్తకంగా వేశాను. 'మరో ఆకాశం' అనేది ఇంగ్లాండు కవిత్వం. జర్మని యాత్రాచరిత్రలో కవితలు రాశాను. వైనా వెళ్ళినప్పుడు కూడా కవితలు రాశాను. నేనుకుంటాను, మృణాళిని గారూ! దిగువమధ్యతరగతి సైకాలజి ఉన్నట్టుంది నాకు. నేను ఎక్కువగా నడిచేవాణ్ణి. బస్సు ఎక్కడానికి కూడా డబ్బులు కూడా ఉండేవి కాదు. నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న మీ ఇంటికి రావాలనుకో కూడా నడిచి ఐదు నిమిషాల కోసం వచ్చేవాణ్ని. నడక నన్ను ఉద్వేగభరితం చేస్తుంది. ఇప్పటికి నాకు అనిపిస్తుంది వాహన అవకాశం చాలా మందికి రాలేదు. చిన్నప్పుటి స్నేహితులు నాకంటె తెలివైన వాళ్ళు ఊళ్ళో నే ఉండిపోయారు. నన్ను వీళ్ళందరు ప్రొఫెసర్ అంటున్నారు. వీళ్ళే నాకంటే తెలివైన వారు పాపం అక్కడే ఉండిపోయారు అనిపిస్తుంది. ఇదే సంవేదనా శీలత అంటే. ఇప్పటికీ నేను మనుష్యులను పోగొట్టుకోను. తొందరగా ఏదో ఒకటి మాట్లాడి వాళ్ల మనసు విరిచేసి పోగొట్టుకోను. ఒకవేళ నేను పొరపాటుగా మాట్లాడితే వెంటనే వాళ్ళకు దగ్గరవ్వడానికి ప్రయత్నం చేస్తా.

మృణాళిని : ఇప్పుడు మీరు సృష్టించిన ప్రక్రియ గురించి నానీల గురించి. నానీలు అనేవి ముక్తకాలు తెలుగు సాహిత్యంలో మొదటి నుండి ఉన్నాయి కదా! నానీ అనేదాన్ని ఒక ప్రక్రియగా తీసుకురావాలనే ప్రేరణ ఎందుకు కలిగింది.

గోపి : నేను ప్రక్రియ సృష్టించాలనుకోలేదు. మా ఇంట్లో ఒక ఉపద్రవం జరిగినపుడు రెండేండ్లు చాలా బాధగా ఉన్నా ఏది అనిపిస్తే అది రాస్తూపోయా. అవి చిన్న కవితల్లాగా ఉన్నావి. నాకప్పుడు జ్వరం వచ్చింది. ఏ. బి.కె ప్రసాద్ గారు నన్ను చూడడానికి వచ్చారు. వార్తకు అప్పుడు ఎడిటర్ ఆయన. వచ్చి వాటిని చూసి **"ఒరేయ్ అబ్బాయి నీ తల దగ్గర గొప్ప విప్లవాన్ని పెట్టుకున్నావురా"** అన్నాడు. 'ఏంటిసార్' అన్నాను. **'చాలా గొప్ప కవితలు ఇవి చాలా ఫ్రెష్ గా ఉన్నాయి. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో లేనంత ఫ్రెష్ గా ఉన్నాయి'** అని తీసుకుపోయిండు. ఆయన వాటిని ఎడిటోరియల్ పేజిలో వేశాడు. 20 వారాలు వరుసగా వారానికి 20 చొప్పున. దాంతో అవి కారుచిచ్చులాగ వ్యాపించాయి. పశ్చిమ గోదావరి జిల్లా నుండి మొదలైన దానికి అనుసరణలు. కారణం దాని నిర్మాణం వల్ల. మరొటి కవితాశక్తి. విసయంగా చెబుతున్నా కవితాశక్తి అని. తర్వాత నిర్మాణం. నాలుగు లైన్లు ఉంటాయి మొదటి రెండు పక్తుల్లో ఒక స్టేట్ మెంటు ఉంటుంది. రెండవ మలిసగం దానికి సమర్థకంగానో దానికి వ్యాఖ్యాన ప్రాయంగానో ఇంకే రకంగానో ఉండాలి. పేలడం అనేమాట నాకు బాగలేదు. చదవగానే అబ్బా అనిపించాలి. మనస్సుకు అబ్బా అనిపించకపోతే అది మంచి నాని కాదు. నానీల కాలంక్షేపం కోసం రాయగూడదు. ఎవరైన వస్తే గూడ నేను ఆ లక్షణాలు చెప్తాను. ఒకసారి ఏమైందంటే ఆ ఆదిలాబాదు నుండి ఒక యువకుడు కాగితం మీద రాసి పంపాడు వచ్చాడు. నేను చదివి వెక్కి వెక్కి ఏడ్చాను.

" బువ్వ తింటాంటే
సరంబడ్డది,

ఎక్కడో రైతు
ఆత్మహత్య చేసుకున్నాడు." అని
నేను ఒక నానీలో
"దహనంలో
కుడిచేయి కాలలేదు
కారణం
కలం పట్టిన చెయ్యి."

రెండో సగం పంచ్ అన్నమాట. నిర్మాణంలో మంచి భావం చరుపుగా పని చేస్తుంది. ఇప్పటి వరకు మీరు నమ్మండి వెయ్యి మంది రాసుంటారు. పుస్తక రూపంలో 350 లకు పైగా సంపుటాలు వచ్చాయి. కాలపరీక్షకు నిలబడ్డదీ ప్రక్రియ. ఇది ఉబలాటం కోసం వచ్చింది కాదు. నేను నానీల కీర్తిమీద బ్రతకాల్సిన అవసరం లేదు కదా! దీని ద్వారా కొత్త కవులు వచ్చారు. కాని మంచి నానీ రాయడం అంత సులభం కాదు. అందులో సాంద్రత, గాఢత ఉంటేనే అది మంచి నానీ అవుతుంది. అంటే వెక్కసమై వెక్కసమై, మాగీ మాగీ నానీ నానీ వస్తే మంచి నానీ పుడుతందని నా అనుభవం.

మృణాళిని : నానీ అంటే అర్థం ఏమిటి ?

గోపి : నానీలు అంటే చిన్నపిల్లలు అని అర్థం. మనం అంటం కదా మన పిల్లల్ని నానీ అని చిన్న పద్యాలు అని. నేను చమత్కారంగా ఏమన్నానంటే **'నావి నీవి వెరసి మనవి'.** అని

మృణాళిని : నానీల మీద మంచి విమర్శ వచ్చిందా ?

గోపి : తొలి రోజుల్లో అక్కడక్కడ సాహిత్యేతర స్పందన వచ్చింది. అష్టమవార్షికోత్సవం జరిగింది. దాని తర్వాత దశమ వార్షిక ఉత్సవాలు జరిగాయి. ఇప్పుడు 22 ఏడులో ప్రవేశిస్తుంది. మొదట్లో ద్విదశాబ్ది ఉత్సవాలు చేద్దాం అనుకున్నాం. నాకు అనిపిస్తుంది రజతోత్సవం చేస్తే బాగుంటదేమో అనిపిస్తుంది. ఇంకా వస్తునే ఉన్నయ్. నాకు తృప్తిగానే ఉంది, నానీ ఉద్యమస్థాయికి వచ్చింది గాని ఉద్యమం కాదు. ఈస్థాయికి వస్తుందని నాకు కూడా తెలియదు. నేను పక్కకు నుంచే దీనిని గమనించా. దీంట్లో దమ్ముంది, అందుకే నిలబడింది.

(మిగతా వచ్చేవారం...)



పుస్తక సమీక్ష

కలల సౌధాలలో పండిన కథలు



మనిషి ఆశాజీవి.. కోరుకున్న ఆశలు నెరవేరినా, నెరవేరకపోయినా కలలుమటుకు కంటూనే ఉంటాడు. తన తాహతు ఏమిటో, తన జీవితం ఎలా సాగిపోతుందో అనేది తనకు చూచాయగా తెలుస్తున్న... అవన్నీ మరచిపోవటానికి ఆనందదాయకమైన కలలే కంటాడు. ఇలలో అనుభవించని వాటిని కలలో చూసుకొని ఆనందిస్తుంటాడు. ఊహలు అందమైన కలల్లోనే పయనిస్తుంటాయి. తాను తిన్నా, తినకపోయినా కలలసౌధాలలో జీవితాన్ని వెళ్ళబుచ్చుతుంటాడు.

రచయిత యం.బాలగంగాధరయ్య పండించిన కలలను కలలసౌధాలలో పయనింప చేస్తుంటాడు. బాలగంగాధరయ్య ఇప్పటికే ఎన్నో కథాసంపుటాలు, నవలలు, కవితాసంపుటాలు రచించిన రచయిత. ఈయన కథాప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోగలిగాడు.

ఇక కథలవిషయానికొస్తే... బహుకుటుంబీకుడైన రైతు తన ఆరుగురు సంతానంలో చిన్నకూతురు బాగా చదువుకొని ఉద్యోగస్తురాలు అవుతుంది. అంతలో తండ్రి మరణించడం, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తల్లి వైద్యం కోసం లంచాలకు అలవాటుపడటం, తదుపరి సస్పెండు కాబడటం, ఆ తరువాత తల్లే కూతురిని లంచం తీసుకున్న సొమ్మును ఏం చేశావ్ అని నిలదీయటం, దాంతో నేనిన్నాళ్ళూ కష్టపడటం ఇందుకేనా.. అని బాధపడటం... 'ఎవరికోసం' కథ సారాంశం. కథ మధ్యతరగతి కుటింబీకుల మనస్థత్వం తెలియపరుస్తుంది.

ఒక పెళ్ళీడుకొచ్చిన పిల్ల తల్లిదండ్రులను, పెళ్ళిచూపులకు వచ్చిన పిల్లవాడు, అతని తల్లిదండ్రులు అధికమొత్తంలో కట్నం అడిగినప్పుడు పెళ్ళిపిల్ల ఉపాయంతో ఆ దృశ్యాన్ని సి.సి.కెమేరాలో బంధించి పోలీసులకు అప్పగించాలనుకోవటంతో పెళ్ళిపిల్లాడి తల్లి ఇటువంటి గడుసుపిల్లే నాకు కోడలు కావాలనుకోవటం, తరువాత తండ్రి కట్నాన్ని వద్దని ఒప్పుకోవటం ఈనాటి ఆడపిల్లలు తెగువను అందరూ మెచ్చుకోవటం ఒక మధ్యతరగతి యువతి సాహసం తెలియజేయటంలో రచయిత బాలగంగాధరయ్య కృతకృత్యులయ్యారు.

ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో వివాహేతర సంబంధం నేరం కాదనటానికి స్పందిస్తూ రాసిన కథ 'మీరేమంటారు'.



ఈ కథలో తీర్పుమీద జరిగిన చర్చలో సదాచారుల వ్యతిరేకత, నేటి యువత సమర్థన.... దీనిపై మీరేమంటారు అని సమాజాన్ని ప్రశ్నించటం చూస్తుంటే ఈ చర్చకు ముగింపులేదని ఈ కథ చెప్పకనే చెప్పింది అనిపించింది.

ఒక అనాథ స్త్రీని బలాత్కరించటమేకాక, ఆమెమీద గొలుసు దొంగతనాన్ని అంటగట్టిన ఒక ఘనుడి తెలివికి ఆమె వేదన అరణ్యరోదన కావటం ఒక సందేశాత్మక కథ.

ఏదో అడ్రసు అడగటానికి వచ్చిన చైన్ స్నాచర్లకు ఒక మహిళ ఎట్లా బుద్ధి చెప్పిందో తెలిపే కథే 'సమయస్ఫూర్తి' ఇది ఒక ఆకర్షణీయమైన కథ.

ఇట్లా స్త్రీల ఔన్నత్యాన్ని కాపాడే వైవిధ్యమైన కథలు ఇవి. ఇవన్నీ మనచుట్టూ జరుగుతున్న సంఘటనలే అన్నట్లుగా ఉంటాయి. ఈ కథాసంపుటిలోని కథలన్నీ చదవాల్సినవే. రచయిత బాలగంగాధరయ్య నుండి మరిన్ని మంచి రచనలు రావాలని ఆకాంక్షిస్తూ.....

ప్రతులకు:యం.బాలగంగాధరయ్య,
ఇం.నెం.2-3-812, శ్రీగణేష్‌నగర్,
నాగోల్, హైదరాబాద్-500068.
పేజీలు:127,
వెల: 100/-
సెల్:98495 46762

-పొత్తూరి సుబ్బారావు
సెల్:9490751681

ప్రేమ, శాంతి, ధ్యానం అంశాలతో

సమాజ హితంకోసం ఘనంగా జరిగిన కవియాత్ర

సమాజ హితం కోసం చేపట్టిందే కవియాత్ర అని తెలంగాణ తాళపత్ర పరిశోధకులు, సినీ కవి కావూరి శ్రీనివాస్, డీఎస్పీ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవి కారంశంకర్ దంపతులు తలపెట్టిన కవి యాత్రను ఆదివారం జిల్లా గ్రంథాలయం నుంచి జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కవి యాత్ర సమాజాన్ని చైతన్యవంతం చేస్తుందన్నారు. ప్రేమ, శాంతి, ధ్యానం అనే మంచి అంశాలను తీసుకొని ఈ యాత్ర నిర్వహించడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చూకూరుతుందని అన్నారు. కవులు, రచయితలు నూతన కవితా ఆవిష్కరణలు చేసి తమ కవితాగానం వల్ల ప్రజలను నిత్యచైతన్యాన్ని కలిగించడం గొప్ప విషయమన్నారు.

అనంతరం పాటలు సీడీనీ ఆవిష్కరించరు. కార్యక్రమంలో ప్రముఖ కవులు, రచయితలు బి. వెంకట్,మడిపెల్లి భద్రయ్య, డాక్టర్ యు. కృష్ణంరాజు, జీఆర్.కుర్మే, గంగుల చిన్నన్న, కడారి దశరథ్, జాదవ్ పుండలిక్‌రావు, పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో

యాత్ర వినూత్న యాత్ర అని కవులు అన్నారు. నిర్మల్ జిల్లాలో మొదలైన కవియాత్ర ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి చేరుకుంది. యాత్రకు జిల్లా కవులు బబీ చౌరస్తా వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు బొడ్డు మహేందర్ మాట్లాడుతూ జిల్లాలుగా విడిపోయినా కవులుగా మనమంతా ఒకటే అన్న భావాన్ని ఈ కవియాత్ర ద్వారా తెలియజేయనున్నామని పేర్కొన్నారు. సాహితీ సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి డి. వామనరావు మాట్లాడుతూ సమాజాన్నే వేదికగా చేసుకుని సమాజహితం కోసం కృషి చేస్తున్న సామూహిక కవుల యాత్ర ఇదని అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ప్రధాన కార్యదర్శి నాగవర్మ ముత్యం మాట్లాడుతూ కవియాత్ర స్ఫూర్తిని మంచిర్యాల జిల్లాలో కొనసాగిస్తామన్నారు. కవయిత్రి అడ్డగూరి శ్రీలక్ష్మి కవియాత్ర స్ఫూర్తిని ఒక పాటగా ఆలపించారు. కార్యక్రమంలో కవియాత్ర వ్యవస్థాపకుడు కారం శంకర్‌తో పాటు మడిపల్లి భద్రయ్య, కావూరి శ్రీనివాస్, బెల్లాల సుగుణాకర్, జి. సంతోష్, బి. జగన్మోహన్ రావు పాల్గొన్నారు.

జన్నారంలో..

సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు 'కవియాత్ర' చేపట్టామని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత మామిడిపల్లి భద్రయ్య అన్నారు. నిర్మల్ నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వరకు చేపట్టిన కవియాత్ర ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ యాత్రకు స్థానిక కవులు స్వాగతం పలికారు. అంబేద్కర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రేమ, శాంతి నెలకొల్పేందుకు తమ వంతు ప్రయత్నంగా కవియాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో కవులు వెంకటేశ్వశర్మ, కొత్త వేణుగోపాల్ గుప్తా పాల్గొన్నారు.

ఈ కవియాత్ర నిర్మల్ నుంచి ఖానాపూర్, కడెం, జన్నారం, మంచిర్యాల, ఆసిఫాబాద్ వరకు కొనసాగింది. ఎంతోమంది కవులు పాల్గొని కవియాత్రను విజయవంతంచేసినందుకు కారంశంకర్ దంపతులు ధన్యవాదాలు తెలిపారు.

ఆహ్వానము

సాహితీ కిరణం

ప్రపంచరికార్డులు నెలకొల్పిన శ్రీ త్యాగరాయ గానసభ

శ్రీ యం. బాలగంగాధరయ్య రచించిన 'కలలసౌధంలో' కథలసంపుటి ఆవిష్కరణ & మనవరాలు సౌగంధికకి అంకితం

ముఖ్యఅతిథి : శ్రీ బైసదేవదాసు, సంపాదకులు,నేటినిజం
సభాధ్యక్షులు : శ్రీ గుదిబండి వెంకటరెడ్డి, గౌరవ సంపాదకులు,సాహితీకిరణం
విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్.జనార్దనమూర్తి, అధ్యక్షులు,శ్రీ త్యాగరాయ గానసభ
సభాప్రారంభం : శ్రీ పొత్తూరి సుబ్బారావు, సంపాదకులు,సాహితీకిరణం
ఆత్మీయ అతిథి : డా॥పూసల రజనీగంగాధర్, సాహితీవేత్త
పుస్తక పరిచయం : శ్రీ డా॥పి.లలితవాణి, సాహితీవేత్త
కవిసమ్మేళనం & సభానిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు, సలహాదారులు,సాహితీకిరణం

సాంస్కృతిక కార్యక్రమం
'హేమంతసమీరాలు' కవిసమ్మేళనం
పాల్గొను కవులు, కవయిత్రులు
శ్రీవి.వి.సత్యప్రసాద్, శ్రీమతి డి.పంకజమఖిక్, శ్రీమతి శిష్ట్లా మాధవి, శ్రీమతి కె.సుబ్బాయమ్మ,శ్రీమతి టి.వి.శిరీష, శ్రీమతి నందిమళ్ళ మాధవీ శ్రీనివాస్, శ్రీమతి జ్యోతిరాజ్ భీశెట్టి, శ్రీమతి పి.ఉమాశశి, శ్రీ యం.రఘుపతి,శ్రీమతి పద్మశ్రీలత

తేది : డిసెంబర్ 14 శనివారం సా॥6.00గం॥లకు
వేదిక : కళాసుబ్బారావు కళావేదిక దిక్కడపల్లి, హైదరాబాద్.

పారదర్శక విధానంలో వ్యవసాయ సబ్సిడీ

హైదరాబాద్, డిసెంబర్ 11:ప్రతీయేటా రైతులకు వివిధ రకాల సబ్సిడీల పేరిట కేటాయిస్తున్న నిధులు దుర్వినియోగం కాకుండా ప్రతి రైతుకు చేరాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాల సబ్సిడీ రూపంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.500కోట్లు రైతులకు అందజేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో విత్తనాలు కొనుగోలు చేసి వాటిని సబ్సిడీ ధరపై రైతాంగానికి అందజేస్తారు. ఈ విత్తన సబ్సిడీలను కొందరు కాజేస్తున్నారనే ఆరోపణలతో మరింత పారదర్శ కంగా విత్తనాల సబ్సిడీని అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది.ఇందుకోసం డీబీటీ విధానాన్ని అమలు చేయాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. డీబీటీ విధానాన్ని వ్యవసాయ యంత్ర పరికరాలకు అందజేసే సబ్సిడీకి సైతం విస్తరించేందుకు వ్యవసాయ శాఖ ఉన్నతాధి కారులు నిర్ణయించినట్లు తెలిసింది.ప్రధానంగా ప్రతీ సంవత్సరం వ్యవసాయ శాఖ ద్వారా వరి, వేరుశనగ, శనగ, సోయాబీన్, పచ్చిరొట్ట తదితర విత్తనాలను రైతాంగానికి 33శాతం సబ్సిడీపై సరఫరా అవుతాయి. ఈ విత్తనాల సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం సుమారు రూ.200కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 95శాతం సబ్సిడీ, ఇతరులకు 50శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలు అంద జేస్తుంది. వివిధ పథకాల కింద సబ్సిడీ శాతంలో తేడా ఉన్నది. యంత్ర పరికరాల విషయంలో రైతులు సైతం తమకు నచ్చిన కంపెనీ యంత్ర పరికరాలు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా ఈ సబ్సిడీ డబ్బులు ఆయా రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేయాలన్న ఆలోచన ఉంది. ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే బిడ్లలో పాల్గొని అర్హత సాధించిన కంపెనీల నుంచే రైతులు యంత్రాలను కొనుగోలు చేయాలి. రైతులు యంత్రాలు కొనుగోలు చేసిన తర్వాత సబ్సిడీ సొమ్ము వారి బ్యాంకు ఖాతాలలోకి చేరుకుంటుంది. రాష్ట్రంలో సుమారు రూ.300కోట్ల సబ్సిడీ యంత్ర పరికరాల కోసం ఖర్చు చేయనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేయడానికి అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. రైతుల సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతున్న ప్రభుత్వం ప్రతీ రూపాయి రైతులకు నేరుగా చేరాలనే ఉద్దేశంతో సబ్సిడీ డబ్బులను వారి ఖాతాలలో జమ చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. మరోవైపు అవినీతిని పూర్తిస్థాయిలో అరికట్టడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేసేందు కు కసరత్తు జరుపుతుంది. ప్రభుత్వ పరంగా ప్రతీ సంవత్సరం రైతాంగానికి విత్తనాలు, వ్యవసాయయంత్రాల కొనుగోలుపై సబ్సిడీ ఇస్తున్నారు. ఇందుకుగాను రైతులకు 33శాతం సబ్సిడీపై విత్తనాలు అందజేయ బడతాయి. తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ నుంచి సర్టిఫికెట్ పొందినటువంటి విత్తనాలను రైతులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఎంతమేరకు రైతులకు అవసరమనే విషయంలో వారి భూ విస్తీర్ణం ఆధారంగా విత్తన కొనుగోలు చేపడితే, ఆయా విత్తనాలపై సబ్సిడీ డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాలలో నేరుగా జమ చేయడం జరుగుతుంది. తక్కువ ధరకు వస్తున్నాయనే ఉద్దేశంతో ప్రభుత్వ ధ్రువీకరణ లేని విత్తనాలు కొనుగోలు చేస్తే ఈ సబ్సిడీ ఇవ్వడం జరగదు. బయటి మార్కెట్‌లో రైతులు కొనుగోలు చేసేటటువంటి విత్తనాల్లో నాణ్యతా లోపం, కల్తీతో రైతులే నష్టపోతారు. ప్రభుత్వం గుర్తించిన సంస్థల ద్వారా కొనుగోలు చేస్తే మరింత నాణ్యమైన విత్తనాలు రైతాంగానికి అందే అవకాశాలు ఉంటాయి. ఈ నిబంధనలకు అనుగుణంగానే రైతులుకు సబ్సిడీ డబ్బులు వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుంది. దీంతో నకిలీలను కూడా అరికట్టాలని చూస్తున్నారు. కొత్త విధానంతో సబ్సిడీ డబ్బులు రైతులకు నేరుగా అందడంతో అక్రమాలు జరగకుండా నిరోధించవచ్చు అనేది ప్రభుత్వ ఆలోచనగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వం సబ్సిడీపై యంత్ర పరికరాలు సరఫరా చేస్తుండగా బయటి మార్కెట్‌లో రైతులు ఇష్టమైన వాటిని కొనుగోలు చేసేందుకు ఈ కొత్త విధానం ఉపకరిస్తుందని చెప్పవచ్చు. ప్రధానంగా సబ్సిడీ విత్తనాల విషయంలో జరుగుతున్న అక్రమాలను పూర్తిస్థాయిలో నిరోధించాలని సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రతియేటా కోట్లాది రూపాయలు ఖర్చుచేసి సబ్సిడీ విత్తనాలు రైతులకు అంద జేయడం జరుగు తుంది. కొందరు అక్రమార్కులు రైతుల పాసుపుస్తకాల పేరిట విత్తనాలు తీసుకువెళ్లడం, మరికొందరు సబ్సిడీ విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి అనేక అక్రమాలు చోటు చేసుకుంటు న్నాయి. వాటికి చెక్ పెట్టడానికే ప్రభుత్వం డీబీటీ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.ప్రభుత్వం అందజేసే సబ్సిడీ పక్కదారి పట్టకుండా నేరుగా రైతులకు చేరుతుంది. సబ్సిడీ విత్తనాలు పక్కదారి పడుతుండడం జరుగుతుంది. కొందరు అక్రమార్కులు సబ్సిడీ విత్తనాలను పక్కదారి పట్టించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయి స్తున్నారు. ఇలాంటి వాటన్నింటికీ చరమగీతం పాడవచ్చు. యంత్ర పరికరాల విషయంలోను సబ్సిడీ నేరుగా రైతులకు అందజేయడం వల్ల రైతుకు ఇష్టమైన కంపెనీకి చెందిన యంత్ర పరికరాలు కొనుగోలు చేయవచ్చు.

చేటు తెస్తున్న విచ్చలవిడి ఎరువుల వినియోగం

-రైతులకు ఇబ్బంది లేకుండా చైతన్యం

నిజామాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): యాసంగి సీజన్లో రైతులకు ఇబ్బంది కలగకుండా క్షేత్రస్థాయిలో అధికారులు సేవలందించాలని జిల్లా వ్యవసాయాధికారి అన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి పలు రకాల రాయితీలను అందిస్తుందన్నారు. అధిక రసాయనిక ఎరువుల వినియోగం అనారోగ్యానికి హేతువుగా మారిందని అన్నారు. పంట దిగుబడికి అధిక డబ్బులను వెచ్చిస్తున్నా రైతులు ఆరోగ్య పరిరక్షణ కోసం రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు. పల్లెల్లో సేంద్రియ సేద్యంతో పాడి పంటలు కన్పించాలని అన్నారు. మార్కెట్‌కు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులకు అమ్మకాల సందర్భంగా ఇబ్బందులు కలిగిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులకు అవగాహన కల్పించారు. నిబంధనలను అనుసరించి, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయాధికారి సూచించారు. ఇదిలావుంటే పెద్ద నోట్ల రద్దు పరిణామంతో రైతాంగం తీవ్ర కష్టాలను ఎదుర్కొంటోంది. యాసంగి సాగు ప్రారంభమై పదిరోజులు కావస్తున్నా బ్యాంకుల ద్వారా అందాల్సిన రుణా లు రైతుల చేతికి అందడం లేదు.ఈయేడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో యాసంగి సాగుపై రైతులు భారీ ఆశలు పెట్టుకున్నారు. వానకాలంలో జరిగే సాగు అంచనాలతో సమానంగా ఈయేడు యాసంగికి రైతులు సిద్ధమయ్యారు. ఇదిలావుంటే తెలంగాణ ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ఇప్పటివరకు మనదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. తెలంగాణాలో భారీ ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి గోదావరి నది నీటిని లిఫ్ట్ చేసి లక్షల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందిస్తున్నారని తెలిపారు. దేశంలో రైతు సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఇండియన్ కిసాన్ పాలసీ తీసుకురావాలని కోరారు. విదేశాల్లో రైతులు పంటలు పండించి కారుల్లో తిరుగుతుంటే మన దేశంలో రైతులు పురుగు మందులు తాగుతున్నారని అలాంటి పరిస్థితి నుంచి రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

నామినేటెడ్ పదవులపై జోరుగా చర్చ

నిజామాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మె తరవాత ప్రత్యేక దృష్టి పెట్టిన సిఎం కెసిఆర్ ఇక చైర్మన్ నియామకంపై దృష్టి సారించారని సమాచారం. దీంతో పాటు అనేక నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తారని కూడా సమాచారం. ముఖ్యమంత్రి కేసీఆర్ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలతోపాటు పలు కార్పొరేషన్ల చైర్మన్ల నియామకాలకు సంబంధించిన ప్రకటన చేస్తారని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతున్నది.

ఆర్టీసీ చైర్మన్ పదవిని నిజామాబాద్ జిల్లాకు చెందిన శాసనసభ్యుడు బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఎంతోకాలంగా ఆయన పదవి కోసం ఎదురు చూస్తున్నారు. ఆయనకు పదవిన ఇకట్టబెడతారని జిల్లాలో ప్రచారం సాగుతోంది. గతంలో సోమారపు సత్యనారాయణకు ఆర్టీసీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఆయన ప్రస్తుతం బీజేపీలో చేరారు. ఇకపోతే అనుక చైర్మన్, డైరెక్టర్ల పోస్టుల భర్తీ కూడా జరుగుతుందని ప్రచారం సాగుతోంది. ఎన్నికలుజరగి ఏడాది కావస్తున్నందున ఇక నామినేటెడ్ పోస్టుల భర్తీ త్వరలోనే ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడిన మాజీ జడ్పీ చైర్పర్సన్ తుల ఉమకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ పదవి కట్టబెడతారని సమాచారం. ఇందుకు మాజీ ఎంపికవిత కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ చైర్మన్ల పేర్లతోపాటే మహిళా కమిషన్ చైర్పర్సన్‌గా తుల ఉమ నియామకాన్ని సీఎం వెల్లడిస్తారని చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్పర్సన్‌గా పనిచేసిన తుల ఉమ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్‌ను ఆశించారు. సిట్టింగ్ శాసనసభ్యుడు చెన్నమనేని రమేశ్‌కే కేసీఆర్ అవకాశం కల్పించడంతో తుల ఉమ ఆశలు నిరాశలయ్యాయి. ఆమె టీఆర్ఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పార్టీకి సేవలందించారు. అలాగే చైర్పర్సన్‌గా ఆమె జిల్లాలో విస్తృత సంబంధాలను ఏర్పరచుకున్నారు. ఆమెకు పదవి దక్కితే జగిత్యాల జిల్లాకు మరో చైర్మన్ పదవి లభించినట్లవుతుంది. కరీంనగర్ జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన టి.సంతోష్‌కుమార్‌కు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ పదవిని, కొలిపాక మల్లికార్జున్‌కు రాష్ట్ర మత్స్యపారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిని, సిరిసిల్ల జిల్లాకు చెందిన గూడూరి ప్రవీణ్‌కు టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కనుందని ప్రచారం సాగుతోంది. సుమారు 10మంది ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులను అప్పగించాలని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి అందుకు ఒక జాబితాను కూడా సిద్ధం చేసుకున్నారని తెలిసింది.

ఆర్టీసీ చైర్మన్‌గా బాజిరెడ్డి గోవర్ధన్ పేరు పరిశీలన?
రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్‌గా తుల ఉమ?

ఎమ్మెల్యేలలో జిల్లాకు చెందిన హుస్నాబాద్ శాసనసభ్యుడు ఒడితెల సతీష్‌బాబుకు అవకాశం దక్కుతుందని అంటున్నారు. సతీష్‌బాబును ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి మంత్రి వర్గం సమయంలోనే పార్లమెంటరీకార్యదర్శిగా నియమించారు. కోర్టు ఆదేశాల మేరకు సతీష్‌బాబు ఆ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఎమ్మెల్యేలకు అప్పగించడానికి అడ్డుగా ఉన్న ఉత్తర్వుల స్థానంలో ప్రభుత్వం కొత్తగా ఆర్డినెన్స్ తీసుకొని వచ్చింది. దీనితో ఎమ్మెల్యేల పదవుల పంపిణీకి మార్గం క్లియర్ అయింది. రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్‌గా మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పనిచేశారు. ఆయన మళ్లీ రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ పదవి ఆయనకే దక్కుతుందని భావించారు. అధినేత మాత్రం ఇప్పటి వరకు ఆ విషయంలో ఎలాంటి సంకేతాలివ్వలేదని తెలుస్తున్నది. గ్రంథాలయ సంస్థ చైర్మన్, దేవాలయాల చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పదవులను మున్సిపల్ ఎన్నికల తర్వాత భర్తీ చేయాలని అధినేత ఆలోచిస్తున్నట్లు సమాచారం.

నేరుగా సబ్సిడీ పథకాల అందచేత

రంగారెడ్డి,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): కొత్తగా ఏర్పడిన వికారాబాద్ జిల్లా పరిధిలోనే అత్యధికంగా వ్యవసాయ సాగు ఉండడంతో రైతులకు యంత్ర పరికరాల సబ్సిడీ కింద సుమారు రూ.6 నుంచి 7కోట్లు కేటాయింపు జరిపే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వచ్చే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెరగనున్నట్లు తెలిసింది. జిల్లా విషయానికి వస్తే గతంలో రంగారెడ్డి ఉమ్మడి జిల్లా ఉన్నపుడు సుమారు రూ.11కోట్ల యంత్ర పరికరాల సబ్సిడీగా కేటాయింపు జరిగేది. రైతుల ఇష్టానుసారం కొనుగోలుడీబీటీ విధానం అమలు చేయడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు ఎంత భూమి ఉన్నది, ఏ విత్తనాలు వేస్తారో వాటినే కొనుగోలు చేయడం ద్వారా వాటికి సంబంధించిన సబ్సిడీ అందజేయడం జరుగుతుంది. మరోవైపు బయటి మార్కెట్‌లో లభించే విత్తనాల ధరలు, సబ్సిడీ విత్తనాల ధరలలో కొంతమేరకే తేడా ఉంటుండడం వల్ల కూడా కొందరు రైతులు బయటి మార్కెట్‌లోని విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. మన్నికైన విత్తనాలు రైతులు నేరుగా బయటి మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం కొత్తగా డీబీటీ విధానాన్ని అమలు చేయడం ద్వారా రైతుకు మేలు కలుగుతుంది.

పేదలు - అనాథలు

మా ముత్తాత
గులాబీ పువ్వులోనో మల్లె పువ్వులోనో బృహస్పతిని దర్శించాడు,
ఇప్పుడు వీళ్లడుగుతున్నారు
"పువ్వు లంటే ఏంటి అంకుల్!"

మా తాత
మామిడి పండులోనో అరటి పండులోనో
"మదర్ థెరీసా"ను గమనించాడు,
ఇప్పుడు వీళ్లడుగుతున్నారు
"పండంటే ఏంటి ఆంటీ!"

మా నాన్న
రావి చెట్టులోనో వేప చెట్టులోనో దివ్యల్ని చూడగలిగాడు,
ఇప్పుడు వీళ్లడుగుతున్నారు
"చెట్టంటే ఏంటి డాడీ!"

మా అబ్బాయి
కూలి మనిషిలోనో బక్క రైతులోనో వీరుల్ని ధీరుల్ని వీక్షించాడు,
ఇప్పుడు వీళ్లడుగుతున్నారు!
"మనిషంటే, రైతంటే ఏంటి మమ్మీ!"

ఇప్పుడు నా మనవళ్ళు ఎన్ని కోట్లు సంపాదించినా సరే
మాతృభాష అమృతం తాగని అనాథలే,
ఆనందానుభూతు లందని
అత్యంత దయనీయమైన పేదలే!

నిజదేకోభవ...

(జనం కోసం, సమాజహితంకోసం, శ్రమైక జీవనపథాన సాగుతున్న శ్రామికదైవాలకు అంజలిఘటిస్తున్న శీర్షిక..)

ఎరుకల సోదరా నమో!

-దోరవేటి
సెల్:9866251679

కం॥ పందుల మేపుచు బిరుగుచు
చిందూకును జాలు కర్ర పాశము తోడన్
సందులు దిరిగెద వా యమ
నందను వతె ఎరుకలా! ప్రణామము గొనుమా!

చం॥ తడికల యింటిలోపలను తల్లిని, తండ్రిని, భార్య, బిడ్డలన్
విడువక నొక్కచోట తగు ప్రేమల నొల్కుచు రేబవళ్ళుయున్
గడపెద వొక్క అర్రలో; సగమ్ము గునిద్ర, సగమ్ము మేల్కతో
నడిగెద రెవ్వరయ్య నిను? నర్కతమరు భవమ్ము నీదె పో...

ఉ॥ గాలిధూళి జేరి ఖంగాళి జేయును
వన నీరు గారి పాడు జేయు
నీకు తోడు జోమ నిత్యవాసము జేయు
గుడిసె అందరికిని గుడి యనంగ.

కం॥ పందుల నాహారముగ ప
సందుగ నానువారలైన సరుకుగొనరునిన్
తెందము కన్నను మేనే
యందుబను మనుజులగని యడలకు మయ్యా!

ఉ॥ నీ పృహమందునున్న తరుణీమణులన్

ఆహ్వానము

తెలంగాణ సాహితి

4వ లిటరరీ ఫెస్ట్ సందర్భంగా

తెలుగెత్తి జైకొట్టు

శతాధిక సాహితీవేత్తల జీవితం - సాహిత్యం

అంతర్జాతీయ సదస్సు

తేది : 14,15,16 డిసెంబర్ 2019 వేదిక : సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్.

ప్రారంభ సభ : 14-12-2019, ఉదయం:11:00 గం.నుండి 12:30 వరకు

ముఖ్య అతిథి : మంగలేష్ దబ్రాల్, ప్రముఖ హిందీ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

సదస్సు ప్రారంభకులు : నందిని సిధారెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమీ

తెలుగెత్తి జైకొట్టు గ్రంథావిష్కర్త : కె. శివారెడ్డి, సరస్వతీ సమ్మాన్ అవార్డు గ్రహీత

సభాధ్యక్షులు : కె. ఆనందా చారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సాహితి

విశిష్ట అతిథులు :

సి. మృణాలిని, పూర్వ ఆచార్యులు, తెలుగు విశ్వవిద్యాలయం

జాలూరి గౌరీ శంకర్, జిసి కమీషన్ సభ్యులు, అధ్యక్షులు, హైదరాబాద్ బుక్ ఫెయిర్

ఎండూరి సుధాకర్, ఆచార్యులు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం

తెలకపల్లి రవి, ప్రముఖ విమర్శకులు, రాజకీయ విశ్లేషకులు

ఖాదర్ మొహియుద్దీన్, ప్రముఖకవి

చంద్రబోస్, ప్రముఖ సినీగేయ రచయిత

యాకూబ్, ప్రముఖకవి

ఝన్వా శ్రీనివాసరావు, ప్రముఖకవి

సూర్య ధనుంజయ్, అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

గోరటి వెంకన్న, ప్రజా వాగ్గేయకారుడు

సమన్వయం :

వల్లభాపురం జనార్దన, రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ సాహితి

స్కూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ సాహితి

భూపతి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ సాహితి

సదస్సు లక్ష్యం : అనంతోజు మోహన్ కృష్ణ

ఆహ్వానం : నస్రీన్ ఖాన్ వందన సమర్పణ : జి.నరేష్

మొదటి సమావేశం 14-12-2019, మ.12:45 నుండి 2:15 వరకు

సభాధ్యక్షులు : తంగిరాల చక్రవర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ,తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథులు : ఆర్. సీతారాం, కాళోజీ అవార్డు గ్రహీత

బైసా దేవదాసు, సంపాదకులు, నేటి నిజం

ఆహ్వానం: తాళ్లపల్లి యాకన్న వందన సమర్పణ : పాన్నం రాజయ్య గౌడ్

భోజన విరామం : 2:15 నుండి 3:00 వరకు

రెండవ సమావేశం 14-12-2019, మ. 3:00 నుండి 4:30 వరకు

సభాధ్యక్షులు : ఖాజామైనొద్దీన్, మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి , తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథులు : పిల్లలమర్రి రాములు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం,

పత్తిపాక మోహన్, సంపాదకులు, కార్యక్రమాధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్

ఆహ్వానం : నందిగామ కిషోర్ వందన సమర్పణ: తండా హరీష్ గౌడ్

టీ విరామం : 4.30 నుండి 4:45 వరకు

మూడవ సమావేశం 14-12-2019, మ. 4:45 నుండి 6:00 వరకు

సభాధ్యక్షులు : మందవ సుబ్బారావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథి : ఎస్. రఘు, అధ్యక్షులు, తెలుగు శాఖ, ఉమెన్స్ కాలేజ్, కోఠి

ఆహ్వానం: సొంబరాజు యాదగిరి వందన సమర్పణ : పురుషోత్తం సతీష్

అభినందన సభ 6.00 నుండి 6.30 వరకు

పాల్కంపల్లి శాంతాదేవి, అంపశయ్య నవీన్

కూరెళ్ల విఠలాచార్య, చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ

మోతుకూరి నరహరి, పాత్తూరి సుబ్బారావు

తాటికొండల నరసింహారావు, మాలశ్రీ

కాలువ మల్లయ్య, గులాబీల మల్లారెడ్డి

తెలిదేవర భానుమూర్తి, సుధామ

14-12-2019, మ.4:45 నుండి 6:00 వరకు

కవిసమ్మేళనం : 6.30 - 8.00 వరకు

ముఖ్య అతిథులు : ప్రసేన్, ప్రముఖ కవి

నిర్వహణ : కంచర్ల శ్రీనివాస్ ,మందా వెంకట్,సలీమ

నల్లమల పుస్తకావిష్కరణ

15-12-2019, ఉ.9:30 నుండి 10:30 వరకు

ముఖ్యఅతిథి : ఎస్వీ సత్యనారాయణ, పూర్వ ఉపాధ్యక్షులు, తెలుగు విశ్వవిద్యాలయం

ఆవిష్కరణ : కె.శ్రీనివాస్, సంపాదకులు, ఆంధ్రజ్యోతి

విశిష్ట అతిథి: గుడిపాటి, ప్రముఖ విమర్శకులు

సభాధ్యక్షులు: భూపతి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ,తెలంగాణ సాహితి

పుస్తక పరిచయం: జ్యోతి, వ్యవస్థాపకులు, స్క్రిబింగ్ లైట్

సమన్వయం : నస్రీన్ ఖాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు,తెలంగాణ సాహితి

ఆహ్వానం : సయ్యద్ ముజాహిద్ అలీ వందన సమర్పణ : గౌస్‌పాషా

నాలుగవ సమావేశం 15-12-2019, ఉ.10:30 నుండి మ.12:00 వరకు

సభాధ్యక్షులు : స్కూల్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు , తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథి : పంతంగి వెంకటేశ్వర్లు, కాకతీయ విశ్వవిద్యాలయం

ఆహ్వానం : తాతోలు దుర్గాచారి వందన సమర్పణ : రవీంద్ర రావెళ్ల

టీ విరామం : 12.00 నుండి 12:15 వరకు

విదవ సమావేశం 15-12-2019, మ.12:15 నుండి 1:45 వరకు

సభాధ్యక్షులు : మాడుగుల రాములు రాష్ట్రసహాయ కార్యదర్శి, తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథి : ఎస్.త్రివేణి, అధ్యక్షులు, తెలుగు శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం

ఆహ్వానం : పుష్పలత వందన సమర్పణ : పెద్దోజు నరేష్

భోజన విరామం 1.45 -2.30 వరకు

ఆరవ సమావేశం 15-12-2019, మ.2:30 నుండి 4:00 వరకు

సభాధ్యక్షులు : వెన్నెల సత్యం, రాష్ట్ర కమిటీ సభ్యులు , తెలంగాణ సాహితి

ముఖ్య అతిథులు :

తిరునగరి చక్రధర స్వామి, అధ్యక్షులు, తెలుగు శాఖ శాతవాహన విశ్వవిద్యాలయం

మౌనశ్రీ మల్లిక్, సినీ గేయ రచయిత

ఆహ్వానం : అరుణ్ కుమార్ వందన సమర్పణ : శ్రీనిధి

టీ విరామం 4.00 -4.15 వరకు

ఏడవ సమావేశం 15-12-2019, 4.15 నుండి 5.45 వరకు

సభాధ్యక్షులు : సలీమ, రాష్ట్ర సహాయకార్యదర్శి , తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథి: బెల్లి యాదయ్య, ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామప్పపేట

ఆహ్వానం: నర్రా ప్రవీణ్ రెడ్డి వందన సమర్పణ: సర్గరాజీ అన్వర్

అభినందన సభ 6.00 నుండి 6.30 వరకు

వేణు సంకోజు, రామిశెట్టి రోశయ్య

తిరునగరి దేవకీ దేవి, విహారి

టి.సి.వసంత, షాహనాజీ

గులాబీల మల్లారెడ్డి, జీవన్

జి.యాదగిరి రావు, శిరంరెట్ల కాంతారావు

దార్ల రామచంద్రం, జనజ్వాల

సత్యభాస్కర్, ఆనంద కుమార్

కంబేపె రాణీ ప్రసాద్, సయ్యద్ నశీర్ అహ్మద్

కవిసమ్మేళనం 6.30 - 8.00

ముఖ్య అతిథులు : జి.ప్రసాద మూర్తి, ప్రముఖ కవి

నిర్వహణ : కపిల రాంకుమార్, గేరా, బైల ఇందిర, చరణ్

ఎనిమిదో సమావేశం 16-12-2019, ఉ.9:30 నుండి మ.11:00 వరకు

సభాధ్యక్షులు : వహీద్ ఖాన్, నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి , తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథి : ఏనుగు నరసింహారెడ్డి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమీ

ఆహ్వానం : గడీల సుధాకర్ రెడ్డి వందన సమర్పణ : జి.ప్రభాకర్

టీ విరామం 11.00 -11.15 వరకు

తొమ్మిదో సమావేశం 16-12-2019, ఉ.11:15 నుండి మ.12:45 వరకు

సభాధ్యక్షులు : కటుకోర్యుల రమేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి , తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథి : శిలాలోలిత, ప్రముఖ కవయిత్రి

ఆహ్వానం : ప్రతిభా భారతి వందన సమర్పణ: డి.సైదులు

పదో సమావేశం 16-12-2019, ఉ.12:45 నుండి మ. 2:15 వరకు

సభాధ్యక్షులు : పులిమళ్ల సునంద, రాష్ట్రకమిటీ సభ్యురాలు, తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథి : పులికొండ సుబ్బాచారి, విశ్రాంత ఆచార్యులు, ద్రవిడ విశ్వవిద్యాలయం

ఆహ్వానం : మహేష్ దుగ్గె వందన సమర్పణ : వీర్ల రాము

భోజన విరామం : 2.15 - 3.00

పదకొండో సమావేశం 16-12-2019, మ. 3:00 నుండి మ.4:30 వరకు

సభాధ్యక్షులు : జి.నరేష్, హైదరాబాద్ నగర అధ్యక్షులు , తెలంగాణ సాహితి

ముఖ్యఅతిథి : వరప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు, సాహితీ స్రవంతి

ఆహ్వానం : పాల్కం సైదులు వందన సమర్పణ : రామ్ పెరుమాండ్ల

పౌరసత్వ బిల్లుపై విపక్షాల అనవసర రాద్ధాంతం

పాక్ గొంతుకను వినిపిస్తున తీరు దారుణం

సువర్ణాక్షరాలతో లిఖించ దగ్గ చట్టం

ఇదో చారిత్రక చట్టమని చెప్పిన ప్రధాని మోడీ

బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నేతలకు దిశానిర్దేశం

న్యూఢిల్లీ,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకించడాన్ని ప్రధాని మోదీ తప్పు పట్టారు. విపక్షాల తీరును ఎండగట్టారు. దాయాది దేశమైన పాకిస్థాన్ ఎలా మాట్లాడుతుందో తూచ తప్పకుండా కొన్ని ప్రతిపక్షాలు అదే పరిభాషలో మాట్లాడుతున్నాయని అన్నారు. బుధవారంనాడు రాజ్యసభలో పౌరసత్వ సవరణ బిల్లు ప్రవేశపెట్టడానికి ముందు, సభలో అనుసరించాల్సిన వ్యూహంపై నిర్వహించిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ, ప్రతిపక్షాల తీరును ఎండగట్టాలని అధికార పార్టీ ఎంపీలకు పిలుపునిచ్చారు. కొన్ని పార్టీలు దీనిపై పాక్ లా మాట్లాడుతున్నాయన్న విషయాన్ని మన పార్టీ ఎంపీలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మోదీ సూచించార ÷ఎపౌరసత్వ బిల్లుపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఎంపీలకు సూచించారు. కాగా, పౌరసత్వ బిల్లు అనేది సువర్ణాక్షరాలతో లిఖించిన బిల్లు అవుతుందని ప్రధాని పేర్కొన్నట్టు సమావేశానంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మీడియాకు తెలిపారు. సాధారణ మెజారిటీతో బిల్లు నెగ్గుతుందనే నమ్మకం తమకు ఉందని ఆయన చెప్పారు. కీలకమైన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం పార్లమెంటు లైబ్రరీలో ప్రారంభమైంది. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. కీలకమైన పౌరసత్వ బిల్లు రాజ్యసభలో ఇవాళ మధ్యాహ్నం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రవేశపెడుతున్నందున దీనిపై అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానంగా ఈ సమావేశంలో చర్చించారు. కాగా, బిల్లుపై రాజ్యసభలో జరగనున్న చర్చలో కాంగ్రెస్ నేత కపిల్ సిబల్, టీఎంసీకి చెందిన డెరెక్ ఒబ్రెయిన్, సమాజ్‌వాదీ పార్టీ నుంచి రామ్‌గోపాల్ యాదవ్ పాల్గొనున్నారు. ప్రధాన పార్టీలు ఇప్పటికే తమ ఎంపీలకు విప్ జారీచేశారు. కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీల వ్యతిరేకత, ఈశాన్య రాష్ట్రాల్లో బిల్లుకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల తీవ్ర నిరసనల మధ్య బిల్లును రాజ్యసభలో ప్రవేశపెడుతుండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

రైతుల డిమాండ్ మేరకు రబీకి నీటి విడుదల: జగదీష్ రెడ్డి

నల్లగొండ, డిసెంబర్ 11: నాగార్జున సాగర్ ఆయకట్టు రైతుల డిమాండ్ మేరకు రబీ పంటకు నీటి విడుదల చేయనున్నట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లాలోని మంత్రి నేడు పర్యటిస్తున్నారు. పర్యటన సందర్భంగా నిడమనూరు మండలం ముకుందాపురంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడి నుంచి బయల్దేరి హాలియా మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శ్రీకారం చుట్టారు. హాలియాలో జరిగిన మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నోముల నర్సింహాయ్య, భాస్కర్ రావు, ఎమ్మెల్సీ తేర చిన్నపరెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు యడవల్లి విజయేందర్ రెడ్డి, ఎం.సీ.కోటిరెడ్డి, రామచంద్ర నాయక్, కే.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అన్నారు. రూ.లక్ష రుణమాఫీతో రైతు శ్రేయస్సు మొదలైందన్నారు. రైతుబంధు, రైతు బీమా సీఎం కేసీఆర్ సంకల్పానికి దీక్సూచిలన్నారు. గత పాలకులు ఐదు దశాబ్దాలుగా వ్యవసాయరంగాన్ని నాశనం చేశారన్నారు. విత్తనాలు, ఎరువులు, విద్యుత్ కోతలతో వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెట్టారన్నారు. కాగా తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేన్నారు. రైతుల డిమాండ్ మేరకు రబీకి సాగునీటిని విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రజా ప్రతిఘటనతో అవినీతి నిర్మూలన

"అవినీతి వ్యతిరేక కవి సమ్మేళనం"లో అవినీతి నిరోధక శాఖ అధికారి సురేష్ బాబు

ప్రజలలో ప్రతిఘటన, చైతన్యం, సహకారం ఉంటేనే అవినీతి నిర్మూలన సాధ్యపడుతుందని గుంటూరు అవినీతి నిరోధక శాఖ అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ ఏ. సురేష్ బాబు తెలిపారు. గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, అమరావతి సాహితీమిత్రులు సంయుక్తంగా అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన "అవినీతి వ్యతిరేక కవి సమ్మేళనం" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజలు ఒక అడుగు ముందుకు వేస్తే అవినీతి నిరోధక శాఖ పది అడుగులు ముందుకు వేస్తుందని తెలిపారు.

ఆధునిక సమాజంలో మనుషుల్లో ఆశ బాగా పెరిగిపోయి అవినీతి పెరిగిందని వివరించారు. విలువలు కలిగిన మంచి మనుషులు కూడా ఇంకా కొందరున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి తరం నీతి మార్గంలో నడుస్తూ దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపు ఇచ్చారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. గుంటుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ అవినీతి దుష్ఫలితాలు ప్రజలు బాగా గుర్తించాలని, అవినీతిని నిర్మూలించే శక్తులకు సహకరించాలని సూచించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడెమి బహుమతి గ్రహీత డా. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కవులు నిరంతరం సమాజంలో అప్రమత్తంగా ఉండాలని, చైతన్య కవిత్వం రాయాలని తెలియజేసారు. విషయాన్ని మనోహర శిల్పంతో జోడించి చెబితే కవిత్వం బాగుంటుందని వివరించారు. అమరావతి సాహితీమిత్రులు అధ్యక్షులు డా. రావి రంగారావు మాట్లాడుతూ అవినీతి వ్యతిరేక కవి సమ్మేళనం, కవితల పోటీల లక్ష్యాలను తెలియజేశారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సంస్థాపకులు డాక్టర్ టి. సేవకుమార్ అధ్యక్షత వహించిన సభలో అవినీతి వ్యతిరేక కవితల పోటీ విజేతలకు బహుమతు లందించారు. ప్రథమ బహుమతి పొందిన చొక్కాపు లక్ష్మి నాయుడు(విజయనగరం), ద్వితీయ బహుమతి పొందిన రాంభక్త పద్మావతి(విశాఖపట్నం), తృతీయ బహుమతి పొందిన డా. బీరం సుందరరావు(చీరాల), ప్రత్యేక బహుమతులు పొందిన సూర్యదేవర రవికుమార్ (గుంటూరు), ఆకొండి శైలజ (విజయనగరం), చివటం శ్రీనివాసరావు (పశ్చిమ గోదావరి జిల్లా), డి.ఎన్.వి. రామ శర్మ (బెంగుళూరు)లను అతిథులు, సంస్థల ప్రతినిధులు నగదు బహుమతులతో, శాలువాలతో, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. తొలుత సీనియర్ సిటిజెన్స్ అసోషియేషన్ నాయకులు నూతలపాటి తిరుపతయ్య కవుల్ని ఆహ్వానిస్తూ స్వాగత ప్రసంగం చేసారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో గడల శివప్రసాద్ (తాడేపల్లిగూడెం), బిత్రా నాగమల్లేశ్వరరావు (చీరాల), వావిలాల నరసింహారావు (విజయవాడ), ఆళ్ళ నాగేశ్వరరావు (తెనాలి), లలితానంద్ (దుగ్గిరాల), రాణిజెట్టి లక్ష్మీసంధ్య, డా. రామదుగు వేంకటేశ్వరశర్మ, ఖాజా వలి మొదలైన కవులు పాల్గొన్నారు.

భాషా పరిరక్షణకు రావిచెట్టు రంగారావు కృషి ఎనలేనిది

రావిచెట్టు రంగారావు నెలకొల్పిన శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం భాషా పరిరక్షణకు చేసిన కృషి ఎనలేనిదని అధికార భాషా సంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకరరావు అన్నారు. సుల్తాన్ బజార్‌లో గల శ్రీకృష్ణదేవయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో భాషా నిలయం వ్యవస్థాపక రావిచెట్టు రంగారావు జయంతి సందర్భంగా ఆయన పేరిట ఏర్పాటు చేసిన తెలుగు భాషా వికాస పురస్కారాన్ని 2019 సంవత్సరానికి గానుసుప్రసిద్ధ రచయిత, బహుగ్రంథకర్త డాక్టర్ ఎస్. రంగాచార్యులుకు మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేసి ఘనంగా సతం&రించారు. భాషా నిలయం అధ్యక్షులు నూతి శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో అధికార భాషా సంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకరరావు ముఖ్య అతిథిగా హాజరై రావిచెట్టు రంగారావు వ్యక్తిత్వాన్ని, ఎంఎల్ నరసింహారావు కార్యదర్శిగా చేసిన కృషిని ఆయన కొనియాడారు. గ్రంథాలయాలు లేని రోజులలో నిజాం రాచరిక పాలనలో తెలుగు ప్రజలను చైతన్యం చేసేల భాషా నిలయాన్ని నెలకొల్పారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతంలో 120 సంవత్సరాల చరిత్ర కలిగిన భాషా నిలయం అంత గొప్ప గ్రంథాలయం మరొకటి లేదన్నారు. సాహసంతో నెలకొల్పిన భాషా నిలయం భవిష్యత్తు తరాలు పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఓయు తెలుగు శాఖాచార్యులు ఆచార్య నిత్యానందరావు పాల్గొని తెలుగు భాషకు శ్రీకృష్ణదేవరాయలు చేసిన కృషిని గుర్తు చేశారు.

'సాహితీ కౌముది' నూతన సాహితీ సంస్థ ఆవిర్భావం

ఇటీవల మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో నూతన సాహితీ సంస్థ 'సాహితీ కౌముది' ఆవిర్భావంలో ముఖ్య అతిథిగా లయన్ వైకె. నాగేశ్వరారావు, సభాధ్యక్షులుగా ఆర్. అనంత పద్మనాభరావు, విశిష్ట అతిథులుగా గుదిబండి వెంకటరెడ్డి, లయన్ వి.వి.రాఘవరెడ్డి, కె. సత్యన్నారాయణ, సంస్థ అధ్యక్షులు వి.వి.సత్యప్రసాద్, కార్యదర్శి పెద్దూరి వెంకటదాసు, ఉపాధ్యాక్షురాలు శ్రీమతి మల్లాది విజయలక్ష్మి, వ్యాఖ్యాత శ్రీమతి జ్యోతిరాజ్ పాల్గొన్నారు.

పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ర్యాలీ

అంజన్ తదితరుల అరెస్ట్

హైదరాబాద్,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ఏఐసీసీ పిలుపు మేరకు ప్రజా వ్యతిరేక పౌరసత్వ సవరణ బిల్‌కు వ్యతిరేకంగా బుధవారం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని హైదరాబాద్ సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ చెప్పారు. ఈ బిల్ కొన్ని వర్గాలకు మాత్రమే మద్దతుగా వుందని, మోదీ, అమిత్ షాలు పౌరసత్వ సవరణ బిల్లు, జీఎస్టీ ఇలా ఏదోకరమైన బిల్లులు తీసుకువచ్చి ప్రజలపై భారం వేసున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రజా వ్యతిరేకంగా బిల్లును పాస్ చేశారన్నారు. మోదీ, అమిత్ షాలు దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. ముస్లింలకు పౌరసత్వం ఉండదన్న వాదన వస్తోందని, అందుకే తాము ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నామన్నారు. భారత దేశం అంటే సెక్యులర్ దేశమని, ఈ పౌరసత్వ బిల్లు అన్నివర్గాలకు ఆమోదయోగ్యాంగ ఉండాలని అంజన్ కు మార్ యాదవ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. పౌరసత్వ బిల్ కు వ్యతిరేకంగా హైదరా బాద్ కాంగ్రెస్ అధ్యక్షులు అంజనీ కుమార్ ర్యాలీ నిర్వహించారు. గాంధీ భవన్ నుండి అంజనీ కుమార్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. దీంతో పర్మిషన్ లేకుండా ర్యాలీ తీయడంతో అంజనీకుమార్‌ను ఆయనతో ఉన్న అనిల్ కుమార్ యాదవ్ తో పాటు పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

బీహార్‌లో దారుణ ఘటన

బాలికను గర్భతిని చేసిన దుండగుడు

పెళ్లి చేసుకోమన్నందుకు తగులబెట్టి పరార్

పాట్నా,డిసెంబర్11(ఆర్ఎన్ఎ): ఇటీవల ఉన్నావ్, దిశ ఘటనలు జరిగినా దేశంలో మహిళలపై ఆకృత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా బీహార్‌లో ఉన్నావ్ తరహా ఘటన చోటుచేసుకుంది. ఓ బాలికను గర్భవతినిచేసి, పెళ్లి చేసుకోమన్నందుకు సజీవంగా తగులబెట్టాడు. బెట్టయ్య జిల్లాలోని ఓ గ్రామంలో ఒక యువకుడు మైనర్ యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. బాలిక ఒకనెల గర్భంతో ఉండగా, యువకుడిని పెళ్లి చేసుకోమని కోరింది. ఈ నేపథ్యంలో పెళ్లికి నిరాకరించిన యువకుడు, తన స్నేహితులతో కలిసి ఒంటరిగా ఉన్న బాలిక ఇంట్లోకి వెళ్లి కిరోసిన్ పోసి నిప్పంటించాడు. దీంతో స్పందించిన స్థానికులు బాధితురాలిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు పాట్నాకు తీసుకెళ్లమని సూచించారు. పాట్నాకు వెళ్లేదారిలో బాధితురాలు 80 శాతం కాలిన గాయాలతో మంగళవారం మరణించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు, అతని స్నేహితుల కోసం గాలిస్తున్నారు.

సంస్కరణలకు ఆధ్యుడు 'కట్టమంచి'



సాహిత్యంలోని విభిన్న ప్రక్రియల్లో రచనలు చేసి భారత విద్యావ్యవస్థలో సంస్కరణలకు ఆధ్యుడైన బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి రామలింగారెడ్డి అని మాజీ గవర్నర్ డాక్టర్ కె. రోశయ్య పేర్కొన్నారు. ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అమీర్‌పేటలోని మాజీ గవర్నర్ క్యాంపు కార్యాలయంలో సుప్రసిద్ధ సాహితీవేత్త కట్టమంచి రామలింగారెడ్డి 140వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత చిమ్మపూడి శ్రీరామమూర్తిని మాజీ గవర్నర్ రోశయ్య సత్కరించారు. ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ కట్టమంచి సేవలను గుర్తు చేసుకున్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రచయిత శ్రీధరమూర్తి మాట్లాడుతు విద్యార్థి దశ నుంచే కట్టమంచి సాహిత్యంలో ఎన్నో ప్రయోగాలు చేసే వారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరేందర్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి త్రినాథరావకు ఆత్మీయ సత్కారం

జీవీఆర్ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాడుతా తీయగా శీర్షికన సినీ సంగీత విభావరి గానసభ ప్రధాన వేదికలో జరిగింది. సంస్థ అధ్యక్షుడు జీ. శ్రీనివాసనాయుడుతో పాటు రేణుక, రేవతి, శారద, రాజని, శోభారాణి, వేణుగోపాలరావు, వెంకటేశ్వరరావు, రమణరాజు, వీరేందర్, యాదగిరి, సుబ్బిరెడ్డిలు సినీగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, వంశీరామరాజు, దైవజ్ఞశర్మ, నాగేంద్రరావు అతిథులుగా పాల్గొని గాయనీ గాయకులను అభినందించారు. ఘంటసాల జయంతిని పురస్కరించుకుని గాయకుడు త్రినాథరావును ఆత్మీయంగా సత్కరించారు.

నవలా పురస్కారం-2019

కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం కోసం 2017-19 మధ్య ముద్రితమైన తెలుగు నవలా పురస్కారానికి గాను రచయితలు తమ మూడేసి ప్రతులను పరిశీలనార్థం పంపగోరుతున్నాం. ఒక రచయిత ఒకటికంటే ఎక్కువ ఎన్నైనా పంపవచ్చు. నవలలు 2020 జనవరి 12లోగా అందేట్లు పంపాలి. చిరునామా: డాక్టర్ కొలకలూరి సుమకిరణ్, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి-517 502.

-కొలకలూరి సుమ కిరణ్, సెల్: 9963564664

కథానిక పురస్కారం-2020

కొలకలూరి భాగీరథి కథానికా పురస్కారం కోసం 2017-19 మధ్య ముద్రితమైన కథానికా సంపుటి, మూడేసి ప్రతులు పంపించాలని కోరుతున్నాం. ఎన్ని సంపుటాలైనా పంపవచ్చు. చిరునామా: ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి-517 502,

-ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, సెల్: 9441923172

నవలా స్రవంతి

తెలంగాణ సాహిత్య అకాడమీ నెలనెలా 'నవలా స్రవంతి'లో భాగంగా 2019 డిసెంబర్ 13న, సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో సభ జరుగుతుంది. సిధారెడ్డి అధ్యక్షతన జరుగు సభలో సాహు, అల్లం రాజయ్య నవల 'కొమురం భీము'పై ఆచార్య కాత్యాయని విద్మహే ప్రసంగం ఉంటుంది.

- డా॥ ఏనుగు నరసింహారెడ్డి
తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి

రచనలకు ఆహ్వానం

శివేగారి దేవమ్మ స్మారక జాతీయ పురస్కారం కోసం రచయితల నుంచి 2017,18,19 సంవత్సరాల్లో ప్రచురించిన నవల, కథ, వ్యాసాలు, కవిత, లఘుకవిత సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. రచనలు 2019 డిసెంబర్ 31లోపు అందేలా పంపాలి. చిరునామా: శివేగారి చిన్నికృష్ణ, 1-76, కాలువపల్లి పోస్ట్, ఎంపీ కోటూరు, మండలం: పలమనేరు, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-517 408 శివేగారి చిన్నికృష్ణ